

OTI

జ్యోతి

జూలై 1973

సచిత్ర మాస పత్రిక సంపుటి 11; సంచిక 6.

విషయసూచిక

ముఖచిత్రం శ్రీవాణీ కంబైన్స్‌వారి "స్నేహబంధం"లో జమున

సంస్థాపకులు: కీ శే వి వి రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్: శ్రీమతి వి. లీలావతీ రాఘవయ్య

చిరునామా జ్యోతి, 7 A శివాజీ స్ట్రీట్, టి నగర్, మద్రాసు-17.

'?/-, (ప్రత్యేక సంచికతోసహా) రు 15/-



మా "తాత - మనవడు"
చిత్రాన్ని అపూర్వంగా
ఆదరించిన ప్రేక్షక
మహాశయులకు.

"తాత - మనవడు" శత
దినోత్సవ శుభసందర్భ
మున నా హృదయ
పూర్వక కృతజ్ఞతాభి
వందనలు.

—కె. రాఘవ
నిర్మాత,
ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్.

శతదినోత్సవం

29-6-1973

PRATAP ART PRODUCTIONS

ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్

తాత - మనవడు

నిర్మాత
కె. రాఘవ

కథ మాటలు స్క్రీన్‌ప్లే దర్శకత్వం
దాసరి నారాయణరావు

విడుదల: ఆంధ్ర తారకరామ సీడెడ్ నవభారత్ నైజాం శ్రీతారకరామా

తొలిమాట

ఈసారి పాఠకుల వద్ద నుండి అనుకున్న దానికన్నా ఎక్కువగానే ప్రోత్సాహము వచ్చింది వచ్చిన ఉత్తరాల నన్నిటిని స్థలాభావము వలన ప్రచురించ లేకపోతున్నందుకు చింతిస్తున్నాము

"ఇది ఒక వింత ప్రపంచము" అవును నిజంగానే ఇది ఒక వింత ప్రపంచము మానవుడు మంచిగా గాని, చెడుగా గాని విపరీతంగా పురోగమిస్తున్న కాలమిది. ఒక్కొక్కసారి మానవుడు సాధించిన ప్రగతిని తల్చుకుంటే అతనికే ఆశ్చర్యం కలుగుతుందేమో మరి. ముందుకు పోతున్న ప్రతి అడుగులోను మంచీ, చెడూ రెండూ ఉంటాయి. ఇటువంటి మంచి చెడులలో మనము ఊహించలేని, మన ఆలోచనలకు అందని వింతలు, విశేషాలు ఎన్నో జరుగుతూ ఉంటాయి. వాటిలో కొన్నిటినైనా ఈ శీర్షిక క్రింద ఇవ్వాలని మా అభిలాష. చూడండి పేజి 19

వె. వేణుగోపాలరావు

జూన్ నెల 'జ్యోతి' క్రొత్త చిగుళ్ళను తొడుక్కొని కళకళలాడుతూ అత్యంతాకర్షణీయముగా పట్నంలోవున్న మా "శాలిబండ" కు కూడా చేరింది

ముఖ్యంగా యువతరానికి వెల్గుబాట, గత తరపు పెట్టని కోట "తాతాజీ"గారిని గురించి చదువుతున్నంతసేపూ మాకు తెలియకుండానే మా కనులనుండి అశ్రువులు స్రవించినవి ఒక ప్రముఖ విమర్శకులు, సంఘ సంస్కర్త, సినిమా రచయితగాకూడా ఖ్యాతిపొందిన ఈ యశస్వి మయం రచయితల ఉద్యమానికే తీరని లోటు। నిజంగా ఆయన ధన్యజీవి ఆత్మకు శాంతి లభించుగాక।

కథలలో అర్థి & ముఖర్జీగారి 'డెత్ ప్రజంటేషన్' కథ మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది ఇంకా 'రచయిత్రి భర్త', 'మనిషీ–మనిషి మధ్య' కథలు పాఠకుల మనస్సులలో చిరస్థాయిగా నిలిచి ప్రథమ స్థానాన్ని పొందాయి మరచిపోదామన్నా మరువలేని మరపురాని సీరియల్ కె రామలక్ష్మిగారి "మూడోమనిషి" మున్ముందు ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠని కలిగిస్తోంది 'శోషలిజం భవితవ్యం' లో వైమురళీధర్‌గారి కవిత చదువుచున్నంతసేపూ మా ఎదలపై పన్నీటిజల్లు కురిసినట్లుగా ఉంది ఇంత చక్కని కథలను, సీరియల్స్ మా కందిస్తున్న సంపాదకులకు ముఖ్యంగా రచయిత (త్రు) లకూ మా ధన్యవాదాలు

—కె హరనాధ్,
—కె రాజ్యలక్ష్మి
—కె వరదయ్య,
హైదరాబాదు

సంపాదకులకు,

"అయ్యో రామారావూ, అయిపోయింది" అని సార్వభౌమగారి కథ, 'రచయిత్రి భర్త' లో కథానాయకుడు ఎన్నిసార్లు బాధపడ్డాడోగాని, జూన్ నెల 'జ్యోతి' ని చదవడం పూర్తయిపోగానే నేను మాత్రం చాలాసార్లు బాధపడ్డాను. అయిపోయింది, అయ్యో అయిపోయింది (చదవడంలే సుమండీ) మళ్ళానెల వరకూ చూడలేం కదాఅని సార్వభౌమగారి కథ చాలా బావుంది ప్రభుత్వం కొంతమంది పేదవారికి చేయూతనిస్తున్నా దాన్నిఅందుకోనివ్వకుండా వాళ్ళని అధఃపాతాళానికి లాగేసి, వాళ్లు సహాయం పొందకుండా మరింత అసహాయులని చేసే 'అయ్‌గార్లు' మిగతా 'చినయ్‌గార్లూ' ఎంతోమందిఉన్నారన్న సంగతిని పాఠకుల దృష్టికి తెచ్చేరు అర్థి & ముఖర్జీ తమ 'డెత్ ప్రజంటేషన్' కథలో, 'డెత్ ప్రజంటేషన్' అందుకునేందికి ముత్యాలుకి సహాయ పడవలసిన కార్యాలయ సిబ్బంది పాపం నిజంగానే శాయశక్తులా సహాయపడ్డారు డెత్ ప్రెజంట్ చేయడంకోసం ఈ కథ గురించి 'తొలిమాట' లో చెప్పిన మాటలే చాలు ఆ కథను చదివించడానికి

—తాతా విశ్వనాధశాస్త్రి.
విశాఖపట్నం

సంఘర్షణ

జంగా గాంధీజీ

పుడమితల్లి జనత భారము వహించలేక
సిమ్మెంటులో బుగ్గి కలిపికట్టిన
కంట్రాక్టు వంతెనలా ఊగుతూంటే
మనుగడ భారము మోయలేక,
అప్పిచ్చిన వాడికి సమాధానం చెప్పుకోలేక
శకాలైకలై పోతున్న కరిక దరిద్రుడి మదిలో
మొలకెత్తింది భయంకరమైన చావు పదం
ప్రాణం తీసుకుందామని రైలు గట్టెక్కిన
అతగాడి కళ్ళకి తనకోసం కళ్మలం వీధిలోని
గుడిశలో కూర్చుని ఎదురుచూస్తున్న
ఆకలి కళ్లు కన్పించాయి
రెండు నిముషాలు మనసుతో పడ్డాడు సంఘర్షణ
గుండె నెవరో పిండినట్టయింది
హృదయం మూలిగింది మూగగా వెనక్కి మళ్ళాడు
భారంగా అడుగు లేస్తున్నాడు
చైత్ర మాసానికి స్వాగతం పలుకుతూ
కోకిల కంఠమెత్తి తీయగా హాయిగా పాడుతూంటే
మెదడు బరువెక్కి నడుస్తున్న
అతగాడి మదిలో లేదో ఆశ మొలకెత్తింది
కోకిల కంఠంలోని మాధుర్యానికి
అతడి ఫలలము భారము దింపుకుంది
ఏదో వెలుగు కన్పించింది..
వేగంగా అడుగులేస్తూ తన ప్రతిబింబాలే
తన జీవితానికి వెలుగని తన మస్తిష్కానికి
సమాధానం చెప్పి నడుస్తున్నాడు
ముందు కదుగేస్తున్నాడు

స్పెషల్ ప్రీవ్యూ

కల్పనాలయా వారి

మేమూ మనుషులమే

మిగతా అందరిలాగే 'మేమూ మనుషులమే' అని చెప్పుకోవలసిన స్థితిలో యిప్పటికీ ఎంతోమంది మనుషులు అంటరానివారిగా వెలివేయబడి బ్రతికే జాతిగా ఇప్పటికీ ఉన్నారు. వాళ్ళనిచూస్తే కుక్కలు కూడా లోకువచేసి అరుస్తూ కరవడానికి వెంటబడే స్థితిలో జీవనం సాగిస్తున్నవారికి మిగతా అందరిలాగానే విజ్ఞానం పొందడానికీ, సంఘంలో మంచి స్థానాన్ని సంపాదించుకోవడానికీ అవకాశాలెందుకుండరాదు? ఎందుకుండరాదనే ప్రశ్న వేసుకొన్న చిత్ర నిర్మాత శ్రీమతి వాసంతి ఆ ప్రశ్నకు ప్రేక్షకులను కూడా అడిగిచూస్తే బాగుంటుందనుకొన్నారు. ఈ వెనుకబడిన జాతి దీనస్థితిని కళ్ళకు కట్టినట్లుగా చిత్రీకరించిన 'మేమూ మనుషులమే' చిత్రం ద్వారా ఆ ప్రశ్న మిమ్మల్ని చేరుకొంటుంది

'మేమూ మనుషులమే'

అని చెప్పుకోవలసిన స్థితిలో వున్నది కేవలం, పైనచెప్పిన వెనుకబడిన జాతిలోని మనుషులే కాదు. పూర్తిగా 'ప్రగతి' సాధించిన వ్యక్తులలోనే కొందరుంటారా స్థితిలో. అవును మరి తాము మనుషులమే అన్న విషయం మరచి, మానవత్వం అన్న మాటను సమాధిచేసి, రాక్షసులు కూడా సిగ్గుతో తలవంచుకొనే విధంగా అవినీతి పనులుచేస్తూ, పేదవారి పొట్టలు కొట్టి, తాము కోటలుకట్టే మనుషులు మనుషులెలా అవుతారు? రాక్షసులే అవుతారు.





అందుకే వారూ మేమూ మనుషులమే అని చెప్పుకోవా లొక్కోసమయంలో సంఘంలో పెద్దమనుషులుగా చలామణి అవుతూ పదవులు చేపట్టి అక్రమ సంపాదన కల వాటుపడ్డ పెద్దమనుషుల రహస్యాలు బయటపెడ్తుంది యీ చిత్రం అంతేకాదు మంచి మనసుగల మనుషుల మంచిపనుల ఫలితాలెలా ఉంటాయో కూడా చూపించే చిత్రం మేమూ మనుషులమే

ఎమ్మెల్యేకావాలనుకొనేవారికి చిట్కా!

మీరు ఎమ్మెల్లేకావాలనుకొంటున్నారా? వెంటనే ఓ హోటల్ తెరిచెయ్యండి.



విద్యార్థులకు మీ హోటల్ రేట్లలో కన్సె షన్ ఇచ్చెయ్యండి ఇంకా ఈ చిట్కా మారాలు కావాలంటే మేమూ మనుషులమే చిత్రం చూడండి అయితే ఒక్కసైజు హెచ్చరిక ఎమ్మెల్లే అయిన తర్వాత ప్రజలకు స్వార్ధరహితంగా సేవ చెయ్యండి లేకపోతే ఏం జరుగుతుందో మీ పదవిని దుర్వినియోగం చేస్తే ఏం అవుతుందో మేమూ మనుషులమే చిత్రంలో జగన్నాధం పాత్రను చూసి తెలుసుకోండి

పూసలోళ్ళ కథ

చీకటిపడ్డాక ఇంటి చేరే ఆడదాని శీలాన్ని శంకించేంత మూర్ఖత్వంలోవున్న పూసలోళ్ళ కథ ఇది కోటాయి నాయకుడా గూడానికి కన్నబిడ్డను దక్కించుకొనే ప్రయత్నంలో ఇంటికిచేరిన భార్యను ఆచారం ప్రకారం దూషించి వెళ్ళగొట్టే వాడు కోటాయి తన బిడ్డమాత్ర ఎందుకు చదువుకోగూడదూ? ఎందుకు వృద్ధిలోకి రాకూడదూ? అనే ఆలోచనగల కోటాయి భార్య కుప్పి పట్టణంలోని దయానిధి అనే ఓ శ్రీమంతుడు కొడుక్కి పాముకరవగా తన దగ్గర వున్న మూలిక రసంతో బ్రతికించింది కుప్పి కథ విన్న దయానిధి మంచిమనసు గల దయానిధి జాలిపడి కుప్పి కొడుకొని తన దగ్గరుంచుకొని చదివిస్తానన్నాడు కుప్పి తనబిడ్డ శ్రేయస్సు కోరి బిడ్డకు దూరమై బ్రతకసాగింది కుప్పి కొడుకు పెద్దవాడై చదువులో చురుకుగా పైకొచ్చి పెంచిన తండ్రికీ కన్న తల్లికీ సంతోషాన్ని కలుగజేశాడు అయితే





ఆ పట్టణంలో ఎమ్మెల్లేగా జగన్నాథం చేస్తున్న అన్యాయాలు సహించలేక ఎదురు తిరిగి పద్మవ్యూహంవంటి రాజకీయరంగ ప్రవేశంచేశాడు మరి ఆ రాజకీయ పద్మ వ్యూహంలో యీ అభినవ అభిమన్యుడు ఎలా ప్రవేశించాడు? ఎలా విజయం సాధించాడు? యీ ప్రశ్నలకు స మా ధా న ం త్వరలో విడుదలగాబోతున్న మంచి చిత్రం మేమూ మనుషులమే లో దొరుకుతుంది

కృష్ణంరాజు జమున

ప్రేక్షకులు వూహించని రీతిని నూతన తరహా పాత్రల్లో హుసలాకు\గా కృష్ణ



రాజా జమునల నటన ఈ చిత్రానికో గొప్ప అలంకారం. అన్యాయం సహించలేని పౌరుషంగల యువతిగా తనజాతి ఉద్ధరించబడి అందరిలా చదువుకోగలిగితే బాగుంటుందనే ఆశయంగల 'తుప్ప' పాత్రలో జమున మూఢాచారాన్ని కాదనలేక భార్యని దూరంచేసుకొని తప్పు తెలుసుకొని పరితపించిన తుప్పి భర్త కోటాయ్‌గా కృష్ణంరాజు యీ చిత్రంలో నటించారు. నూతన తరహాపాత్రల్లో తమ నటనకు ప్రేక్షకుల అభినందన లాశిస్తారు.







చంద్రమోహన్ - ప్రమీల

పూనలోళ్ళలో జన్మించినా తమకు లభించిన అవకాశాన్ని ఉపయోగించుకొని మంచి ...రుడిగా విద్యాధికుడిగా అన్యాయా...న్నెదిరించే అభ్యుదయవాదిగా పేరు తెచ్చు...కగలిగిన పాత్రలో మంచి పేరు సంపా...దించుకోబోతున్న చంద్ర మోహన్ కు ...డిగా అరంగేట్రం తమిళ చిత్రంద్వారా ...ఆ చిత్రం చూడగల్గిన ప్రతి పేక్షకుడికి ...మరువలేని అనుభూతినందించిన ప్రమీల ...నటించింది వీరిద్దరూ ప్రేమ జంటగా ...ను మరుపురాని మధుర దృశ్యాలు చూపిస్తూ మీరు కూడా పాడుకొందామనిపించే పాటలు కూడా పాడుకొన్నారీ చిత్రంలో

జగ్గయ్య

కళావాచస్పతి జగ్గయ్య ఈ చిత్రంలోని దయానిధి పాత్రద్వారా మీముందుకొస్తున్నారు కన్నకొడుకు జులాయిగా తయారై ...పెంచినకొడుకు తనకు మంచి పేరు తెస్తున్నప్పటి పరిస్థితుల్లో ఏ తండ్రి అయినా ఎలాంటి అనుభూతి పొందుతాడు ఆ ఇద్దరి కొడుకుల ఎడా ఆ తండ్రి ప్రవర్తన ఎలా వుంటుంది? ఒక క్లిష్టమైన



సాధించడానికి ఎంత దుర్మార్గానికైనా సిద్ధపడే వ్యక్తిగా సత్యనారాయణ, సత్యనారాయణచేసే పాడుపనులన్నిటికీ 'బ్రెయిన్ బిహైండ్'గా అల్లు రామలింగయ్య నటించారు. నూతననటుడు ప్రసాద్ ఈ చిత్రంలోని దయానిధి కొడుకు పాత్ర ధరిస్తున్నాడు.



ఈ పాత్రలో జగ్గయ్యను మీరు చూడగలగటం బహుతేలిక. విడుదలకు సిద్ధంగా వున్న 'మేమూ మనుషులమే' చిత్రాన్ని రిలీజయిన వెంటనే ఓ టికెట్ బుక్ చేసుకొంటే చాలు మరి.

ఇంకా.... ఇంకా

ఇంకా ఈ చిత్రంలో అనుకున్న కార్యం



తెర వెనుక:

ఈ చిత్రం తాలూకు టెక్నిషియన్స్ వివరాలు:

ప్రొడ్యూసర్ వాసంతి బి ఎ
డైరెక్టర్ బాపయ్య
మాటలు పినిశెట్టి
పాటలు ఆత్రేయ
సంగీతం విశ్వనాథం
కెమేరా భాస్కరరావు.
ఎడిటర్ నరసింహారావు
ఆర్టు ఓలీవ్‌సింగ్
డాన్సులు హీరాలాల్
అసోసియేట్ డైరెక్టర్స్ శర్మ మస్తాన్ రావు



(1) రెండవ బొమ్మలో గడియారం లేదు (2) రెండవ బొమ్మలో పై చిన్నది (3) అమ్మాయి కాలుజోళ్ళు లేవు (4) అమ్మాయి కుడిచేతి జాకెట్టు పొడవు (5) కుడిచెవి రింగులేదు (6) అతనికి ఎడమచేతి గుండీ లేదు.



శ్రీ కళా వాహిని ఆధ్వర్యంలో కూచిపూడి ఆర్ట్స్ ఎకాడమీ వారి "శ్రీ కృష్ణ పారిజాత" మను నృత్య నాటిక 2 6 73 న మైలాపూర్ ఫైన్ ఆర్ట్స్ క్లబ్‌లో ప్రదర్శింప బడినది ఈ మధ్య నృత్య కళకు జరిగే అపచారము నాట్యం పేరుతో చలామణి అయ్యే నృత్యాలను చూసి కళా ప్రియులందరూ బాధ పడుచున్న విషయము పాఠకులకు విదితమే ఇటువంటి సమయములో చక్కని సాంప్రదాయ నృత్యాన్ని చూశామన్న అనుభూతిని ఆనందాన్ని తృప్తిని కళా ప్రియులకు కల్పించిన కళావాహినీ వారు అభినందనీయులు

'కృష్ణుడుగా మంజులా భార్గవి సత్యభామగా కుమారి శోభనాయుడు, రుక్మిణిగా శ్రీమతి పద్మ, నారదునిగా కుమారి అనుపమ ప్రశంస నీయముగా నటించారు కూచి పూడి నృత్యంలో పేరు ప్రఖ్యాతులు గడించిన శ్రీ వెంపటి చినసత్యం ఈ నృత్య నాటిక ద్వారా, 'వారికివారె సాటి' అని మరొకమారు నిరూపించుకున్నారు

ఇది ఒక వింత ప్రపంచము

చావు లేని మనిషి

ఆ రోజు నవంబర్ 22, 1643 మిరిన్ డాజో గది మధ్యన నిలబడి వున్నాడు. నడుముకి షర్టు కాని బనియన్ కాని లేదు. కండలు తిరిగిన ఒళ్ళు. మనిషి బలంగా కనిపిస్తున్నాడు.

ఓ యువకుడు కత్తితో డాజో వెనుకగా వచ్చాడు బలం అంతా కుడిచేతిలోకి తెచ్చుకొని, చేత నున్న కత్తిని సూటిగా డాజో వీపులోకి గుచ్చాడు

డాజో వేసిన కేకతో గది దద్దరిల్లి పోయింది కత్తి వీపుని చీల్చుకొని రొమ్ము మీదుగా బయటకు వచ్చింది కత్తిరక్తంతో ఎర్రగా తడిసిపోయింది, రక్తపు చుక్కలు బొట బొటమని కారసాగాయి

ఆ యువకుడు డాజో వేస్తున్న కేకలను లెక్క చేయకుండా కత్తిని సర్రున బయట లాగి మరోసారి గురిపెట్టి గుండెల్లోకి దిగేశాడు ఈ సారి కూడా కత్తి గుండెలను చీల్చుకుని, వెనుక వీపు లోకి చొచ్చుకు పోయింది

డాజో మరోసారి కెవ్వుమన్నాడు

అయినా ఆ యువకుడు బెదిరిపోలేదు కర్కశంగా కత్తిని పైకి లాగి మరో సారి, కడుపులో, ప్రక్క ఎముకల్లో గుచ్చాడు

అలా మొత్తం ఆరుసార్లు పొడిచి కత్తిని బయటికి లాగాడు ఎర్రని, చిక్కని రక్తం,వెల్లువలై పారింది యువకుడిచేతులు తడిసిపోయాయి పైకి పింజిమ్మిన రక్తం అతని తెల్లని షర్టును భయంకరంగా తడి పేసింది ఆ యువకుడు కత్తిని విసిరేసి విసవిసా వెళ్ళిపోయాడు

మిరిన్ డాజో దబ్బున వెనక్కి తూలి సోఫాలో పడిపోయాడు కాళ్ల చేతులు నిముషం పాటు గిజగిజ లాడాయి ఆ తరువాత అంతా నిశ్శబ్దం!

మరో నిముషం వరకు ఎక్కడో సన్నగా సంగీతం విన్పించసాగింది కాస్సేపు అయిన తరువాత ఎక్కడో మృదు మధురంగా గంటలు మ్రోగాయి

అంతే!

అంతవరకు నిర్జీవంగా సోఫాలో పడున్న మిరిన్ డాజో గబుక్కున లేచి కూర్చున్నాడు మామూలు వ్యక్తిలా లేచి

ఎలబడ గద మధ్య నుండి ముందుకు వచ్చి, కారుతున్న రక్తాన్ని లెక్క చేయ కుండా, చేతులు ముందుకు చాచి, "యస్, జంటిల్‌మెన్ ఇదిగో నే విక్క దే వున్నాను నేను చావలేదు!" అన్నాడు నవ్వుతూ, గట్టిగా, అందరికీ వినిపించేలా!

ఆశ్చర్యం! అంతవరకు భయంతో రక్తం గడ్డ కట్టుకుపోగా, శిలాప్రతిమల్లా కూర్చొని ఆ దృశ్యాన్ని తిలకించిన ప్రేక్షకులు తేరుకొని హాలు దద్దరిల్లి పోయే టట్టుగా చప్పట్లు కొట్టారు చిల్లర డబ్బులు నోట్ల కాగితాలు వర్షంలా వచ్చి అతనిమీద పడసాగాయి

అంటే అదొక 'ప్రదర్శన' అని తెలిసి పోయింది కదూ?

నిజంగా అదొక ప్రదర్శనమే కానీ, మిరిన్‌డాజోని కత్తితో పొడవటం, రక్తం కారటం అన్నీ నిజమే కత్తి కూడా అసలు కత్తే జందులో ఎలాంటి సందేహము లేదు

మిరిన్‌డాజోకి, అతని అసిస్టెంట్‌కి అలాంటి ప్రదర్శనా లివ్వటమే వృత్తి వారి సంపాదన అంతా అందుమూలంగానే ఆ నాటికి అది వారి 532 వ ప్రదర్శన!

ప్రతిసారీ అసిస్టెంట్ ఆ బలమైన కత్తితో అరుసార్లు పొడుస్తూనే వున్నాడు కత్తి కండరాల్ని చీలుస్తూనే వుంది అయినా 'మిస్టరి యస్ మాస్టర్' మిరిన్ డాజో నవ్వుతూ నిలబడుతూనే వున్నాడు మామూలు మనిషిలా తిరగ గలుగుతున్నాడంటే ఎంతైనా ఆశ్చర్యకరం!

చనిపోక పోవడం అటుంచి కండరాలు, ఒంట్లో మాంసం చీలిపోతూంటే కూడా డాజోకి బాధలేక పోవడంఒకగొప్ప మిస్టరీ! కారణం అనూహ్యం!

మొటట్లో అతని ప్రదర్శనలు చూసి, అందులో ఏదో మోసం వుందని కొందరు ఆరోపించారు కళ్లు కప్పే ట్రిక్కు ఏదో దాగివుంటుందని వాదించారు అయినా చివరకు పరీక్షల్లో అలాంటి కిటుకులేం లేవని నిరూపించబడింది

అమెరికా ఇంగ్లాండు దేశాలనుండి ఆ ప్రదర్శనను చూడటానికైనా విచ్చేసిన పదిమంది డాక్టర్లు కూడా డాజోని, అతని ఒంట్లోని కత్తి పోట్లని పరీక్షించారు, ప్రదర్శన మొత్తాన్ని కొందరు ఫిల్మ్‌గా తీస్తే, మరి కొందరు ఎక్స్‌రే ఫిల్ముతో మిరిన్ డాజో దేహాన్ని చెక్ చేశారు అయినా ఎలాంటి మోసం కనిపించలేదు

అంతా కళ్ళ ముందు జరుగుతున్నవే. కాకపోతే, ఒక్క విశేషం మాత్రమే వుంది డాజో ఒంట్లోకి దిగబడే కత్తి ఎప్పుడూ కూడా ప్రాణం పోయేముందుకు కీలకమైన గుండెని కాని, శ్వాసకోశాల్ని, గాని తాకింది లేదట అయినా డాజో బ్రతకటానికి అదొక్కటే కారణం కాదు అని అందరూ ఒప్పుకున్నారు

అయితే మిరిన్‌డాజో ఆ కత్తి పొట్లతో ఎలా బ్రతక గలుగుతున్నాడు? ఆ ప్రశ్నకు సమాధానం మాత్రం ఎవ్వరికీ తెలియదు చివరకు డాజో కూడా తన శక్తికి తనే ఆశ్చర్యపోతున్నానని అనేవాడు ఎన్నడో ఒక నాడు రాత్రి నిద్దుర పోతుండగా గోడకు వున్న ఒక బలమైన కత్తి జారి పడి, అతని పొట్టలోకి బలంగా దిగబడి పోయిందట డాజో దిగ్గున లేచి కూర్చు న్నాడు కాని గాయమైన చోట ఏదైనా బాధ కానీ, మంట కాని లేకపోవటం గమనించి ఆశ్చర్యపోయాడట మళ్ళీ మళ్ళీ కావాలనే బ్లేడుతో కూడా మోచేతి మీద గీసుకొని చూసేవాడట బాధగాని, నొప్పి గాని లేకపోవడంతో అకస్మాత్తుగా ఈ ప్రదర్శనల ఉపాయం తట్టిందట అప్పటి నుండీ తను అలాగే జీవిస్తున్నట్టు చెప్పాడు

మిరిన్‌డాజో డచ్ దేశస్థుడు పుట్టింది అక్కడే అయినా పెరిగింది స్విట్జర్‌లాండులో ఆయన తన ప్రదర్శన స్విట్జర్లాండులోనే ఇచ్చేవాడు. ఆ 'చావు లేని మనిషి' కోసం ఎందరో విరగబడి వచ్చేవారు అయితే అసిస్టెంట్ కత్తితో పొడవటం అంతా అతి భయంకరంగా వుండి స్త్రీలను హడల గొట్టించేది

ఆ విషయమై స్విట్జర్లాండ్ ప్రభుత్వం తీవ్రంగా పరిశోధించి, చివరకు చేసేది లేక ఆ ప్రదర్శనను తమదేశంలో నిషేధించింది తద్వారా మిరిన్‌డాజో పాశ్చాత్య దేశాలలో అడుగు పెట్టడం, అతని వింత శక్తి గురించి ప్రపంచాని కంతటికీ ప్రాకిపోవటం జరిగింది

రాను రాను మిరిన్‌డాజో తన ప్రదర్శనలలో మరికొన్ని కొత్తకొత్త మార్పులు ప్రయోగాలు చేశాడు సన్నని పొడుగాటి కత్తిని నోటిద్వారా కడుపులోకి చొప్పించు కొని, ఆ కత్తితో లోపల నుండే కడుపును చీల్పించి, దాన్ని బయటకు లాగించేవాడు: ప్రదర్శనలో ఇది మరీ భయంకరంగా వున్నా చివరకు ఈ కొత్తరకం ఐటమ్‌తో మిరిన్‌డాజో లక్షలు ఆర్జించాడు

అలా 1948 న సంవత్సరం నాటికి మిరిన్‌డాజో ప్రదర్శనలు వేయిని మించాయి ఒకసారికి ఆరుచొప్పునఅంటే ఆరువేలకు పైగా కత్తిపోట్లు తిన్నాడు అయినా అతనికి ఏ విధమైన హాని జరుగలేదు ప్రపంచ ప్రజలందరి చేత అతను 'చావులేని మనిషి' గా ప్రస్తుతింప బడ్డాడు

చివరకు ఒకనాడు ఏప్రిల్ 12, 1948 న ప్రదర్శన జరుగుతూండగానే నోటి ద్వారా లోనికి దిగబడిన కత్తి అకస్మాత్తుగా కంఠాన్ని కత్తిరించేయడంతో మిరిన్‌డాజో అక్కడి కక్కడే స్టేజీమీద ప్రాణాలు కోల్పోయాడు

అంతవరకు అతని ప్రాణానికి ఎలాంటి హానీ కలిగించని ఆ కత్తి చివరకు ఆ రోజు అతని ప్రాణాలు తీసేసింది

నిజమేమరి చావు నుండి ఎవరు మాత్రం ఎన్నాళ్ళని తప్పించుకోగలరు: •

—వేధావి

పాలిడార్ రికార్డులు పాలిడార్ రికార్డులు పాలిడార్ రికార్డులు పాలిడార్

సంగీత ప్రియులపాలిట

పాలిడార్ రికార్డులు కల్పవృక్షాలు!

పాశ్చాత్య, కర్ణాటక, హిందుస్తానీ, శాస్త్రీయపద్ధతులలో గాత్ర, వాద్య,
జంత్ర సమ్మేళన సంగీతం—జాజ్ – పాప్ మ్యూజిక్

పైగా సులలిత హిందీ చిత్ర సంగీతానికి

పాలిడార్ రికార్డులు
పెట్టింది పేరు!

'తెరే మెరే సప్నే'
'జవానీ-దివానీ'
'గేంబ్లర్'
'సచ్చా-ఝూటా'
'బనారసీబాబు'


ఇంకా ఎన్నో చిత్రాల ఎల్ పి, ఇ పి., ఎస్ పి లకు
మీకు మీ ఊరి

పాలిడార్ డీలర్ కల్పతరువు!

కొత్తగా వచ్చిన ఎస్ పి రికార్డులు

'నిజం చెపితే నమ్మరు' తెలుగు చిత్రంలో
సి రామచంద్ర సుమధుర సంగీతం'

పాలిడార్ రికార్డులు పాలిడార్ రికార్డులు పాలిడార్ రికార్డులు

ఈ నెల  విడుదలలు

పాలిడార్ రికార్డులలో చక్కని హిందీ చిత్ర సంగీతం విరివిగా దొరుకుతున్నవి ప్రఖ్యాత చిత్రాల ఎల్ పి లు దాదాపు ముప్పై వరకు విడుదలైనవి అన్నిటి కన్నా బాగా అమ్ముడైనది జవానీ-దివానీ కాని నేను మొదటి స్థానం యిచ్చేది 'తేరే మేరే సప్నే' కారణం యిందులో నీరజ్ సాహిత్యం, ఎస్ డి బర్మన్ సంగీతం, విజయానంద్ చిత్రీకరణ అమోఘంగా కలవటమే ఇటువంటి పాటలు, ముఖ్యంగా 'జీవన్‌కీ బగియా' 'హమైనే కసమ్‌లీ' లతా కిషోర్ యుగళ గీతాలు, తాథై తతథై అన్న ఆశా నాట్య గీతం లతా పాడిన 'మేరే అంతర్ ఏక్ మందిర్' 'జైసే రాధనే మాలా జపీ', ఎన్ని మార్లు విన్నా విసుగెత్తదు ఒక పదేళ్ళ తరువాత విన్నా వాటిలో హాయి చెక్కు చెదరదు ఆ ఎల్ పి నంబరు 2392 009

పాలిడార్ రికార్డులలో ప్రఖ్యాత హెచ్ ఎం వి కళాకారుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ పాడిన పాటలు నాలుగున్నవని మీకు తెలుసా? అవి "శ్రీ మహావిష్ణు మహిమ" అన్న డబ్బింగు చిత్రం లోనివి, అయినా, రచన అనిసెట్టిది కనుక బాగానే వున్నవి అసలు సంగీతం కె వి మహాదేవన్ సినలు సంగీతం బి గోపాలం

'శ్రీహరి గోకుల రమణ' సుశీల, బాలమురళి పాడిన భక్తి పూర్వకమైన భజన తక్కిన మూడు పాటలు 'గోపికా లోల రమణ,' 'మధురిమ పదముల' 'శ్రీపతి మహిమకు సాటేది బాలమురళి సోలో గీతాలు వింటే బాలమురళి అభిమానులు తప్పక కొంటారు

ఈ నెల ఓడియన్ అనగా హెచ్ ఎం వి, కొలంబియా విడుదలలో చెప్పుకోదగినవి "శ్రీవారు మావారు" లో మూడు రికార్డులు BOEC 7379-7380-7381 ఇందులో నాలుగు పాటలు చాలా బాగున్నవి ఒకటి ఒక మాదిరిగా వున్నది. ఒకటి బాగాలేదు సంగితం జి కె వెంకటేశ్ రచన రెడ్డి, రధి, శ్రీ

త్వరలో రాబోయే "అందాల రాముడు" "భక్తతుకారాం" యి పి లు తప్పక వినండి చాలా చక్కని పాటలున్నవి వీటిలో

"అందాల రాముడు" చిత్రంలో ఎప్ పి లు వచ్చినవి కె వి మహాదేవన్ సంగీతం, ఆరుద్ర రచన రెండు పాటల్లో భలే చక్కగా అమరినవి అవి BOE 5412, BOEC 7383 లో వున్న 'ఎదగడానికెందుకురా తొందరా' 'రాముడేమన్నాడోయ్' పాడినది యువనవ గాయకుడు వి రామకృష్ణ

ఈ నెలకు యింతే సంగతులు క్రింద చేర్చాలు యిట్లు రికార్డు బంధు

గిడ్డీ

'మానస'

నందనవనమన్నా, గోపికా నగరమన్నా, ప్రేమ నగరమన్నా ఏవ(న్నా తక్కువే అయిపోతుంది రామకృష్ణా బీచ్‌ని

మండుటెండా కాలంలో,ఆది వారం సాయంత్రం దాని శోభని వర్ణించడం అంత సులువుకాదు.

పేరుకి తగ్గట్టే ప్రేమజంటలు గుంపులు గుంపులుగా జన సమూహాలు, పని ఒత్తిడికి శ్రమ చెంది విశ్రాంతి తీసుకుందామన్నా ఉద్యోగస్తులూ, వయసు మళ్ళిపోయిన వాళ్ళూ, ఎందరెందరో హాయిగా గడుపుతారు ఆ సముద్రతీరాన

ఈ వారం మామూలుగా లేదు। కళ కళ లాడుతోంది. రంగు రంగుల చీరెల్లో, పైజామాల్లో, లుంగీల్లో, ప్యాంట్లల్లో అమ్మాయిలు దగ దగ మెరిసిపోతున్నారు

చుట్టూ చూస్తున్నాను అంతకన్నా ఏం చెయ్యాలో తోచడంలేదు ప్రక్కన 'స్నేహితుడు' అనబడేవాడు లేడు 'ప్రేయసి' అనబడే చందనపు బొమ్మా లేదు। అసలిలాంటి చోటికి రావటం మానేయడం మంచిదేమో వంటరిగా రావటం కన్నా।

అదే దిగులుతో ఆశగా చూస్తున్నాను తెలిసిన వాళ్లెవరైనా తగుల్తారా అని

కళ్లు చేటంత చేసుకుని మరీ చూస్తున్నాను అలా నా అన్వేషణలో గంట దాటిందని నాకే అనిపించలేదు ఇక ఎదురు చూడవలసిన అవసరం లేకపోయింది వేల మంది జనంతో కిట కిటలాడుతున్న ఆ ప్రదేశం వెంటనే నిర్మానుష్యం అవాల్సిన పరిస్థితి నిమిష మాత్రం హెచ్చరికన్నా లేకుండా ఏర్పడింది

"ఏమిటీ వాన ? దరిద్రం" గొణుక్కుంటూ పరిగెత్తారు జనాలు

చేసేది లేక నేనూ వాళ్ళనే అనుసరించాను

అయితే ఊరికి మూలగా, మూడు మైళ్ళ దూరంలో ఉన్న ఆ బృందావనంలో తలదాచుకోడానికి రెండే, రెండు తావులు। అవి

కాఫీ షాపొయిన్నరిచ్చి త్రాగే (త్రాగగలిగ్తే) పెద్ద వాళ్లు విలాసంగా ప్రకృతిని చూస్తూ కూర్చునే అద్దాల రెస్టారెంటూ ప్రపంచాన్ని పరమ పద సోపానానికి దారి చూపే సాక్షాత్ భగవ స్వరూపుడైన

శ్రీరామ కృష్ణ పరమహంస పద్మాసనంలో కూర్చున్న తైలవర్ణ చిత్రాన్ని పొందు పరచిన పునీతమైన రామకృష్ణ మఠ ఆశ్రమం తలదాచుకోడానికి తావులు ఈ రెం డే!

జనం బలంకొద్దీ పరిగెడుతున్నారు

అద్దాల సౌధంలో కాళీ లేదనో, మట్టి కాళ్ళవల్లా, లాభంలేని జనాలవల్లా మెరుగు పోతుందనో మరెందుకో దాని తలు పులు మూసుకు పోయాయి

జనాలు ఇవేం పట్టించుకోకుండా పరి గెత్తారు

రామకృష్ణ ఆశ్రమం దగ్గర ఆగి పోయాయి పరుగులు !

* * *

పిల్లలూ, పెద్దలూ, కాలేజీ కుర్రాళ్ళూ, వేరుశనగపప్పు జంగిడి వాళ్ళూ, వీళ్ళు వాళ్ళని లెక్కలేదు, అంతా చేరిపోయారా ఆశ్రమ వరండా నిండా!

సాయంత్రం తలనొప్పిగా ఉన్నా, రూపాయిన్నరిచ్చి కాఫీ త్రాగలేని నా పరి స్థితిని నేనే ఓదార్చుకుంటూ 'వెలకమ్' అని బోర్డు ఉన్నా ఖాతరు చెయ్యకుండా అలా ఇసకలోనే కూర్చుండి పోయిన నేను, తలదాచుకోడానికి పరిగెత్తుకుంటూ వెళ్ళగానే 'డోంట్ కమ్' అన్నట్టు అద్దాల సౌధం భయంకరంగా చూసిన చూపుకి ప్రత్యేకంగా బాధ పడలేదు అందుకే నలుగురితోపాటు అలా రామకృష్ణ ఆశ్రమ వరండా మీదకి చేరిపోయాను వాన జోరుగా కురుస్తోంది ఉరుములూ మెరుపులూ మధ్యలో పిల్లల అరుపులూ, ఏడుపులూ

వర్షం మరింత ఉధృతమైంది, వాతా వర్ణం చికాగ్గా ఉంది అంతసేపూ రుమాల్తో తల తుడుచుకోడమే పనైన నా దృష్టి కొందరి వ్యక్తుల మీద పడి అలా ఉండి పోయింది! అదొక చిన్న కోలాహలం!

ఆ కోలాహలంలో ఓ అమ్మాయి

చుట్టూ, గడ్డాలూ, మీసాలూ, క్రాపులూ ఏకమైన ఓ అరడజను స్వరూపాలు,

వీళ్ళ మధ్యలో పడ్డ ఆ అమ్మాయి పరి స్థితి వర్ణనాతీతం ! సభ్యత మరచి అలా చూస్తూ ఉండిపోయాను

అయితే నా దృష్టిలో నిలిచి పోయింది ఆ అమ్మాయికాదు "సుధాకర్"

ఇది ఆశ్చర్యం మాత్రమే కాదు బాధ కూడా!

సుధాకర్ ఇలా అయిపోయాడే అన్న చెప్పుకోలేని బాధ

మనసు చివుక్కుమంది

సుధాకర్ ఎవరో చెప్పాలి కదూ ?

అతను మా యింటివాళ్ళ నాలుగో అబ్బాయి!

"ఇంటివాళ్ళ అబ్బాయిగురించి బాధ పడ్డం దేనికి?" అంటే చెప్పక తప్పదు

సుధాకర్ చురుగ్గా చదివి, ఎప్పుడూ ఫస్టున పాసయ్యే యూనివర్సిటీస్టూడెంట్. అతను ఇవాళో, రేపో పెద్ద హోదాలోకి రావలసినవాడు అతనిమీదవాళ్ళకుటుంబం ఎంతో ఆశ పెట్టుకుంది

అందుకే పరిస్థితుల వశయానికి వాపో తున్నాను,

లైట్లుపోయాయి ఉన్నట్టుండి!

గాలి హోరు విపరీతం అయింది తలుపులు దభీమని కొట్టుకుంటున్నాయి మనుషులే కొట్టుకుపోయేంతగా ఫీలయ్యాను ఓ రెండు నిమిషాలు!

గాలి తగ్గిపోయింది మసగ్గా లైట్లు వెలగాయి సరిగ్గా కనపడని మసక వెలుతుర్లో ఆ దృశ్యం స్పష్టంగా చూశాను ప్రక్కనెక్కడో ముసిముసి నవ్వులు ! తలుపు గొళ్ళెంమీద పడిపోయిన రెండున్నర గజాల ఓణీని మళ్ళీ ధరిస్తోంది ఆమె

ఒకటిమాత్రం చెప్పగలను !

మనుషుల్ని సహితం కూల ద్రోసే గాలే వీచింది కానీ ఆ అమ్మాయి ఒంటిమీదే ఓణీని మాత్రం 'గాలి' పార ద్రోయలేదు

కళ్ళనీళ్ళపర్యంతమైన ఆ అమ్మాయి గుండె రాయిచేసుకొని చెప్పులు విప్పి, ప్రార్థనా మందిరంలోకి కాలుపెట్టింది

నలుగురితోపాటు నా తల అటు తిరిగి పోయింది

లోపలికెళ్ళిన ఆ అమ్మాయి ఐదునిమిషాలకన్నా ఎక్కువ ఉండకుండా వెనక్కి తిరిగొచ్చేసింది వెనక్కి, వెనక్కి నడుస్తూ గుమ్మందాటి ఓ రెండడుగులు వేసి ఒక ఊతకి ఆనుకుని నిల్చుండి పోయింది

• • •

"రావుగారూ " ఆల్మోస్ట్ కాళ్ళ మీద పడిపోయాడు సుధాకర్


"ఛ! తప్పు! లే సుధా!" అనునయంగా లేవదీశాను మొహం ప్రక్కకి తిప్పుకొని కిటికీ దగ్గరకెళ్ళిపోయాడు సుధాకర్ ఈజీచైర్లో నడుంవాల్చి అతని వైపే చూస్తున్నాను

"అంతదాకా ఎంతో సరదాగా మాల

"ఆ డాక్టర్ నిజంగా చాలా గొప్పవాడు గత సంవత్సరం ఒక చిన్న ఆక్సిడెంట్‌లో నేను గాయపడితే నా గాయాలన్నీ ఒక నెలలో మాన్పించి మళ్ళీ మామూలు మనిషిని చేసేశాడు"

"అబ్బో! వెరీనైస్! ఆ డాక్టర్ హస్తవాసి బాగున్నట్టుంది."

"అవునవును ఆయన బిల్లులు చెల్లించడానికి నా కారును మాత్రం అమ్మేయాల్సి వచ్చింది"



తిని ఏడిపించాలనే అనిపించింది రావు గారూ ” సుధాకర్ చెప్పడం మొదలు పెట్టాడు

“అయితే, ఆ అమ్మాయి పేరు మాల తన్నమాట” మనసులోనే అనుకున్నాను,

“అందుకే సాయంత్రం అయిదునుంచీ వెంట తరుముతూనే ఉన్నాం అంద కుండా తప్పించుకు తిరుగుతోంది

ఒకటి మాత్రం నిజం రావుగారూ మీరు నమ్మాలి! ఆ అమ్మాయినా పరిస్థితి లోకి తోసింది నేనుకాదు

"నేనిప్పుడేం అనలేదే సుధా ..?"

"అదికాదు రావుగారూ! నేను మీకు కొంత చెబితేగానీ నా మనసు కుదుట పడదు"

"అయితే చెప్పు!" చెప్పాడు

అతను చెప్పింది మీకువినిపించేముందు నేను చెప్పే 'మాలతి కథ' వినండి

మాలతి ఎందుకు లోపలికెళ్లింటుంది?

ఎవడో పైటలాగితే, నిర్లిప్తంగా తీసుకున్న ఆమె 'తను అక్కడ్నుంచి నిష్క్రమిస్తే చాలు' అన్నీ సర్దుకుంటాయన్న ఆలోచనకి వచ్చి, నలుగురిలో ఒకర్ని వేలెత్తి చూపడమూ, నలుగురిమధ్యలో తనొక 'వాల్‌పోస్టర్' గా నిలిచిపోవడమూ వగైరాలకి తావునివ్వకుండా ఉండేందుకు ప్రార్థనా మందిరంలోకి వెళ్ళి ఉంటుంది

ఇది అందరూ ఊహిస్తారు

మరైతే ఎందుకు వెంటనే తిరిగొచ్చింది ?

దానికి సమాధానం ఒక్క మాటలో దొరకదు

ప్రశాంతంగా, నిర్మలంగా, మనోవికాసంగా, నిశబ్దంగా ఉన్న ఆ మందిరంలో మధ్యగా ఉన్న శ్రీ రామకృష్ణ పరమ హంస తైలవర్ణ చిత్రాన్ని తన్మయంగా చూస్తూ ఉండిపోయేసరికి వెనుక నుంచి ఎవరో "కూర్చోమ్మా!" అన్నారు

అది విని కొందరు ప్రక్కకి, మరి కొందరు ముందుకీ వెనక్కీ చూడటం మొదలెట్టారు

మాలతి మాట్లాడకుండా కూర్చుంది తడిసిన బట్టలనుండి నీళ్ళు క్రిందనున్న తివాసీమీదకి జారుతున్నాయి రెండున్నర గజాల ఓణీ ఒళ్లు పూర్తిగా కప్పలేక పోతోంది

అదీగాక చుట్టూ చూస్తే

ఏడుగజాల జరీచీరెలు నిండుగా కప్పుకొని కూర్చున్న ముత్తయిదువులు


వెనక్కి తిరిగింది

అంతే !

ఆ ప్రక్కనించి లోపలికొస్తున్న వ్యక్తిని చూసి గబుక్కున లేచి పూర్ణ మందహాసంలో ఉన్న రామకృష్ణుని మన్నించమని దీనంగా కోరుతున్నట్టుగా ఆ వర్ణచిత్రాన్ని తదేకంగా చూస్తూ వెన కడుగులు వేసుకుంటూ సింహద్వారం దాకా వచ్చి, మరో అంగుళం కూడా వెనక్కి వెళ్లడానికి వీలులేని పరిస్థితుల్లో ఒక ఊతకి ఆనుకుని నిల్చుండిపోయింది ఇందాక, నలుగురిలో సంచలనం కలుగ కూడదనీ నలుగురిలో తనొక వాల్‌పోస్టర్ కాకూడదనీ గత్యంతరమై ప్రార్థనా మందిరంలోకి జొరపడింది

ఇప్పుడు

పరమ పావనమైన ఆ మందిరంలో కూడా అవే శక్తులు జొరపడబోతున్నా



మనీ, ధ్యానంలో నిమగ్నమైన ఆ ప్రశాంత మూర్తులలో కూడా మాలతి అక్కడ కూర్చోడంలో 'గిల్టీ' ఫీలై ఇవతలి కొచ్చేసింది

"క్రిస్టియన్ రా " ఎలా నిలబడగల దక్కడః అందుకే, వెనక్కొచ్చాడు " ఆమె వెనకాల గడ్డాలూ మీసాలూ, క్రాపులూ ఏకమైన గొంతుకలు

* * *

"నా జీవితంలో జరిగిపోయిన ఇరవై ఏళ్ళలో ఎప్పుడూ తట స్థించలేదు ఇలాంటి విచిత్ర పరిస్థితి రావుగారూ " సుధాకర్ ఇందాక చెప్పింది మీకు చెబుతున్నాను నాకు దేవుడి మీద నమ్మకం లేదు పండగలకి తల మీద స్నానాలూ వగైరా ఎప్పుడూ లేవు బుద్ధి తెలిసి నేనే గుడికి వెళ్ళలేదు

కాలేజీ కెళ్ళడం సినిమాలూ,షికార్లూ మధ్య మధ్యలో అమ్మాయిల్నేడిపించడం, ఇవే రా వు గా రూ నా దిన చర్యలుః మామూలుగానే ఇ వా ళ సాయంత్రం బీచ్‌లో 'మాలతి' ఎదురైంది మాలతి మునుపు ఎన్నోసార్లు తప్పించుకుపోయింది ఆమెను ఏడిపించాలని మరీ పట్టు పట్టాను. ఆమె వెనకాల నీడలా మెదిలాను

వర్షం వచ్చి, ఆమె తల దాచుకోడానికి రామకృష్ణ మఠ ఆశ్రమం వరండా మీదకి చేరితే, నేనూ పరిగెత్తాను వెనకాలే అక్కడే రావుగారూ విచిత్ర పరిస్థితిః

బైట జనసమూహంతో కోలాహ లంగా ఉన్నా, లైట్లులేక గాలి హోరులో త్రొక్కిసిలాట జరుగుతున్నా, ప్రశాంతంగా భవ భంధాన్ని నిర్మూలన చేసే నిరంతర మంద హసిత, భాగస్వరూప రామకృష్ణుల వర్ణ

విగ్రహాన్ని నిశ్చలనంగా వెలుగుతున్న కొవ్వొత్తి కాంతిలో చూసి నప్పుడు ఏదో శక్తి నాలో చేరి ''వెళ్ళు వెళ్ళు, అక్కడ కూర్చో'' అని బోధించినట్టుగా అనిపించింది రావుగారూ.

అలా వెళ్దామనుకొన్న నాకు ఈ తడిసిన బట్టలూ....ఎర్రమట్టి మయమైన కాళ్లూ ప్రోత్సాహ మివ్వలేదు.

అదీగాక, ఎవడి తుంటరి చర్యకో గురైన 'మాలతి' అభిమానం కాపాడుకోడానికి మందిరంలోకి అప్పుడే వెళ్ళడం వల్ల....చెప్పులు విప్పుకుని కాళ్లు శుభ్రంగా తుడుచుకున్నా, నా వెనకాల మూకకి భయపడి వెళ్ళడం మానేశాను.

కానీ ఒకటి రావుగారూ!...

జీవితాన్ని సార్థకం చేసే ఆ పరమ పావనమైన ఆశ్రమ వాతావర్ణంలో నలుగురితో పాటు నేనూ కొంతసేపు ధ్యానంలో గడపాలనే కోరిక నరనరాల్లోంచిఉప్పొంగి పొరలి వచ్చింది.

అయితే, అలా లోపలికెళ్ళలేక పోతే, కనీసం వరండాలోనైనా నిశ్శబ్దంగా ఉండాలని ఎవరో చెప్పినట్టుగా కూడా స్ఫురించింది రావుగారూ.

ఇది, హాయి గొలిపే మధురాతి మధురమైన అనుభవమే అయినా, నా జీవిత ప్రసక్తి దృష్ట్యా ఇదొక చిత్రాతి విచిత్రమైన అనుభవం.

అందుకే.

నా ఈ అనుభవాన్ని నాలోనే దాచుకోవడం 'గిల్టీ' గా ఫీలై మీకు చెబుతున్నాను రావుగారూ...." కిటికీ రెక్క పట్టుకుని ఆవేశంగా చెబుతూ ఆగిపోయాడు సుధాకర్.

మా ఇద్దరి మధ్యా కొన్ని క్షణాల నిశ్శబ్దం.

"సారీ! చూసుకోలేదు" అని పదిహేన్నిమిషాల తరవాత 'మాలతి' వెళ్ళిపోదామని వెనక్కి తిరిగి అనే దాకా ఆమె నా గుండెల నానుకుని ఉందని కూడా నాకు స్ఫురించలేదు రావుగారూ....సుధాకర్ చెప్పుకు పోతున్నాడు.

భౌతికంగా వింటున్నాను.

సుధాకర్ ధోరణిలో ఆవేశం....తన్మ

○ 'అదే పదివేలను కొన్నాను' పరమేశంగారి ఊతపదం. 'సినిమా కెళితే టికెట్ దొరకలేదు తిరిగి రావడానికి రిక్షా దొరికింది అదే పదివేలను కొన్నాను.' ఇలా వుంటాయి ఆయన మాటలు ఒకసారి లాటరీ తగిలిందాయనకు. రెండో బహుమతి పొంది బహుమతి సొమ్ము రెండు లక్షలూ భద్రంగా తెచ్చుకొని, మిత్రులతో ముచ్చటిస్తు 'ఫస్ట్ ప్రైజు అయిదు లక్షలు రాలేదు; రెండు లక్షలు మాత్రమే వచ్చింది. ఏం చేస్తాం అదే పదివేలను కొన్నాను' అన్నాడు.



యత్వం....ఏదో చెప్పుకోలేని వేదాంతం ఉట్టి పడుతున్నాయి.

"దేవుడున్నాడా, లేడా అది కాదు ప్రశ్న।

పాప భీతి చాలు నమ్మకాలకి.

పశ్చాత్తాపం పాపాల్ని రద్దు చేస్తుం దంటారు।

అసలు పాపానికి ఆస్కారం ఏది క్కడ?

తనలో రాగలిగిన అద్వితీయమైన మార్పుని, జీవితాన్ని సార్థకంచేసే అను భూతిని, తప్పుడు చేష్టల కంటి పొరను రూపు మాపిన జ్ఞానోదయాన్ని కడుపులో దాచుకునే మనస్తత్వం కలవాడు కాదు

సుధాకర్ అదృష్టవంతుడు.

"రావుగారూ!...సు ధా క ర్ చెప్ప బోతున్నాడు.

"మరి చెప్పకు సుధా...నువ్వుచెప్పింది అర్థం చేసుకోడం కాదు కదా, వినే స్థితిలో కూడా లేను." నేనే వారించాను.

"నిజమా" అన్నట్టు ఆశ్చర్యంగా చూశాడు.

"అవును" అన్నాను పైకే।

కాసేపు మాట్లాడ్డం మానేసి ఆలో చించ సాగాను.

సుధాకర్. అలాంటి మనిషి కాబట్టే అతని గురించి వాపోయాను మొదట్లో.

మొదటిసారి నేను మాత్రం ఏమను కున్నాను ఆ వాతావరణంలో అవును, ఏమను కున్నాను?

ఏమనుకున్నానో చెప్పే పరిస్థితా నాది?

కానీ, ఒక్కటి మాత్రం చెప్పగలను।

వర్షంలో తడిసైనా వెంటనే అక్క డ్నుంచి వెళ్ళిపోవాలనిపించింది।....

ఎందుకు వెళ్ళాలనిపించిందో చెప్ప కుండా దాచడానికి నేనూ 'గిల్టీ' ఫీలవు తున్నాను.

మరందుకే....ఈ కథ।

ఆప్తోపదేశం

సృష్టిలో వెలలేని
(ఆ సృష్టికే కారణమైన)
సుఖం వెలకు దొరుకుతుంది.
'మహమ్మద్ దగ్గరికి కొండరావడం' అనే
మాటలో విడ్డూరం ఏమీ లేదు
మానవమాత్రుడి దగ్గరైనా 'మనీ' సంచి ఉంటే
(అసలు అతను మహమ్మద్ కానవసరం లేదు)
మహానగాలే ఎదురు వచ్చి వంగి వంగి సలాములు చేస్తాయి.
రెక్కలున్న గరుత్మంతుడే తేనవసరం లేదు అమృతం
* 'రెక్' ఉన్నవాడు సాధించలేనిది లేదనడం కాదు అనృతం
ఎగుబుజాలూ మృగరాజమధ్యమూ అవసరం లేదు—చూడు—
బ్యాంక్ ఎకౌంటూ బ్యూక్‌కారూ (బొచ్చుకుక్క కూడా) ఉంటే మదిరాక్షులు
నీవంక చూస్తారు నేడు
మంచిగా ఉండడం అంటే నేడు అభివృద్ధి చెందకుండా మడిగట్టుకున్నట్టు
మాటలూ ప్లేటులూ కోటులూ మార్చడం నేర్చుకోనిదే నెట్టుకు రాలేం మెట్టుపై మెట్టు
రోజు రోజూ మారిపోతూండే సిలబస్‌ల కనుగుణంగా మారాలి నీ తత్త్వం
"రోజాలకీ కాగితపు పూలకీ తేడా లే" దంటే "అవును లే" దనడమే మన రసికత్వం
నమ్ముకున్న ఆశలూ ఆశయాలూ వమ్మయి పోయేదాకా మనమీ విషయం నమ్మం
నమ్మక తప్పదేనాటికైనా—స్వర్గవాటికైనా ఉండి దొడ్డి గుమ్మం।

—కె. ఎస్ వి. నరసింహమ్

---

* 'రెక్' అనగా—మీకు తెలుసుగదా—ఉత్తరాయణం—'రెకమెండేషన్'



పాఠకులకు మాత్రమే

యర్రంశెట్టి శాయి

"నువ్ నా గురించి ఏమనుకొంటున్నావక్కా? ఏమీ దాచకుండా చెప్పెయ్యవూ? ఇవాళ పూర్తిగా మనసులు విప్పి మాట్లాడుకోవాలనుంది నాకు."

సుజాత కళ్ళల్లోకి చూస్తూ అంది అరుణ.

సుజాత ఉక్కిరి బిక్కి రయింది. ఇలాంటి పరిస్థితీ-ప్రశ్నా అరుణనుంచి ఉత్పన్నమవుతాయనుకోలేదు.

అరుణ వచ్చిన ఈ పదిహేను రోజుల్లోనూ ఇద్దరూ ప్రాణ స్నేహితురాండ్రయి పోయారు. కాని తనలో తలెత్తిన అనుమానాలు మనుషులమీద తనకు గల నమ్మకాన్ని వేళ్ళతో సహా పెకలించి వేసినయి.

ఆ రోజు....

ఆఫీస్‌నుంచి పెందలాడే వచ్చేశా రాయన. కారు హారన్ విని ఆశ్చర్య పోయింది తను. కాపరానికొచ్చి సంవత్స రం దాటిందిగాని ఏరోజూ అంతత్వరగా ఇంటికి రాలేదు.

"ఏమిటివాళ విశేషం! నాలుగింటికే ఇంటిమీద ప్రేమ కలిగింది?" అడిగింది తను నవ్వుతూ.

"చెప్పమంటావా?"

"అనే అర్థం."

"ఇందుకూ...." అంటూ తనని అధాటున మీదకు లాక్కొన్నారు. అనుకోకుండా లాగేసరికి తూలి పూర్తిగా ఆయన కౌగిట్లో ఇమిడిపోయింది,

"నిజం సుజీ! కాగితాలమీద సంతకం పెడుతోంటే నీ రూపమే కళ్ళగ్గనబడుతోంది. పైగా పంచరంగుల్లో!—అంతే! ఇక ఆగటం నావల్లకాలేదు. కాగితాలు విసిరి టేబుల్ మీద పడేసి ఆఖరికి మా హెడ్‌క్లర్క్‌గ్గూడా చెప్పకుండా ఇల్లు చేరుకొన్నాను."

క్షణకాలం తన మనసులో ఓవిధమైన ఆనందం, గర్వం, తృప్తి—అన్నీ మిళిత మయి నృత్యం చేసినయి.

"అన్నీ అబద్ధాలు" అంది నమ్మనట్లు నటిస్తూ.

అదుగో—అలా అన్నావంటే నువ్వంటే నాకెంత ఇష్టమో ప్రాక్టికల్‌గా చూపించాల్సి వస్తుందమ్మాయ్!" మరింతగా తనలోకి అదుముకొంటూ అన్నారాయన.

"వదలండి! తలుపులు తీసే ఉన్నాయి, ఎవరయినా రాగలరు."

"ఎవరా వచ్చేది? సిగ్గుండక్ఖర్లా?"

"ఎవరికి?"

"వాళ్ళకే...."

కిలకిల నవ్వేసింది తను.

"అన్నట్లు ఇవాళేదయినా సిన్మాకెళ్దాం. ఏం? త్వరగా రడీ అవుతావా? డిన్నర్ కూడా ఏదో హోటల్లో కానిచ్చేద్దాం. 'నైట్ అవుట్' వెళ్ళి చాలా రోజులు కూడా అయింది. ఏమంటావ్?"

"ఓకే!" అంది తను ఉత్సాహంగా.

మరోగంటలో ఇద్దరూ కార్లో ఆబిడ్స్ చేరుకున్నారు. షాపింగ్ సెంటర్‌ముందు ఆపి దిగారాయన.

"ఇక్కడెందుకూ?"

"దిగవోయ్ ముందు. తర్వాచెప్తాను" అన్నారు నవ్వుతూ.

దిగినుంచుంది తను.


"నావెంట తిన్నగా ఆ బట్టల షాపు లోకిరా! ఏం ప్రశ్నలేయడానికి వీల్లేదు."

"కాని, ఇప్పుడు."

"ప్రశ్నలు 'బాన్' చేశాను."

"అలాగయితే నేనసలురాను. ఇక్కడే నుంచుంటాను."

"ఒహ్హో! సిల్లీగాళ్! దగ్గరకురా చెవిలో చెప్తాను."



"ఇంకానయం! ఇదేమయినా ఇల్లులా కనబడుతోందా ఏమిటీ ఖర్మ?"

"ఛప్! అందుక్కాదు. అసల్సంగ తేవిటంటే అనగనగా ఓ అమ్మాయి."

"కథా?"

"చాలా చిన్నదిలే! నువ్వు స్పృహ తప్పేలోగానే పూర్తయిపోతుంది. ఎందాకా వచ్చాను?"

"అనగనగా ఓ అమ్మాయి."

'అవును. ఆ అమ్మాయి చాలా అందంగా వుంది."

"మీకు ఏ అమ్మాయి అందంగా కన బడదు కనుక."

"షరా–మధ్యలో అడ్డు మాట్లాడరాదు– ఆ అమ్మాయేమో ఇంకా బోలెడు అంద మయిన చీర—ఎంత అందమయిందంటే ఆ చీరకట్టుకోడంమూలాన–ఆ అమ్మాయి అందం పదింతలయిందన్నమాట–కట్టుకొని లకడీకాపూల్ దగ్గర బస్‌కోసం నిల బడింది—"

"ఇంకా అబ్బాయి రాలేదేం కథలోకి?"

"వచ్చేశాడు–అతగాడేమో కార్లో అటు వెళ్తున్నాడు. వెళ్తూ వెళ్తూ అటుచూసి ఠకీ మని 'లవ్'లో పడిపోయాడు."

"ఆ అమ్మాయితో!"

"అక్కడే దెబ్బతినేశావ్! ప్రేమలో పడింది ఆ అమ్మాయితో కాదు. ఆ అమ్మాయి కట్టుకొన్న చీరతో–ఎలాగయినా సరె–ఆ చీర తీసుకెళ్ళి తన ముద్దుల పెళ్ళా నికి ఇచ్చేయాలనుకొన్నాడు."

"ఛీపోదు! ఆ అమ్మాయి ఒప్పుకొం టుందేమిటీ? ఆ చీర రోడ్డుమీద తీసిచ్చేయ డానికి?"

"చీర-అంటే ఆ చీరే అని అపార్థం చేసుకొన్నావ్!—'అలాంటి చీరె' అని అర్థం—అందుకని వెంటనే ఆఫీసునుంచి పెందలాడే ఇంటికెళ్ళిపోయి పెళ్ళాన్ని వెనకసీట్లో వదేసుకొని షాపుకి చేరు కొన్నాడు కార్లో!"

"తరువాత?"

"కథ కంచికీ-మనం షాపుకీ!-ఆ చీర చూపిస్తాను షాపులో నీకు! నచ్చితే వెంటనే రెండుకొని తీసుకెళ్దాం."

"రెండెందుకూ?"

"రోజుకొకటిచొప్పున కట్టుకోడానికి."

"మీలాంటి వేలాంవెర్రి మొగుడో సారి...."

"కథకి టైంలేదు. సిన్మాకి టైమవు తోంది—ముందు షాపులోకి పద."

ఇద్దరూ షాపులోకి నడిచారు. అయిదు నిమషాల్లోనే ఆ చీర కనిపించింది.

"ఇదే....ఎగ్జాక్ట్లీ ఇదే"అన్నారాయన ఆనందంగా. నిజంగా చాలా అద్భుతంగా ఉందనిపించింది తనకూ్కడా.

"ఎంత ఇది?"

"రెండువందల అరవై."

"వెరీగుడ్ - ధరకూడా అందమైనదే- రెండు చీరలు పాక్ చెయ్యండి."

"రెండెందుకూ?" చిరాకుపడింది తను.

"ప్లీజ్! ఉండనీ" అంటూ బిల్లు చెల్లించి బయటకు నడిచారు.

కారు సినిమాహాలు వేపు దూసుకు పోసాగింది.

"మీరు డబ్బు అనవసరంగా వృధా చేస్తున్నారు."

"తప్పు!- 'వృధా' అనకూడదు."

"ఖచ్చితంగా అంటాను."

"నీ యిష్టం. నా మాటెప్పుడువిన్నావ్ కనుక.... కట్టుకున్న పెళ్ళానికి, కట్టుకో డానికి చీరలు కొనేహక్కు నాకు లేదన్న మాట.... అంతేనా?"

"నేనలా అనలేదు!"

కారు థియేటరు ముందు, కాంపౌం డులో ఆగింది.

ఇద్దరూ పాకెట్ డిక్కీలో ఉంచి లాక్ చేసి టిక్కెట్స్ తీసుకొని హాల్లోకి నడి చారు. ఎయిర్ కండిషన్ థియేటరవడం మూలాన లోపల చలిగావుంది. అప్పటికే న్యూస్‌రీలు మొదలయింది. సిల్వర్‌జూబ్లీ సెలబ్రేషన్స్- స్వాతంత్రం వచ్చినతరు వాత ఈ పాతికేళ్ళలోనూ మనం చేసిన ఘనకార్యాలు కొన్ని- పేద్ద, డాముల రూపంలోనూ, ఫ్యాక్టరీల రూపంలోనూ, అంకెల రూపంలోనూ కనిపించినయి. తరువాత వర్షంలేనందువల్ల పంటలు నాశన మైపోయిన కొన్ని రాష్ట్రాలు క్యూలో చూపించారు. ఆ తర్వాత వరదల్లోకొట్టుకు పోయిన ఊళ్ళని కొద్దిక్షణాలు సారోఫుల్ మ్యూజిక్‌తో షూటింగ్ తీశారు. తరువాత ఏవో ఆటల పోటీలు - అంతే! అసలు సినిమా మొదలయింది.

హీరోయిన్, హీరో కలసి ఆంధ్ర

దేశంలోని బృందావన్ గార్డెన్స్ లో ఝామ్మని డాన్స్ చేశారు. చాలా బీద కుటుంబానికి చెందినవారయినా. కష్టపడి ఈలోగా పదహారు డ్రస్సులు మార్చారు.

"బహుశా వాళ్లు లక్షాధికారులకెవరి కయినా బట్టలుతుకుతారేమో! లేకపోతే అంత ఖరీదయినవి ఎలా వేసుకోగలరు?" అన్నారాయన.

తనకు నవ్వు ఆగలేదు. "అంటే ఆ డ్రస్సులు వాళ్లవి కావనా?"

హఠాత్తుగా సీన్ మారిపోయింది.

మరో ఆడకూతురు ఎక్కడ్నించో వచ్చి ఠకీమని అదే హీరోని గంటకు రెండువందల కిలోమీటర్లవేగంతో ప్రేమిం చేసింది. ఆ ప్రేమని తోసిపుచ్చలేకపో యాడు హీరో!

ఇద్దరూ బ్రహ్మపుత్రా నదిలో నడుం వరకు మునిగి చలికి ఆగలేక ప్రేమ పాట పాడారు.

"మనం పెళ్ళిచేసుకుందామా?" అడి గిందా పిల్ల.

హీరోకి ఏడుపొచ్చింది.

"ఔననా? కాదననా?" అని విరహ గీతం పాడుకొంటూ భద్రాచలం అడవుల్లో తిరిగాడు, ఇంటర్వెల్ అయింది.

"అన్నట్లు నీకు చెప్పడం మర్చిపో యాను! రేపు హౌరా ఎక్స్ప్రెస్‌కి అరుణ వస్తోంది మనింటికి...." అన్నారు ఉత్సా హంగా.

"అరుణా?.... ఎవరామె?".

"నీకు అరుణ తెలీదా?" ఆశ్చర్యంగా తనవంకచూస్తూ అన్నారాయన.

"బొత్తిగా తెలీదు. ఏం? మీకు తెలుసా? అసలా అమ్మాయి ఎవరు?"

"బహుశా నీకు తెలీదనుకుంటానులే! కొంచెం దూరపు బంధుత్వం అనుకో! అయినా చిన్నప్పటినుంచీ కలసి తిరిగాం. చదువుకొన్నాం. పెళ్లయింతర్వాతభర్తతో విజయనగరం వెళ్ళిపోయింది. అంతే రెండేళ్లపోయింది. ఇంతవరకూ మళ్ళీ చూడటం పడనే లేదు. మధ్యాహ్నం టెలిగ్రాం వచ్చింది తను రేపువస్తున్నట్లు"

"ఓహో...."

"మనం పొద్దున్నే వెళ్ళి రిసీవ్ చేసు కోవాలి. చాలా సరదాగా, చనువుగా వుంటుందిలే.... నువ్వేం కొత్తదనం ఫీల వ్వక్కర్లేదు...."

"అలాగా—"

"పైగా వార పత్రికలో ప్రశ్నలకు నువ్విచ్చే జవాబులంటే పడిచచ్చిపోతుంది. మన వివాహ మవకముందే నీ జవాబుల గురించి పొగుడుతూ ఉత్తరాలు రాస్తూం డేది. ఎటొచ్చీ మన పెళ్ళవడం, వెంటనే నాకు హైద్రాబాద్ ట్రాన్స్ఫర్ కావడం- మూలాన ఆ గొడవల్లో ఆగిపోయినాయి. పెళ్ళయిన కొత్తలో ఒక ఉత్తరం వ్రాసింది. అదే ఆఖరి ఉత్తరం అను కొంటాను. ఎంత బాధపడుతూ రాసిందనీ

పెళ్లికి రాలేకపోతోందని: పైగా పత్రికలో జవాబుల శీర్షిక నిర్వహించే సుజాతే పెళ్లి కూతురని తెలిసేప్పటికి ఎంత సంతోష పడిందో తెల్సా? రెండు పేజీలు నీ గురించే రాసింది ఆ ఉత్తరంలో. ఎంత త్వరగా మనింటికి వచ్చి నిన్ను చూస్తానా అని ఉవ్విళ్ళూరుతోందిట – దానికి నేను జవాబు రాయనేలేదు....”


తనకి కొంచెం గర్వంవేసింది. తన జవాబులంటే ఆంధ్రదేశంలోని ఆడవాళ్ళం దరూ ఎలా పోటీలుపడి చదువుతారో తనకి బాగా తెలుసు. పత్రిక వాళ్ళకి అందుకే తనంటే చాలా గౌరవం భక్తీనూ! ఒక వారం కథలూ-సీరియల్సూ కూడా ఆపేసి మొత్తం జవాబుల శీర్షికే వేసే శారు. ప్రతీ ఊళ్లో తనని ఆరాధించే స్త్రీ లున్నారు. ఒక్క స్త్రీలనే ఏమిటి? పురు షులు మాత్రం? ఎన్ని ఉత్తరాలు రాసే వారు? పెళ్లి కాక ముందు చాలా మంది ప్రేమ లేఖలు కూడా రాశారు. అల్ప సంతోషులైన ఆంధ్రదేశపు ప్రజానీకాన్ని తల్చుకొంటే జాలికూడా కలిగిందామెకి. తను ఒకే ఒక నవల ఆ పత్రికలో సీరి యల్‌గా రాసింది. అది కూడా ఒక ఇంగ్లీష్ నవలకు కాపీ! ఈ సంగతెరీక అందరూ తనని ఆకాశాని కెత్తేశారు. అంతే! వెంటనే పత్రిక వాళ్ళు తనని అభ్యర్థించి జవాబుల శీర్షిక నిర్వహించడా నికి నియమించారు. అప్పట్నుంచీ తను ఎంతమంది జీవితాల్ని సరిదిద్దిందో-ఎంత మంది ఎదుర్కొంటున్న చిక్కుల్ని విడ దీసిందో-ఎన్ని సంసారాల్ని నిలబెట్టిందో అంతులేదు. తన జవాబుల మూలాన లాభం పొందిన వాళ్లు అనేకమంది తరు వాత ఉత్తరాలు రాశారు ధన్యవాదాలు తెలుపుతూ!

మళ్ళీ సినిమా మొదలయింది.

హీరో, ఎవర్ని పెళ్ళాడాలా అన్న విషయం మీద బొమ్మా బొరుసూ వేసు కొంటున్నాడు. ఆయన అరుణ గురించి ఇంకా చెప్తోనే ఉన్నారు. చాలా అల్లరి పిల్ల కూడానుట. ఓసారి నిచ్చెన వేసి తనని బాదం చెట్టు ఎక్కించి నిచ్చెన లాగి వేసిందట. రెండు గంటలు చెట్టుమీదే ఉండిపోవాల్సి వచ్చిందిట ఆయన. గుర్తుకి తెచ్చుకొని నవ్వుతూ చెప్పారాయన.

ఇద్దరు హీరోయిన్లూ, హీరో కలిసి ఏడుస్తూ డ్యూయెట్ పాడారు.

అప్పటికప్పుడే ఓ రెడీమేడ్ విలన్ సిన్మాలో జొరబడి ఓ హీరోయిన్ని అర గంటసేపు యుద్ధం చేసింతర్వాత ‘రేప్’ చేశేశాడు. ఆ హీరోయిన్ ఇంట్లోకెళ్లి వాళ్ల బాబాయి తాలూకూ పిస్టల్ తెచ్చి వాడినో గుండుతో కాల్చి, తనో గుండు కాల్చుకొని ‘ఢూం’మ్మంటూ చచ్చి పోయింది. వాడు బొంబేలో బిల్డింగుల మీద పారిపోతోంటే హీరో భీమవరం లోంచి చూచి (బైనాక్యులర్స్‌తో) జీప్‌లో ఆ బిల్డింగ్ చేరుకొని పైకెక్కి గంటసేపు



భీషణ స్టంట్ చేసి వాడిని చితగ్గొట్టేసి పోలీసులకి అందించేశాడు మద్రాసులో. సరిగ్గా అప్పుడే కొవ్వూరులో ఉన్న రెండో హీరోయిన్ మద్రాస్‌లో, అదే పోలీస్ స్టేషన్ చేరుకొంది హీరోని వెదుక్కొంటూ.

ఇద్దరూ అక్కడికక్కడే దండలు మార్చుకొన్నారు. హెడ్ కానిస్టేబుల్ వాళ్ళిద్దరినీ ఆశీర్వదించి, ఎందుకయినా మంచిదని వేలిముద్రలు తీసుకొన్నాడు. హఠాత్తుగా హాల్లో జనం లేచి కేకలేసుకొంటూ బయటకు పరిగెత్తారు. హాలుకి నిప్పంటుకొందేమో అనుకొంది సుజాత ఖంగారుగా.

“జనగణమన.... వేస్తారనీ....” అన్నా రాయన నవ్వుతూ.

ఇద్దరూ క్వాలిటీ హోటల్లో భోజనం చేసి ఇల్లు చేరుకొన్నారు. పదయిండి టైము. పడగ్గదిలో టేబుల్‌లాంప్ ముందు కూర్చుని ఆ వారం ప్రశ్నలు చదివి జవాబులు వ్రాయసాగింది సుజాత.

“అక్కయ్యా! నా జీవితం ఏదయినా ప్రమాదానికి గురవుతుందేమో అని కొంచెం భయంవేస్తోంది. వారంరోజుల్నించీ ఆయన నాదగ్గరకు రావటం లేదు. అసలెక్కడకుపోయారో కూడా తెలీదు.

పిల్లలందరూ “నాన్న ఏరి?” అని అడుగుతున్నారు! నాకేం చెప్పాలో అర్థం కావటంలేదు. అప్పులాళ్ళు ఇంటిచుట్టూ తిరుగుతున్నారు. ఏదయినా ఉద్యోగం చేద్దామంటే నాపొట్టకోసినా అక్షరంముక్క కనబడదు. అమ్మా నాన్నలు వద్దంటున్నా వినకుండా, ఆయనతో లేచివచ్చేసినందుకు ఇది నాకు భగవంతుడు విధించిన శిక్ష

అనుకొంటాను. ఇప్పుడు నాగతి ఏమిటి? నాలాంటివాళ్ళకి ఉపాధికల్పించే సంస్థ లేమ యినా ఉంటే వాటి అడ్రసులు ఇవ్వండి. మీ జవాబుకోసం గద్దలాగా ఎదురుచూస్తుంటాను."

"నీ పరిస్థితి చూస్తూంటే గుండె తరుక్కుపోతోంది చెల్లాయ్! నీకు భగవంతుడే సహాయం చెయ్యాలి! ఎప్పటికయినా అతను తన తప్పు తెలుసుకొని నీ దగ్గర కొస్తాడు అంతవరకూ ఓపికపట్టు!"

మరో ఉత్తరం తీసింది సుజాత.

"అతనూ, నేనూ 1960 లో ఓసారి మా బంధువుల పెళ్ళిలో కలుసుకొన్నాము. అయిదు నిమషాలపాటు ఇదరం ఒకరివంక ఒకరు చూసుకొన్నాం. తిరిగి పన్నెండేళ్ళ తరువాత ఈ మధ్య అతన్ని కలుసుకొన్నాను. భార్యాబిడ్డలతో గుడికివెళ్తూ కనిపించాడు. నాకు దుఃఖం ఆగలేదు. గత నెల్రోజులుగా ఏడుస్తూనే వున్నాను. చివరకు దుఃఖం పట్టలేక మీకీ ఉత్తం వ్రాస్తున్నాను. ఈ పురుషజాతి మోసాలకి ఒక హద్దులేదా అక్కా? నా కళ్ళల్లోకి అయిదు నిమషాలపాటు 'ఎక్స్‌రే' తీస్తున్నట్లు చూసి—నా హృదయాన్నిలాక్కొని—వన్నిలా అన్యాయం చేయటానికి అతని కెవరిచ్చారు అధికారం?"

"పిచ్చిరాధా! ఈ మొగాళ్ళు క్రూరులమ్మా! అలా హృదయం ఎక్కడపడితే అక్కడ పారేసుకోకు! ప్రపంచ చరిత్రంతా మన ఆడదానికి జరిగిన అన్యాయాలతోనే నిండిపోయింది! నీ కథ మరో పుట! అంతే! జరిగింది మెల్లగా మర్చిపోడానికి ప్రయత్నించు. ఆ పిల్ల 'కేస్' చూస్తే సుజాతకి నిజంగానే జాలికలిగింది. చదువూ సంధ్య లెక్కచలేనట్లుగా వుంది ఆ ఉత్తరంలోని అక్షరాలు చూస్తూంటే.

మరో ఉత్తరం తీసింది సుజాత.

"కొన్ని కారణాలవల్ల—నాకూ అతనికీ వివాహం కాలేదక్కయ్యా! అతను వాళ్ళ మామయ్యకూతురిని చేసుకొన్నాడు. నేను మా పెద్దాళ్ళు కుదిర్చిన సంబంధం చేసుకొన్నాను. కాని నాపెళ్ళయి సంవత్సరమన్నా తిరక్కముందే ఆయనతో కలతలు మొదలయినయి. ఈ మధ్యన హఠాత్తుగా గుండె జబ్బుతో మరణించారు. ఆ సమయంలో అతను వచ్చి నన్ను మానసిక సంక్షోభంనుంచి రక్షించి తన ఇంటికి తీసుకెళ్ళారు. ఈ కొద్దిరోజుల్లోనూ నేనూ, అతనూ తెలుసుకొన్న సత్యం ఏమిటంటే మేమిద్దరం ఒకరిని ఒకరు వదలి ఉండలేమని, కాని అతని భార్య ఈ విషయాన్ని ఎలా తీసుకొంటుందోనని భయపడుతున్నాను. అతను దగ్గరలేకపోతే నేను మాత్రం బ్రతకలేను. ఈ భయంకరమైన సమస్య ఎలా పరిష్కారం చేయాలో చెప్పి మా ముగ్గురినీ రక్షించండి. మీ జవాబు కోసం వేయికళ్ళతో ఎదురుచూస్తుంటాను."

రెండు నిమషాలు ఆలోచించింది



సుజాత. ఇలాంటి సమస్య ఇంతకుముం దెప్పుడూ వచ్చిన గుర్తులేదు. ఆ పరిస్థితిలో ఆ అమ్మాయి ఏం చేయాలా అని కొద్ది క్షణాలు ఆలోచించింది. అతని భార్యతో విషయమంతా చెప్పి, ముగ్గురూ కలిసి వుంటే మంచిదనిపించింది. అదే వ్రాయ సాగింది.

''చెల్లీ! నీది చాలా గడ్డుపరిస్థితమ్మా దీనికి పరిష్కారం ఒక్కటే; మీముగ్గురూ నిష్కల్మషమైన హృదయాలతో చర్చించు

కాని ఒక నిర్ణయానికి రావడం మంచిది. ముగ్గురూ కలసి వుండటం ఏ దృష్టిలో చూచినా శ్రేయస్కరం. అతని భార్య పరిస్థితిని అర్థంచేసుకొని అందుకు అంగీకరించాలి. తెలివిగల స్త్రీగా ఆమె బాధ్యత అది'' పదకొండు ప్రశ్నలకు జవాబులు వ్రాసి లైటార్పి పడుకొందామె. పదకొండు మంది స్త్రీ పురుషుల సమస్యలు గంటన్నర కాలంలో కాగితంమీద పరిష్కారమైపోయినయి.

"త్వరగా లేవాలి మరి. తెల్లారిపోతుంది ఇంకో పావుగంటలో రైలొచ్చేస్తుందట" అంటూ తట్టి లేపారాయన మర్నాడు ఉదయం.

లేచి టైమ్‌చూసింది సుజాత. ఆరవడానికి ఇంకా టైముంది. త్వరగా టాయిలెట్ అయి కార్లో ఇద్దరూ స్టేషన్ చేరుకున్నారు. రావల్సినటైముకి అయిదు నిమిషాలు ముందే వచ్చేసింది బండి.

ఎదురుగ్గా ఆగిన స్లీపర్‌కోచ్‌లో నుంచి దిగింది అరుణ.

"అదుగో అరుణ! హలో అరూణ్" అంటూ ముందుకు పరుగెత్తారాయన చిన్నపిల్లాడిలా. తనకు నవ్వువచ్చిందిఆయన్ని చూస్తే. మెల్లిగా తనూ అక్కడికి చేరుకొంది.

"మా శ్రీమతా? ఇదిగో! జవాబుల శీర్షిక సుజాత! అరుణ సుజీ! నీ ఫాన్!'' అంటూ పరిచయం చేశారాయన.

"హల్లో! నమస్తే అక్కా! నేనను కొన్నాను. ఎప్పటికయినా మిమ్మల్ని కలుసుకు తీరాలని! ఆ కోర్కె కాస్తా ఠక్కీమని తీరిపోయింది. అబ్బ మీ జవాబులంటే నాకెంత ఇష్టమో మీకు తెలుసా? అన్నీ కట్‌చేసి బైండ్‌చేయించి దాచుకున్నాను. మీకది దేముడిచ్చిన వరమక్కా! అంత సూటిగా చక్కటి జవాబులివ్వడం అందరికీ చేతనయే పని కాదు."

"కొంచెం పొగడటం తగ్గించండి లేకపోతే గర్వం పెరిగిపోతుంది నాకు."


"ఫర్లేదక్కా! మీరు నిజంగా గర్వపడాల్సిన జవాబులు మీవి."

"జవాబుల శీర్షిక గురించి రైల్వేస్టేషన్‌లోనే మాట్లాడుకోవాలని రూలేమీ లేదు. మీ కబుర్లు కావాలంటే కారులో కంటిన్యూ చేయవచ్చు. బయటకు పదండి!'' అన్నారాయన.

ముగ్గురూ రెండు సూట్‌కేసులు కూలీలకిచ్చి బయటకు నడిచారు. పది నిమిషాల్లో ఇల్లు చేరుకొంది కారు.

"ఇదీ మా ఇల్లు! నీలాగానే సుజాతకి కూడా ఇల్లు అద్దంలా కనిపించేలా ఉంచడమంటే ఇష్టం. నాకొంచెం కష్టమే అనుకో ఈ పద్ధతి. అయినా తప్పదు మరి..."

"కొంచెం కష్టమేమిటి? చాలా కష్టమయి ఉంటుంది. నీ సంగతి నాకు తెలియందేముందీ? సిగిరెట్లూ-అగ్గి పుల్లలూ



పెళ్లికాక ముందే నా నా గొడవగానూ ఉండేది నీ గదంతా! మునిసిపాలిటీ బండి నీ గది కిటికీ దగ్గర ఆపి చెత్తంతా లోడ్ చేసేవాళ్లు అందులోకి..."

నవ్వుతూ అంది అరుణ. అలా నవ్వుతోన్నప్పుడు ఆమె విపరీతమయిన అందంగా కనిపించింది తనకి. ఆమెనంటి రంగు చామనచాయగా ఉన్నా చక్కని కళగల ముఖం. కళ్లల్లో ఓ విధమయిన ఆకర్షణ ఉంది. ఒక్కసారి ఆమెవంక చూసి ఊరుకుండిపోవడం చాలాకష్టం. కనీసం మరొక్కసారయినా తనివితీరా చూస్తే బాగుండుననిపించేంత అందంగా ఉంటుంది.

తనకూడా నవ్వు కలిగించినయి ఆమె మాటలు.

"కొంచెం పరువుంచు! చాలాగుట్టుగా, జాగ్రత్తగా నెగ్గుకొస్తున్నాను మా ఆవిడ దగ్గర..." నవ్వుతూ అన్నారాయన.

"అక్కతన్నీ చెప్పేస్తాగదా! చిన్నప్పుడు నీ చేష్టలూ-కధలూ—"

అందరూ నవ్వేశారు.

పది గంటలకల్లా భోజనం ముగించి వెళ్ళిపోయారాయన.

రెండు రోజులు చాలా సరదాగా నవ్వుతూ, తుళ్లుతూ గడిచిపోయినాయి. ఆ రెండ్రోజులు ఆఫీస్‌నించి త్వరగా వచ్చేశారాయన. ఆయన గురించి చిన్నప్పటి చిలిపి కధలు చాలా చెప్తుండేది అరుణ. ముగ్గురూ చాలా సేపటివరకూ నవ్వుకొంటూండేవారు. ఆ రెండు రోజు

ల్లోనే తనకు చాలా ఆప్తురాలయిపోయిందామె. తనకు చెల్లెళ్లు లేరు. అరుణ 'అక్కా' అని పిలుస్తోంటే అదోవిధమైన తీయని అనుభూతి కలుగుతుండేది. ఐతే ఆ ఆనందం ఎంతోకాలం నిలవ లేదు. ప్రతి ఆడదానికీ సహజసిద్ధమైన గుణం ఒకటుంది. తోటి ఆడదానిమీద అసూయ. తనూ అతిదారుణంగా ఆ వ్యాధికి గురయింది. అరుణతో మాట్లాడేప్పుడు ఆయన చూపే ఉత్సాహం- తను లేకుండా కూడా గార్డెన్‌లో వాళ్లు నవ్వుతూ మాట్లాడేతీరు తనలో ఓ విధమయిన అసూయ కలిగించినయి. తద్వారా కొన్ని అనుమానాలు! తనతో అంతవరకూ ఆయన అంత హాయిగా, ఆనందంగా ఎప్పుడేనా మాట్లాడారా? ఆఫీస్‌నించి అంత త్వరగా వచ్చేసి కబుర్లుచెపుతూ కూర్చున్నారా? రెండ్రోజులకొక సినిమాకు తీసుకెళ్లారా? శనాది వారాలు రెండురోజులూ గండిపేటకూ, నాగార్జునసాగర్‌కీ, ఇంకా చాలా సాగర్లకీ కార్లో తిప్పారా? ఇలాంటి ప్రశ్నలు క్షణానికొకటి చొప్పున పుట్టి మనసుకి శాంతిని దూరంచేయడంమొదలుపెట్టాయి. పైగా అరుణ ఎందుకొచ్చిందో, ఎన్నిరోజులుంటుందో, వాళ్లాయనకూడాఎందుకు రాలేదో ఏమీ తెలియచేదు. రాన్రాను అరుణతో మనస్ఫూర్తిగా మాట్లాడలేకపోయింది. ఆమెతో కలసి నవ్వుతున్నప్పుడు తన నవ్వులో జీవం కనిపించటం లేదు. భర్తతోకూడా ఇదివరలా సరిగ్గామాట్లాడ్డం కుదరటంలేదు. ఇద్దరిమధ్యా దూరం ఉన్నట్లనిపించసాగింది. అయితే అరుణ చాలా సెన్సిబుల్! అంచేత తనని ఇట్టే అర్థం చేసుకుంది. తన మనసులోని భావాలన్నిటినీ చాలా తేలిగ్గా చదివేసింది. ఆమర్నాడు మధ్యాహ్నం ఆయన ఆఫీసుకెళ్ళిపోయాక తను "హౌటూస్టాప్ వర్రీయింగ్ అండ్ స్టార్టులివింగ్" అనేపుస్తకం చదువుతోంటే అరుణ తన దగ్గరకొచ్చి కూర్చుంది. తను అదేమీ గమనించనట్లే నటించసాగింది. కొద్దిక్షణాలు మౌనంగా కూర్చున్న తరువాత 'అక్కా'అంటూ పిలిచింది నెమ్మదిగా.

పుస్తకం పక్కనపడేసి ఏమిటన్నట్లు ఆమెవంక చూసింది తను.

"నువ్ నా గురించి ఏమనుకొంటున్నావక్కా? ఏమీ దాచకుండా చెప్పెయ్యవూ? ఇవాళ పూర్తిగా మనసులు విప్పి మాట్లాడుకోవాలనుంది నాకు."

తను కొంచెంగా తడబడింది.

"నీ గురించా నే నేమనుకొంటాను?"

"అదే అక్కా! ఈ అరుణెవరూ? ఇక్కడి కెందుకొచ్చింది? భర్త ఏమయ్యాడూ? ఇలాంటి ప్రశ్నలు రావటం లేదూ? తప్పకుండా వీటికి సమాధానాలు తెలుసుకోవాలనే ఉంటుంది నీకు...అవునా అక్కా?"

"ఇచ్చితంగా తెలుసుకోవాలనే పట్టుదలేం..లేదు."

"నాదో చిన్న కథక్కా! వచ్చిందగ్గర్నుంచీ చెప్దామనే అనుకొంటున్నాను. కాని, ధైర్యం చనువు చాలలేదిన్నాళ్ళూ! నేను యస్సెల్సీ చదువుతోండగా ప్రేమలో పడ్డాను."


తను నవ్వేసింది.

"ప్రేమ కథన్నమాట."

"ప్రేమ కథేగాని, ఈ కథనిండా కష్టాలూ, కన్నీళ్ళూ నిండిపోయి ఉన్నాయక్కా! ఆనాడు నేను ఏమాత్రం తెలివిగా, ధైర్యంగా ప్రవర్తించి ఉన్నా ఈనాడు నాకీ కథ చెప్పే అవసరం ఉండేది కాదు" కొద్దిగా ఆగింది అరుణ.

ఆమె కళ్ళనిండుగా నీళ్ళు నిలిచినయి.

"అతను అంతకుముందు చాలాకాలం నుంచీ నాకు తెలుసు. మా రెండు కుటుంబాల మధ్యా రాకపోకలున్నాయి. కానీ యస్సెల్సీ కొచ్చేవరకూ మేమిద్దరం ఒకరి మనసులో మరొకరు ఆరాధింపబడుతున్నామని తెలీదు. తెలిసే సమయానికి, ఇద్దరం ఒకటవుదామనే నిర్ణయం తీసుకొనేలోపల చాలా సమస్యలు-పరిస్థితులు అడ్డం వచ్చేసినయి. నాకు మరొకతనితో వివాహం అయిపోయింది. వెంటనే విజయనగరం వెళ్ళిపోయా నాయన్తో. అసలు కథ ఇక్కడి నుంచే మొదలవుతుందక్కా! ఒక సంవత్సరంపాటు మా సంసారం సాఫీగానే నడిచింది. ఈలోగా నేను నా ప్రేమ కథను మర్చిపోడానికి శతవిధాల ప్రయత్నించాను.



కాని అప్పుడప్పుడు అతను వ్రాసే ఉత్తరాలు తిరిగి నన్ను యథాస్థితికి తెస్తుండేవి. ఫలితంగా ఆయనతో ఎప్పుడూ మనసిచ్చి మాట్లాడలేక పోయేదాన్ని. సరదాగా సంతోషంగా ఒక్కరోజు కూడా కనిపించలేదు. ఏనాడూ ప్రణయంలో మనస్ఫూర్తిగా పాల్గొనలేకపోయాను. ఆయన్ని చూసినప్పుడల్లా అతను గుర్తుకొస్తుండే వాడు. ఆయన నన్ను కౌగలించుకొన్నప్పుడు అతనితో జరిపిన ప్రేమకలాపాలు గుర్తుకొస్తుండేవి. నా ప్రవర్తన ఆయనకు అనుమానం కలిగించింది. మగాడికి అనుమానం రానేకూడదు. వచ్చిం తరువాత నిజాన్నికూడా నమ్మటానికి సందేహిస్తాడు. పోస్ట్‌మన్‌ని కలుసుకొని ఇంటికొచ్చే ఉత్తరాలు కూడా ఆఫీసుకే అందేట్లు ఏర్పాటు చేశారు. ఆ రకంగానే అతను

రాసిన ఉత్తరం ఆయన చేతుల్లో పడింది.”

“మైగాడ్” ఉలిక్కిపడుతూ అంది తను. ఆ క్షణంలో ఎందుకో గుండెలు కొట్టుకొన్నయి.

“నువ్వు అతన్ని ఉత్తరాలు రాయొద్దని మందలించి ఉండాల్సింది.” అంది సుజాత.

“అనుకొన్నానక్కా! కాని నావల్ల కాలేదలా మందలించడం. అతని విషయంలో నేను పూర్తిగా బలహీనురాల్ని.”

సుజాతకు ఒక్కసారిగా అరుణ మీద జాలి, అభిమానం ముంచుకొచ్చింది.

“తరువాతేమయింది?” ఆత్రుతగా అడిగింది.

“ఆ సాయంత్రం ఆయన ఇంటి కొచ్చారు. రాగానే నన్ను పిలిచి పక్కన కూర్చోబెట్టుకొన్నారు. “ఈ ఉత్తరం నీకు వచ్చింది. కొన్ని కారణాలవల్ల నేను చదవాల్సి వచ్చింది. నువ్ చదువుకో! తరువాత దీన్నిగురించి మాట్లాడుకొందాం!” అన్నారు ఉత్తరం నాకందిస్తూ. నేను భయంగానే ఉత్తరం అంతా చదివాను.

“ఎంత ధైర్యం?” విస్తుపోతూ అంది సుజాత.

“ఆసమయంలో నిజంగానే ఏదో ధైర్యం ప్రవేశించిందక్కా నాలో! ఎలాగూ ఆయనకు మా విషయం తెల్సిపోయింది. తెల్సింతర్వాత ఇక చేయగలిగిందీ, దాచగలిగిందీ ఏమీ లేదనిపించింది. ఒకవేళ ఇప్పుడుకాకపోతే, ఎప్పటికయినా ఇలాంటి విషయాలు బయటపడక మానవు.”

“అతనెవరూ?” అడిగారాయన.

“మా ఇంటిదగ్గరే వాళ్ళిల్లు – ఇద్దరం కలిసి చదువుకొన్నాం” అన్నాను.

“మీ ఇద్దరూ ఈ ప్రేమకలాపాలు మొదలెట్టి ఎన్ని సంవత్సరాలవుతుంది?”

“రెండు సంవత్సరాలు.”

“అంటే పెళ్ళికిముందే మీరు ప్రేమించుకొన్నారన్నమాట.”


“అవును.”

“మరి పెళ్ళెందుకు చేసుకోలేదు. ఇద్దరు మొగుళ్ళుంటే బావుంటుందనుకున్నావా?”

“మా ఖర్మ కుదరక మాకు పెళ్ళికాలేదు. అంతమాత్రాన మీరు నా గురించి ఇలా నీచంగా మాట్లాడనక్కర్లేదు.”

ఈమాట పూర్తికాకుండానే నా చెంప ఛెళ్ళుమంటూ మోగింది. అదే మొదటిసారి ఆయన ఉగ్రస్వరూపాన్నిచూడటం. కళ్లు బైర్లు కమ్మినట్లయింది. నాకు తెలీకుండానే కళ్ళవెంబడి బొటబొటా నీళ్ళు కారిపోయాయి.

“నిన్ను కత్తితో పొడిచెయ్యాలనుంది. ఆనక నేనేమయిపోయినా నా కిష్టమే. నీలాంటి విషజంతువులను చంపటం మూలాన చాలామంది ఆడపిల్లలకు మంచి



పారం నేర్పినవాణ్ణవుతాను" అంటూ జేబులు సొరుగు లాగారు. అందులో బాకు కనిపించలేదాయనకు.

"నేనేం పాపం చేశాననీ.... మీకంత కక్ష?" అన్నాను గొంతు పెగల్చుకుని. ఆయనకు ఉద్రేకం ఆగలేదు. జుట్టుపట్టుకొని తన చేతులు నొప్పిపుట్టేవరకూ నన్ను గొడ్డులా బాదారు.

"రాక్షసీ! ఎన్నో కలలుగన్న నా జీవితాన్ని సర్వనాశనం చేశావ్! నేన్నీకు ఏం అపకారం చేశాను? నీకు కావాలంటే ఎంత మంది మగాళ్ళులేరు? నాలాంటి యువకుల పచ్చని భావికెందుకిలా చిచ్చుపెట్టావ్?

కోరుకున్న వాడితోనే పోవాల్సింది. లేక పోతే పెళ్ళిచేసుకోకుండా చావాలి! మధ్య మూడోమనిషినెందుకీడ్చావ్?...." గోడకి ఆనుకుని ఒగరుస్తూ ఉద్రేకం, బాధ, విచారం మిళితమయిన గొంతుతో అన్నారు. నేనేమీ మాట్లాడలేదు నాఖర్మ అలాకాలిపోయినందుకు ఏడుస్తూ కూర్చుండిపోయాను.

"నిజంచెప్పు? నువ్వింకా వాడినే ప్రేమిస్తున్నావ్ కదూ?"

మౌనంగా ఊరుకున్నాను.

"నీ కొరక నమస్కారం చేస్తాను. వెంటనే మీ ఇంటికెళ్ళిపో! కోపంతో నిన్నేంచేస్తానో నాకే తెలీదు. మనం కోర్టు ద్వారా విడాకులు తీసుకుందాం. ఇంకె

ప్పుడూ నాకు కనిపించడానికి ప్రయత్నించకు. తెల్సిందా?''

అంతే। ఆరోజే మా ఇంటికెళ్ళిపోయాను. ఆ తరువాత మేమిద్దరం కోర్టు ద్వారా విడిపోయాం. ఈలోగా నేను ప్రేమించిన తనకి వివాహం అయిపోయింది నా సంగతి తెలిసి అతను మా ఇంటికొచ్చాడు. ఇద్దరం నిర్ణయించుకొంటేమిటంటే ఒకరిని విడిచి ఒకరు ఉండలేమన్నిఇదక్కా। నా పరిస్థితి. ఇప్పుడేం చేయాలో అర్థంకావటంలేదు. నా కథంతా చూచాయగా కొంచెం మార్చి ఓ ప్రశ్నరూపంలో నీ జవాబుల శీర్షికకు రాశాను. నీ జవాబెలా ఉంటుందో, ఎలా పరిష్కరిస్తావో చూద్దామనిపించింది. నీమీద నాకు నమ్మకముందక్కా। నువ్వేం జవాబిచ్చినా శిరసా వహించేస్తాను.''

సుజాత ఆశ్చర్యపోయింది.

''అలాగయితే ఆ ప్రశ్న వ్రాసింది నువ్వా? ఇంకెవరో అనుకొన్నాను. నాకు బాగా గుర్తుందా ప్రశ్న. ఎంచేతంటే చాలా క్లిష్టమయిందవడంచేత ఎక్కువసేపు ఆలోచించాల్సి వచ్చింది. అఫ్‌కోర్స్—పరిష్కారం దొరికింది కూడా। నన్నడిగితే ప్రతి సమస్యకు ఏదో ఒక పరిష్కార మార్గం ఉంటుంది. అది సావకాశంగా, తెలివిగా ఆలోచించి కనుక్కోకుండా చాలా మంది తొందరపాటు నిర్ణయాలు తీసుకొని బురదలో కాలేస్తుంటారు''

అరుణ మొఖమంతా సంతోషం వెలిగిపోయింది.

''నాకు తెలుసక్కా నువ్వు నిజంగా ఒక వొండర్‌వి।''

''పోస్ట్'' అంటూ రెండు పత్రికలు అందించాడు పోస్ట్‌మన్.

''బహుశా నీ ప్రశ్నకు జవాబు యీ వారంలోనే ప్రచురించి ఉండాలి. చూడు।'' అంటూ పత్రిక అందించింది సుజాత.

అరుణ ఆత్రుతగా పేజీలు తిప్పింది. జవాబుల శీర్షికదగ్గర ఆమె కళ్ళు నిలచిపోయినయి.

''ఇదిగో నా పేరు.


''అరుణ, మచిలీపట్టణం.''

అనేసి త్వరత్వరగా చదివేయ సాగింది అరుణ. చదువుతున్న కొద్దీ ఆమె కళ్ళల్లో వెలుగు అధికమయిపోసాగింది.

''అక్కా నువ్ నిజంగా దేవతవు। జవాబులతోపాటు నీ మనసు కూడా అమృతమయం। నా కివాళ చాలా సంతోషంగా ఉందక్కా।'' అంది ఆనందంగా.

ఆ వేళంతా ఆమె సంతోషంగా కూనిరాగాలు తీస్తూ ఇల్లంతా తిరుగుతూనే ఉంది. సాయంత్రం ఆయన ఇంటికొచ్చేసరికి ఆమే పరుగుతో ఎదురువెళ్ళింది.

''ఏమిటి హడావుడి? మీ సుజాతక్కయ్య రాసిన జవాబుని ఎవరయినా సినిమాగా తీస్తున్నారా?'' అన్నారాయన నవ్వుతూ.



"ఛప్! అదేంకాదు. ఇవాళెంత సంతోషమయిన రోజో తెలుసా?"

"ఏమిటి సంగతి? సుజాతేది?" అన్నారాయన గదిలోకి నడుస్తూ!

"వంటింట్లో వుంది. నేనెందుకింత సంతోషంగా వున్నానో ఊహించుకోలేవా?"

అతని వెనుకే నడుస్తూ అంది అరుణ.

సుజాత వంటింట్లోంచి బయటకు వస్తుందల్లా రక్కున అక్కడే ఆగిపోయింది.

ఏదో అనుమానం ఆమెలో ప్రవేశించి ఆమెని భయంతో ఊగించివేసింది.

మొఖం పూర్తిగా పాలిపోయింది. మెల్లగా గదిదగ్గరకు నడిచి కిటికీలోనుంచి లోపలకు చూసింది లోపల అరుణ ఆయన కౌగిలిలో ఒదిగిపోయి వుంది ఆమె పెదాల మీద గాఢంగా ముద్దుపెట్టుకొంటున్నారాయన. సుజాత కాళ్ళక్రింద భూమి నెమ్మదిగా కంపిస్తున్నట్లు అనిపించ సాగింది. కళ్ళు తిరుగుతున్నట్లు కూడా వుంది.

"మన సంగతి అంతా చెప్పేశావా?" అడిగారాయన అరుణని.

"నువ్వని చెప్పకుండా మన కధంతా చెప్పేను. అక్కయ్య ఆమాత్రం ఊహించుకోలేకపోతుందా. మనిద్దరం చిన్నప్పటి నుంచీ స్నేహితులం అని చెప్తూ వున్నాం ఓ ప్రక్క. భర్త విడాకులిచ్చేశాడని కూడా చెప్పాను.

నేను మీదగ్గరకు రావటంలో అర్థం ఆ మాత్రం గ్రహించుకోలేదా? పైగా జవాబులో కూడా ఏమిరాసిందో తెల్సా? మనం ముగ్గురం కలసి ఉండటం శ్రేయస్కరం అట. అతని భార్య అంటే సుజాతక్క

కూడా అందుకు అంగీకరించాలట."

నవ్వుతూ అంటోంది అరుణ.

"అంటే మనం ఇన్నాళ్ళూ యమ యాతనపడుతూన్న సమస్య అతి తేలిగ్గా క్షణాల్లో తేలిపోయిందన్నమాట" మరింత గాఢంగా ఆమెని గుండెలకు హత్తుకొంటూ అన్నారాయన.

"నేనూ అనుకోలేదు అక్క- ఇంత మంచిదని. అక్క-లాంటి సిన్సియర్ మనుషులెంతమంది వుంటారంటావ్?" మత్తుగా అంది అరుణ.

"సరిగ్గా అదే సమయంలో ఆయన కళ్ళు కిటికీదగ్గరనుంచున్న తనమీద పడి నయి. గాభరాగా అరుణని దూరంగా నెట్టి నిలబడ్డారు. మొఖంనిండా సిగ్గు, ఖంగారు అలుముకొన్నాయి. వాటిని దాచటానికి ప్రయత్నిస్తూ చిన్నగా నవ్వి "రాసుజీ, అక్క-దే నిలబడ్డావేం?" అన్నారు. అరుణ బెదురుగా తలుపువేపు చూసింది. ఏం చేయాలో సుజాత కర్థంకాలేదు. వెనక్కు-పరిగెత్తుకు పోదామనిపించిందిగానీ, ఏదో శక్తి తనని ముందుకి నడిపించింది. గది లోకి నడిచి డ్రస్సింగ్‌టేబుల్ దగ్గరగా నిలబడిపోయింది. కొద్దిక్షణాలు అతి నిశ్శబ్దంగా గడిచినయి.


"హ....అదే .... అరుణ చెప్తోంది. ఇప్పుడే నీ గురించి అరుణకూ నాకూ మధ్య కథ తెలిసినా నువ్వేమీ అభ్యంతరం చెప్పలేదనీ-అఫ్‌కోర్స్-అసలు నేనేఎప్పటి నుంచో నీకీవిషయంచెప్పాలని....కాని.... గిల్టీకాంషస్. సైక్‌లాజికల్‌గా పిరికితనం అది నువ్వెలా తీసుకొంటావోనని భయం. కాని నాకు నమ్మకమే; ఓవేళ నేను చెప్ప గలిగితే నువ్వు చాలా సింపథటిక్‌గా ట్రీట్ చేస్తావని మన పెళ్ళవుతున్నప్పుడు ఇలాంటి పరిస్థితి వస్తుందని నేననుకో లేదు....ఇప్పుడు ఇటు నిన్నూ-అటు అరుణనీ ఎవ్వరినీ వదులుకొనే స్థితిలోలేను.... నీకు తెలీకుండా చాటుమాటు వ్యవహారాలు సాగించడం కూడా నాకిష్టంలేదు. చివరకు ఈ విషయం నీ ముందుంచటానికి అరుణే ధైర్యం చేసింది....."

అక్క-డక్క-డ తడబడుతూ మాట్లాడా రాయన.

"నాకు డైరక్టుగా చెప్పడానికి ధైర్యం చాల్లేదక్కా-. అందుకే ముందు నీ జవాబుల శీర్షికకు ప్రశ్నగా పంపించాను. ఇందాక జవాబు చూశాక నాకు పూర్తి ధైర్యం వచ్చింది."

నెమ్మదిగా తలవంచుకొనే అంది అరుణ.

సుజాత పళ్ళతో క్రిందిపెదిమని నొక్కి-పట్టి దుఃఖాన్ని తమాయించుకొంది. అతి కష్టంమీద చిన్నగా నవ్వి "పదండి కాఫీలు తీసుకొందాం?" అనేసి అక్క-డినుంచి చకచక వంటింటివేపు నడిచింది. వంటింట్లో కొచ్చేసరికి ఆమెకు దుఃఖం ఆగలేదు. మొఖంమీద చేతులుంచుకొని వెక్కి-వెక్కి-ఏడవటం మొదలు పెట్టింది. ఏడుస్తూనే



కప్పుల్లోకి కాఫీ నింపి చీరచెంగుతో మొఖం తుడుచుకొంది. రెండు నిమిషాలు ఏడ్చే సరికి మనసులో కొంత భారం తగ్గినట్లయింది. ఈలోగా అరుణ లోపలకు వచ్చేసింది.

"ఆయన మొఖం కడుక్కొని వస్తున్నారక్కా. ఈలోగా మనం తాగేద్దాం. చల్లారిపోతుందేమో'' అంది. తనకళ్ళల్లోకి చూడ్డానికి ఆమెకు మనస్కరించడంలేదని ఇట్టే తెలిసిపోతోంది.

ఇద్దరూ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని చెరో కప్పూ అందుకొన్నారు.

ఇంకా కాఫీ త్రాగుతూండగానే ఆయన కూడా లోపలికొచ్చేశారు.

"నాక్కూడా ఇవాళ చాలా ఆనందంగా వుంది సుజీ! తలమీదనుంచి పెద్ద బరువు దింపేసినట్లయింది. మనం ఇవాళ సినిమా కెళ్ళి కాసేపు సర్దాగా గడిపివద్దాం పదండి.... త్వరగా రడీ అవాలి....అట్టే టైమ్‌లేదు.'' అన్నారు సాధ్యమయినంత మామూలుగా మాట్లాడ్డానికి ప్రయత్నిస్తూ.

గట్టిగా ఏడ్చేసి ఇద్దరినీ నాలుగూ దులిపేసి అక్కడినుంచి పారిపోదామనిపించింది సుజాతకి. కాని అతి బలవంతం మీద ఆ కోర్కెను అణిచి వేసుకొంది.

ఇదిలా అల్లరిపడి తేల్చుకొనే సమస్య కాదు. తనకొక్కంచెం వ్యవధికావాలి.

"నీదే ఆలస్యమక్కా! నేను రడీ అయిపోయాను....'' నవ్వుతూ తనదగ్గర కొచ్చి అంది అరుణ.

బాత్ రూంలోకి నడిచి మొఖం కడుక్కొని చీర మార్చుకోసాగింది. అరుణ అప్పటికే తయారయి హాల్లో రేడియో ముందు కూర్చుని 'యువవాణి' ప్రోగ్రాం వింటోంది.

వెనుకనుంచి మెల్లగా వచ్చి తటాలున తనను దగ్గరకు లాక్కొన్నారాయన. అదాటున జరగటం మూలాన సుజాత పూర్తిగా అతని కౌగిలిలోకి జారిపోయింది. ఇన్నాళ్లూ మైకం కలిగించిన ఆ కౌగిలి ఆరోజు వెగటు కలిగిస్తోంది. అదివరకు ఆ కౌగిలి సుఖాన్ని కోరుకొనే శరీరం ఇప్పుడు ఎటువంటి అనుభూతినీ పొందటం లేదు.

"సుజీ! నువ్వు మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నావా, అరుణ మనతో ఉండటానికి?" తన కళ్ళల్లోకి చూస్తూ అన్నారాయన.

"సినిమాకి టైమవుతోంది. పదండి!" అంది పొడిగా నవ్వి ఆయన చేతులనుండి తప్పించుకొంటూ.

ముగ్గురూ కార్లో థియేటర్ చేరుకొన్నారు

ఏదో హిందీ సినిమా: ఆయన పక్కనే తను. తన పక్కన అరుణ!

సినిమా మొదలయింది. ఏదో నవ్వుతూ తినతో అంటున్నారాయన. తనకేమీ అర్థం కావటంలేదు. కళ్లు తెరిచి కూర్చుంటే కళ్లు తిరుగుతున్నట్లుంది. అందుచేత ఉండుండి కళ్లు మూసుకోసాగింది కొద్ది క్షణాలపాటు. వళ్ళంతా జ్వరమొచ్చినట్లు వెచ్చబడింది. తల పోటు—తనేమయిపోతోంది. తన గతేమిటి? ఇంతకంటె అవమానం ఇంకేమయినా ఉంటుందా? స్నేహితుల్లో—బంధువుల్లో ఎంత అవమానం? నగుబాటు? ఇంతకంటె ఆత్మహత్య చేసుకు చావడం మంచిది.

ఇంటర్వెల్ అయింది.

కూల్ డ్రింక్స్ అందించారాయన.

నవ్వుతూ ఏదో అంది అరుణ. ఇద్దరూ నవ్వారు.

తనకేమీ తెలియటంలేదు. కళ్ళప్పగించి చూస్తోంది వాళ్లు నవ్వితే తనూ నవ్వుతోంది

సినిమా మళ్ళీ బిగినయింది.

ఏదో కేకలు యుద్ధాలు—భీషణ పోరాటం—అంతా తినతలలోనే జరుగుతున్నట్లు తలనొప్పి—

'జనగణమన' వినబడి లేచినుంచుంది

ఇల్లు చేరుకొన్నారు హోటల్లో భోజనం ముగించి.

"బాగా అలిసినట్లు కనిపిస్తున్నావ్ సుజ్ .." అన్నారాయన.

"అవును. .." అంది తను గొణుగుతున్నట్లు.

చీర కూడా మార్చుకుంటానే అలాగే మంచం మీద వాలిపోయింది. తరువాత ఇంకేమీ తెలియలేదు. తిరిగి మెలకువ వచ్చేసరికి గడియారం ఒంటిగంట కొట్టింది.

పక్కన మంచం ఖాళీగా ఉంది. అరుణ కనిపించలేదు.

లేచి పక్కగదిలోకి నడిచింది సుజాత.

భర్త ప్రక్కనే అయన్ను కరచుకొని ఆద మరిచి నిద్రపోతోంది అరుణ.

వాళ్ళిద్దరినీ అలా చూసినా ఆమె కెటు వంటి భావమూ కలుగలేదు. మనసెంచేతో చాలా ప్రశాంతంగా ఉంది.

ఉదయం అరుణకి మెలకువ వచ్చేసరికి చాలా పొద్దు ఎక్కింది. పైమ ఎనిమిదవు తోంది. సిగ్గుపడి ఛటుక్కున మంచం మీద నుంచి లేచి నుంచుంది

అతను కూడా మేలుకొన్నాడు.

పక్కనే స్టూల్ మీద గాజు గ్లాసుకింద ఎర్రని కాగితం, దానిమీద నల్లని అక్ష రాలు కింద సుజాత అన్న పేరు కనిపించి వయి. ఖంగారుగా ఆ కాగితం తీసుకొని చదవసాగింది అరుణ. అతని కూడా మత్తు వదిలినట్లలేయి చినుంచుని ఆకాగితం లోకి చూశేడు

అరుణా,

నిన్న నువ్వు ఈ కధ చెప్పినప్పుడు ఆ కధ నాకుసంబంధించినది కాదనుకొన్నాను. అందుకే నా మనసుకి మంచి నిపించిన పరిష్కారం చెప్పాను. ఇన్నాళ్లూ కాగితం మీద ఆనేకమంది జీవితాలు జవాబుల రూపంలో చక్కబెట్టాననుకొంటూవచ్చాను కానీ నిన్నటితో నా అభిప్రాయం తప్పని తెలిసొచ్చింది. ఉదాహరణ నేనే. నీ ప్రశ్నకు జవాబు వ్రాస్తున్నప్పుడే నేను ఆ పరిస్థితిలో నేనుంటే ఎలా వుంటుందో అని ఆలోచించ లేదు. 'మరొకరికి సంబంధిం చిన సమస్య' అన్న దృష్టితో ఆలోచిం చాను. పర్యవసానంగా ఓ మతి లేని జవాబు-అతి తెలివి తక్కువనా-ఇచ్చాను తీరా అది నాకే చెందేసరికి ఆచరించటంలో దారుణంగా ఫెయిలయ్యాను. ఈ ఉదయం నాలుగింటివరకూ కూడా ఆలోచిస్తూనే ఉన్నాను. ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవు. పూర్వం రోజుల సంగతేమో గానీ ఈ రోజుల్లో పెరిగిన ఏ ఆడపిల్లా ఏమాత్రం ఆత్మాభిమానం ఉన్నా-ఇలాంటి పరిస్థితికి తల ఒగ్గదు—నిన్ను నాతోపాటు ఉంచడానికి ఓ వేళ నేను వప్పుకోపోతే ఏం జరుగుతుందో నాకు తెలుసు. నువ్వు మీ ఇంటికి వెళ్ళిపోతావ్. మీ తల్లిదండ్రుల దగ్గర మిగతా జీవితం గడిపేస్తావ్. ఆయన అప్పుడప్పుడూ నిన్ను రహస్యంగా కలుసు కొంటాడు. కాని, ఇంట్లో నా జీవితం దుర్భరమైపోతుంది. మా ఇద్దరి మధ్యా ఓ గోడ శాశ్వతంగా ఎదిగి పోతుంది. జీవచ్ఛవంలా బతకాల్సిందే: ఈ పరిస్థితి నా కిష్టంలేదు. మీ ఇద్దరి మధ్యా ఉండ బమూ నా వల్ల కాదు —అందుచేత-అందు కనే మా ఇంటికెళ్ళి పోతున్నాను. మళ్ళీ మిమ్మల్ని చూడకుండానే నా జీవితాన్ని ముగించివేయమని భగవంతుణ్ణి ప్రార్థిస్తు న్నాను. దయచేసి మీ ఇద్దరిలో ఎవ్వరూ నా దగ్గరకురావటానికి ప్రయత్నించవద్దు ఎవరి కయినా సహనానికి ఓ హద్దుంటుంది— నేనా హద్దుకి సరిహద్దుల్లో ఉన్నాను ఎలాగూ మా ఇద్దరి మధ్యా ఇదివరకటి సంబంధం నెలకొనదు. కనీసం మీ ఇద్ద రయినా ఆనందంగా ఉండండి: మరో విషయం - జవాబుల శీర్షిక నుంచి తప్పుకొంటున్నాను నావిషలన ఎవ్వరికీ ఎటువంటి ప్రయోజనమూ లేదని తెలుసు కొన్నాను. ఉత్తరం కూడా రాయకు.

సుజాత.

అరుణ చలనం లేకుండా నిలబడి పోయింది.


ధర్మాసుపత్రి
సత్యం

"బాబూ! నా బిడ్డని రక్షించండి" కాళ్ళమీద పడింది గుండెల విసేలా ఏడుస్తూ నెలరోజుల పచ్చి బాలింత మాలచ్చి. చావు బతుకుల సరిహద్దుల్లో కొట్టుమిట్టాడుతోంది పొత్తిళ్ళలోని నెత్తురు గుడ్డు.

"ఛీ! ఛీ! వెధవగోల. కడుపు చేయించుకునేటప్పుడు లేని ఏడుపు యిప్పుడెందుకు? చస్తే అవతలపారేయ్, మళ్ళీ కడుపు చేయించుకుందుగాని.' విదిలించి కొట్టాడు యింకో నెలరోజుల్లో ఆరోబిడ్డకు తండ్రి కాబోతున్న చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టరు ధర్మారావ్. చింతనిప్పుల్లాంటి డాక్టర్ కళ్ళను చూసి భయంలో ముడుచుకుపోయింది మాలచ్చి.

రాత్రినుంచి మనస్సంతా చీకాగ్గా వుంది డాక్టర్ ధర్మారావుకి. రాత్రి జరిగిన సంఘటనలు కడుపులో దేవుతున్నాయి. మొత్తం నాలుగొందలు లాస్. ఎల్లా మేకప్ చెయ్యాలి? ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోతోంది. పాకెట్ లోంచి వందరూపాయలు కొట్టేసింది ఎలిజబెత్. బ్లడీబిచ్! ఎంత తాగితే మాత్రం తెలియదనుకుందా? దాని రేటు పాతికరూపాయలు. అంటే నాలుగు రాత్రుళ్లు. ఈసారి పోయినప్పుడు దాని అంతు కనుక్కోవాలి ముండ! క్వీన్ ఆఫ్ క్వీన్స్ హాఫ్ బాటిల్ నీట్ కొట్టేసింది.

"సార్! పేషెంట్స్‌ని పిలవమన్నారా?" ముసిముసి నవ్వులు నవ్వుతోంది నర్సు నళిని. పసిగట్టేసినట్టుంది గుడిసేటిముండ. రోజు రోజుకీ ఊరిపోతోందిది. ఎందరితో కులుకుతోందో? దీన్ని పిలిపించుకున్నా పోయేది రాత్రి చౌకలో పోయేది. తెల్లతోలని ఎగబడితే రోగం కుదిర్చింది ఎలిజబెత్.

"సార్!"

"యస్. రమ్మను."

నాలుగేళ్ళపిల్ల. చీమిడి ముక్కు. బాన పొట్ట చూడగానే తెలుస్తోంది లివర్.

బరబరా బరికేశాడు ప్రిస్క్రిప్షన్ స్లిప్ మీద.

"దొరా! బిడ్డని బతికిస్తారా?" వుండబట్టలేక అడిగింది లివర్‌పిల్ల తల్లి.

"ఛీ! బయటకు పో! ముందు" కసురుకుంది రోజురోజుకీ వూరిపోతున్న నర్సమ్మ.

సిగరెట్ మీద సిగరెట్ తగలేస్తున్నాడు ధర్మారావు. తల దిమ్మెక్కిపోతోంది. రాత్రి రమ్మీలో రెండొందలపైగా లాస్. ట్వంటీ ఫార్టీ ఆడుండవల్సింది కాదు. అయిదు జోకర్లు పడ్డప్పుడు డైమండ్ టెన్ డిస్కార్డు చేసుండవల్సింది కాదు ఆ ఒక్క మిస్టేక్ వల్ల ఫుల్ కౌంట్ ఇవ్వడమే కాకుండా

వచ్చే ఓ బ్యాంక్ కూడా పోగొట్టుకున్నాడు. అయినా నాలుగు పెగ్గులకు మించి ఎప్పుడూ తీసుకోగూడదు. సరీ కంట్రోల్ పోతోందీమధ్య తనకు.

ఎదురుగా స్టూల్ మీద ఆరేళ్ళ గజ్జిపిల్ల, ఒళ్ళంతా అట్టగట్టినట్టినట్టుంది, చీము కారుతోంది, గుక్కపట్టేడుస్తోంది.

"నోర్ముయ్!" గట్టిగా కసురుకున్నాడు ధర్మారావు. ఏడుపెక్కువైంది. తిట్టుకుంటూ చేతకొచ్చిన మందులపేర్లేవో రాసి విసిరికొట్టాడు గజ్జిపిల్లని తీసుకొచ్చిన ముసలమ్మమీద.

"రండి రండి, లేటుగా వచ్చారేం?" సాదరంగా ఆహ్వానించాడు అప్పుడే వచ్చిన ఖాదీసిల్కులాల్చీ ఆసామిని. లాల్చీ పెద్దమనిషితో టెర్లిన్షర్టేసుకున్న ఆరేళ్ళ కుర్రాడున్నాడు. చూడ్డానికి దుక్కలా వున్నాడు. కాని పాపం అజీర్తిరోగం పట్టుకుంది యీ లేతవయస్సులోనే. నిన్ననే యింటిదగ్గర ధర్మారావు దర్శనం చేసుకుని 40 రూపాయలు చేతిలోపెట్టి యీ గౌరవాన్ని కొనుక్కున్నాడు ఆ అజీర్తిరోగం అబ్బాయి నాన్న.


"దారిలో కారు కాస్త ట్రబులిచ్చింది' అంటూ కుర్చీలో కూర్చున్నాడు ఫియట్ కారున్న ఆ పెద్దమనిషి, బిక్కమొహాలేసుకుని చూస్తున్నారు క్యూలో గంటసేపట్నుంచి నిలబడున్న డబ్బిచ్చుకోలేని దౌర్భాగ్యులు.

నిన్న యితని ఫియట్ కారుని చూసినప్పట్నుంచీ ఒకటే గొడవ రాజ్యలక్ష్మి తమ డొక్కు హెరాల్డ్ అమ్మేసి ఫియట్ కొనమని. పొట్టి మనిషి కూడా కాదు ఏ చీకూ చింతా లేకుండా వుండాలి. నిండు నెలలతోవున్న యిల్లాలు కోరిన కారుని కొనలేని అసమర్థుడౌతాను. ఫియట్‌లో తిరగాలని తనకు మాత్రం లేదా! కాని అంత డబ్బెక్కడిది? పెద్ద పిల్ల పెళ్ళితోనే బ్యాంక్ బాలెన్సంతా కడిగేసుకూర్చున్నాడు ఎబార్షన్ చేయించుకున్న పిల్లని ఏంగడ చేసేసరికి తల ప్రాణంతోక్కొచ్చింది. మార్కెట్ రేటుకన్న కాస్త ఎక్కువ పెట్టే కొనాల్సొచ్చింది దానికి మొగుణ్ణి. యీ సంవత్సరంలోగా ఎట్లాగైనా ఫియట్ కొనితీరాలి. ఏదోరకంగా డబ్బు కూడబెట్టాలి. కాని రాత్రి నాలుగొందలు లాస్. తలచుకుంటే గుండె గుబేల్ మంటోంది. రేపెట్లాగయినా యీ లాస్ మేకప్ చెయ్యాలి కంట్రోల్‌గా ఆడి సేఫ్ కావాలి. ఎన్ని జోకర్లున్నా ఆడగూడదు.

పదిహేను నిముషాలు ఎంతో శ్రద్ధగా ఎగ్జామిన్ చేసినట్టు నటించిన తర్వాత.

హాస్పిటల్లో ఎడ్మిట్ చెయ్యాలండి అన్నీ నే జూసుకుంటాను."

"సారీ డాక్టర్‌గారూ, ధర్మాసుపత్రి వాతావరణం మా బాబుకి పడదు. కావాలంటే రోజూ హాస్పిటల్‌కి తీసుకొస్తాను."



"సరే మీ యిష్టం, రోజుకి మూడు చొప్పున యీ బిళ్ళలు వాడండి." అంటూ తన డ్రాయరు సొరుగులోని శాంపుల్ మెడిసన్ ఒకటి తీసిచ్చాడు. అవసరమైనవీ, అనవసరమైనవీ ఖద్దమైన టెస్టులన్నీ చేయించమని రాసిచ్చాడు.

ఎదురుగా మూడేళ్ళ పాప. గుమ్మడి కాయంత తలతో. తోటకూర కాడల్లాంటి కాళ్లూ చేతులూ. చాలా వికృతంగా భయంగా వుంది. పాప నెత్తుకున్న తల్లి చాలా నాజూగ్గా అందంగా వుంది. తొలిగినపమిట లోంచి కనబడే ఆమె అందాల పొంగుని రెప్పవెయ్యకుండా చూస్తున్నాడు ధర్మారావు దాన్ని గమనించిన నళిని కొరకొరా చూసింది ఆ నాజూకైన అమ్మాయి అందం వంక.

ఉప్పెనలా వచ్చిపడింది మా లచ్చి. "డాక్టరుబాబూ! సచ్చి నీ కడుపున పడతా, నా తొలిసూలి పంటని కాపాడు దొరా!"

"ఏయ్! బుద్ధి లేదూ నీకు. ఎమిటా దూకుడు? మూడ్రోజులున్నంది ఒకటే పీడ." అవతలకు నెట్టింది నర్సు.

"దొరా! దవ మాసుపత్రిని మూడు కోసులు నడిసొచ్చా పసిగుడ్డుతో."

"నీ తాతగాడి ఆసుపత్రేమీ లేదూ? బెడ్ ఖాళీ లేదని ఎన్నిసార్లు చెప్పాలి? ఫో బయటికి దర్బిస్మెద నువ్వూనూ"

"మంచం కాళి లేకపోతే పంచన పడుంటా, దయతల్సు దొరా:"

"గెటవుట్!" ఫైరయ్యి పోయాడు

మంచి మూడ్ పాడైనందుకు ధర్మారావు.

రెక్కట్టుకుని బయటకు గెంటింది మాలచ్చిని నళిని. కోరచూపులతో పైగజేసి నాజూకమ్మాయి పమిట సర్దుకునేలాజేసింది. డిసప్పాయింటైన ధర్మారావు మండిపడ్డాడు.

"నర్స్. ఏమిటిది చేపలదు కాణంలా? అందర్నీ లోపలి కెందుకు రానిచ్చావ్? ఒక్కొక్క పేషెంటునే పంపించు."

"పేరేమిటి? వయస్సెంత?" చిరునవ్వుతో అడిగాడు ధర్మారావు ఆమె పమిట మళ్లీ జారుతుందేమోనని ఆశగా అటుజూస్తూ. బిత్తరపోయింది బిడ్డ నెత్తుకున్న తల్లి.

"మాటలొచ్చా పాపకు?"

"రావండి. అసలు తెలివి తేటలే లేవు."

"ఆహారం తీసుకుంటుందా?"

"మామూలుగానే తింటుందండి. కాని తల మాత్రమే పెరుగుతోంది."

"రేపు ఎనిమిదింటికి యింటికి తీసుకురా, అక్కడ చూస్తాను. వస్తావా?" చూశాడు.

"వస్తానండి" నీరసపడిపోయింది యింటికి రమ్మన్నమాటకు అర్థం తెల్సిన ఆ యిల్లాలు.

ఒకళ్ళతర్వాత ఒకళ్లు పసిపిల్లలు చిన్న వయస్సులోనే పెద్దరోగాలు, ఏదో ఒకటి చీటీమీద రాసిస్తున్నాడు ధర్మాసుపత్రి డాక్టరు ధర్మారావు. ఈసారి తనకు తప్పని సరిగా మగబిడ్డే పుడతాడు. ఆ ఆశతోనే అయిదుగురు ఆడబిడ్డల తండ్రయికూడా రాజ్యలక్ష్మిని ఆరో కాన్పుకి సిద్ధం చేశాడు. పుట్టబోయే మగబిడ్డకోసం వెట్ పార్టీ అడుగుతున్నారు ఫ్రండ్సందరూ. తప్పేట్టు లేదు. ఓరోజు క్వాలిటీలో ఎరేంజ్ చెయ్యాలి. కనీసం మూడొందలన్నా వాదులుతుంది. రాజ్యలక్ష్మి ఒంట్లో ఎట్లా వుందో? మనిషి నీర్సంగా వుంది. తల్లి బలహీనంగా వుంటే పుట్టేబిడ్డకూడా చు ప్ప లం గా వుంటాడు. పళ్ళరసం తీసుకుందో లేదో?

పుట్టబోయే మగబిడ్డకోసం కలలు గంటున్న డాక్టర్ ధర్మారావుకి పెళ్ళాం పళ్ళరసం విషయం గుర్తుకొచ్చేసరికి వెంటనే యింటికిపోయి చూడాలన్పించింది, చకచకా పదినిముషాల్లో పదిహేనుమంది పేషెంట్స్‌ని చూశాడు.

నర్స్! అర్జంటుగా బయటకెళుతున్నా. ఈ పూట వార్డుకి డాక్టర్ రమేష్‌ని వెళ్ళమని చెప్పు" ఆదరాబాదరా బయలుదేరాడు ధర్మారావు.

బయటకు రాగానే శోకాలెడుతూ ఎదురైంది మాలచ్చి.

"దొరా! నా బిడ్డ గురకెత్తన్నదు. దక్కేట్టులేదు. పేణం పోసి పున్నెం గట్టుకో."

"అడ్డందవప్పుకో, అర్జంటుగా వెళ్లాలి" విసురుగా వెళ్ళి కారు స్టార్టు చేశాడు. టొక్కు హెరాల్డ్ రొదలో మాలచ్చి రోదన కలిసిపోయింది.

చలిజ్వరంతో గడగడ వణికిపోతోంది మాలచ్చి మూడ్రోజుల్నుంచి పడిగాపులు కాస్తోంది గడ్డకట్టించే చలిలో. ప్రాణాపాయంలో వున్న తన పసిగుడ్డుని హాస్పిటల్ లో జేర్పించుదామని పట్నం వచ్చింది. ఖాళీలేదని కసిరిగొడుతున్నాడు ధర్మాసుపత్రి డాక్టరు ధర్మారావు. మా సూళ్ళ తరుణం కావడం మూలాన మాలచ్చి మొగుడు వెంకడ్ని వూరుకదలడానికి వీల్లేదన్నాడు భూకామందు. మొండికేసి ఒంటరిగా వచ్చింది మాలచ్చి. ఆసుపత్రిలో బెడ్ కోసం ఆమెమాదిరిగానే చెట్లకింద పడుంటున్న దౌర్భాగ్యుల్లోని ధర్మాత్ములెవ్వరో యింత ముద్దపడేస్తున్నారు యీ మూడ్రోజుల్నుంచి.

మర్నాడు మామూలుగా హాస్పిటల్ కి వచ్చిన డాక్టర్ ధర్మారావుకి కనబడ్డ దృశ్యం యిది. హాస్పిటల్ ఎదురుగా మాంసపుముద్దలు కొంచెం యివతలగా చెట్టుకింద బిగుసుకుపోయిన మాలచ్చి శవం.

ఎవ్వరో అనుకుంటున్నారు పసిగుడ్డుని కుక్క పీల్చుకుతిందని.

ధర్మాసుపత్రిముందలి యీ భీభత్స దృశ్యాన్ని చూసి రాతిగుండెగల ధర్మారావు కూడా వణికిపోయాడు.

సంక్షేమ ప్రకటనలు

షాపు మూసివేయడమైనది!
(విపరీతమైన ధరలకు సామానులమ్మే షాపు ముందు)

పురజనుల కోరికపై రేపటినుంచి కొత్త చిత్రం!
(తలనొప్పి పుట్టించే చిత్రాన్ని ప్రదర్శించే థియేటర్ ముందు)

ఈ సంచికనుండీ సినిమా రివ్యూలు లేవు!
(సినిమా రివ్యూలను ఒకే మూసలో పోసి పాఠకుల కందిస్తున్న పత్రికలో ప్రకటన)

ఆఫీసరుగారు బదిలీ చెయ్యబడ్డారు!
(చండశాసనుడైన ఆఫీసరుగల ఆఫీసు నోటీసు బోర్డులో)


నేనీ రోజునుంచీ వంట చెయ్యను!
(ఎంతసేపూ, పశువులూ కూడా తిన వీలులేని వంటజేసే ఇల్లాలు భర్తపై అలిగి చేసిన ప్రకటన)

నేను చదువు మానేస్తాను!
(పి. యు. సీ. నాలుగు సార్లు తప్పి ఏటేటా రెండు వేలు తగలేస్తున్న కొడుకు తండ్రితో)

నీకు విడాకు లిచ్చేస్తాను జాగ్రత్త!
(రోజూ కొట్టి హింసించే భర్త భార్యతో

మీకు ఆపరేషన్ చెయ్యాలి! అయితే మీకిక పిల్లలు కలగరు!
(పదిమంది పిల్లల్నిగన్నా కుటుంబ నియంత్రణం ఇష్టంలేని స్త్రీకి కడుపులో నొప్పికి ఆపరేషన్ చేయవలసిన డాక్టరు)

ప్రకటించిన వారు: 'భవాని'



గణేష్ పాత్రో

19

(గతసంచిక తరువాయి)

హనీ మూన్ నుండి తిరిగొచ్చారు శ్యామలరావు, సరోజిని: రంగారావు గారికి బాగా తెలిసిన ఒక పెద్ద లాయరు శ్యామలరావుని జూనియరుగా చేర్చుకోవ డానికి అంగీకరించినట్టు ఉత్తరం వచ్చింది హైదరాబాదునుండి.

మరో వారం రోజుల్లో ప్రయాణం కావ డానికి ఏర్పాటయింది.

"సరోజినీ! మన మొకమారు మీ ఊరు వెళ్ళి తిరిగొద్దామా?" శ్యామలరావు అడి గాడు, సామాను సర్దుతూన్న సరోజినితో

"ఎందుకు? అక్కర్లేదు."

"చాలా దూరం వెళుతున్నాంగదా! ఇంత త్వరగా రాలేమేమో....మీ వాళ్ళని చూడాలనిపించడం లేదూ? నాకే అనిపి స్తుంది గదా మీ బాబీగాడ్ని మరోమారు చూడాలని?" నవ్వుతూ అడిగాడు శ్యామల రావు.

"మనం బయల్దేరే ముందు వాళ్ళే ఒస్తున్నట్టు రాశారుగదా?"

"ఔనేను, రాశారు మర్చేపోయాను."

ఆ మర్చిపోవడం కావాలనే మర్చి

సీరియల్

పోయాడు శ్యామలరావు. ఏవో విధంగా సరోజిని మాటాడించాలనీ, మామూలుగా వుంచాలనీ తాపత్రయపడుతున్నాడు. తనకి తెలుసును. సరోజిని సంతోషంగాలేదని: తనతో పెళ్ళి కావడం సరోజినికి ఇష్టం లేదని కూడా తెలుసును. గానీ ఈ పరిస్థితిలో సరోజిని ఏం చెయ్యగలదు? గనక! తనంతట తానుగా శ్యామలరావుతో సరోజిని ఏమీ చెప్పకపోయినా, పెద్ద వాళ్ళే చెప్పారుగదా మేనరికం సంబంధం బెడిసిందని? బావకి మనసిచ్చింది పాపం! కానీ ఆ బావ దగాచేసి పోయాడు. ఇప్పుడు భర్తతో సర్దుకోవడమే తెలివైన పనీ ఆ తెలివి భార్యకి లేనప్పుడు తనే నేర్పించ మూనుకున్నాడు శ్యామలరావు.

"అదుగో, అది మా అమ్మ ఫొటో!" గోడమీద ఫొటో చూపించాడు.

"అది కూడా మనం హైదరాబాదు తీసుకు పోవాలి. కిందికి దింపించు."

"అలాగే!" అంది ఫొటో చూస్తూ.

"మా అమ్మ చాలా అందంగా వుంది గదూ?"

"ఔను."

"చూడు, ఎంత చక్కగా చిరునవ్వు నవ్వుతోందో! పలకరించబోతున్నట్టు కనిపిస్తుంది. గానీ మా అమ్మ మూగది!"

సరోజిని ఆశ్చర్యపోయింది.

తల్లి గాథను సవిస్తరంగా సరోజినికి చెప్పాడు శ్యామలరావు.

"అందుకే నిన్నూ ఏరికోరి చేసుకున్నాను సరోజినీ! మా అమ్మకు పట్టిన దుర్గతి నుండి ఒకరినైనా కాపాడ గలిగితే చాలు. అమ్మ మనసు శాంతిస్తుంది. అమ్మ అలాగే నవ్వుతూ ఆశీర్వదిస్తుంది మనల్ని!" తల్లి ఫొటో వంకే చూస్తూ తన్మయంగా అన్నాడు శ్యామలరావు. సరోజిని కళ్ళనిండా నీళ్లు నిండుకున్నాయి.

తన భర్త చాలా గొప్పవాడు!

చాలా మంచి వాడు!

మోహన్ బావలాంటి పిరికివాడు కాడు! అసమర్థుడు కాడు!" సరోజిని శ్యామలరావు వంక రెప్పార్పకుండా చూడసాగింది.

"సరోజినీ! నువ్వు అచ్చం మా అమ్మలాగా నవ్వుతావు!" వెనక్కి తిరిగి సరోజినితో అన్నాడు. సరోజిని ఆ మాటకు నవ్వింది.

"అదుగో...." అన్నాడు.

సిగ్గుపడింది సరోజిని.

శ్యామలరావు సరోజినిని సమీపించాడు.

తనని గుండెల మీదకు తీసుకుంటుంటే రెండోమారు వారింపలేక పోయింది సరోజిని. అలవాటైన బావగుండెల స్పర్శ స్మృతిపథంలో మెదులుతూంటే అలాగే గుండె మీద వాలి కన్నీరు కార్చింది.

"ఏడుస్తున్నట్టున్నావే?" కలతపడి అడిగాడు శ్యామలరావు.

"కాదు" అబద్ధం చెప్పింది సరోజిని.

"కాదాదు" సరోజిని మొగం చేతు

జరిగిన కధ

శ్యామలరావు, కృష్ణమోహన్ స్నేహితులు. మానసికంగా బాధపడే అమ్మాయిని మాత్రమే పెళ్ళిచేసుకోవాలని శ్యామలరావు ఆశయం. కృష్ణమోహన్ ప్రేమించిన సరోజకు ఫిట్స్ జబ్బు ఉండడంతో వారి పెళ్ళికి అతని తల్లి ఒప్పుకోదు. శ్యామలరావుకు చౌదరాణి విచిత్రంగా పరిచయమయింది. ఆత్మహత్యకు సిద్ధపడిన చౌదరాణిని ఆ ప్రయత్నంనుంచి విరమించేలా చేశాడు. చిన్న వయసులోనే విధవైన తన చెల్లెల్ని చేసుకోమన్న స్నేహితుడు సాహూ కోరికను నిరాకరిస్తాడు శ్యామలరావు. ఫిట్సు జబ్బు ఉన్న సరోజను చేసుకో నిశ్చయించుకుంటాడు.

కృష్ణమోహన్‌ను తన రాజకీయ చదరంగంలో ఒక పావుగా ఉపయోగించుకున్నాడు అతని బాబాయి విశ్వనాధం. విశ్వనాధం తన ప్రత్యర్ధితో లాలూచీఅవుతాడు. ఈ విషయం చెప్పి ఇరువర్గాల విద్యార్ధుల మధ్య పెరిగిన వైషమ్యాలు రూపుమాపడానికి బయలుదేరతారు మోహన్, గఫూర్‌లు. శ్యామలరావు సరోజను చేసుకొంటున్నానని రాసిన ఉత్తరం చూసి నిశ్చేష్టుడయ్యాడు మోహన్. మోహన్, గఫూర్‌లను పోలీసులు అరెస్టుచేశారు.

ల్లోకి తీసుకుని అందంగా నవ్వాడు. సరోజిని కూడా నవ్వింది. తన భర్త! ఒక ఆదర్శానికి పట్టుబడిన పురుషుడు: తన జాతి స్త్రీల పైన తగని సానుభూతితో జీవితం పణం పెట్టిన ఒక నిజమైన మంచి మనిషి.

తను ఈరకంగా చాలా అదృష్టవంతురాలు!

"బాబూ! మీకోసం ఎవరో వచ్చారు!" పనివాడి కేకవిని, సరోజినిని వదిలి శ్యామలరావు వెళ్లాడు. అటు అతను వెళ్ళగానే సరోజినికి దుఃఖం వచ్చింది.

ఏమైపోతోంది తను?

శ్యామలరావు మంచితనంలో కొట్టుకుపోతోంది!

గానీ అతని మంచితనానికే అపకారం చేస్తోంది.

ఇంత మంచి మనిషికి తాను తగినదేనా? కాదు! దేవుడు మంచివాళ్ళకి కూడా అన్యాయం చేస్తాడు: శ్రీరాముడులాంటి శ్యామలరావుకి సీతలాంటి భార్య నివ్వవలసింది దేవుడు! గానీ తనని కట్టబెట్టాడు: అనుక్షణం గుండెలో పాతగాయాన్ని ప్రయత్నపూర్వకంగా రేపుకుంటూ, అనుభవిస్తున్న సుఖాలపట్ల కృతజ్ఞతలేకుండా–

మానసిక వ్యభిచారం చేస్తున్న పాతకినిచ్చి పాపం పోసుకున్నాడు దేవుడు.

తను మారగలదా?

బావను మరవగలదా

ఇది చేతగాకపోతే చావడమే నయం గానీ తన భర్తకి అన్యాయం చెయ్యడం మాత్రం మహా పాపం!

ఆలోచించుకుంటూ పని చేస్తూన్న సరోజనికి—అనుకోకుండా పాత ఆల్బమ్‌లో ఒక ఫొటో కనిపించింది. కృష్ణమోహన్, శ్యామలరావు కలిసి తీయించుకున్న ఫొటో! అవాక్కయిగా ఆ ఫొటో చూస్తుండి పోయింది. ఇద్దరూ స్నేహితులా?

"అన్నదమ్ముల్లాగా వున్నాం కదూ?" వెనకనుండి శ్యామలరావు అడిగాడు.

సరోజని ఉలికిపడింది.

"వాడు నా స్నేహితుడు కృష్ణ మోహన్!"

"ఔను. ఇతనే మా బావ!" తనకు తెలియకుండానే అంది సరోజని.

"ఏంవిటీ?" పిడుగుపడ్డట్టు అరిచాడు శ్యామలరావు.

సరోజని అటు చూస్తూ మాటాడకుండా నిల్చుంది.

"ఏంవిటి సరోజనీ, ఇతనా మీ బావ? అంటే నిన్ను దగాచేసి... ఎటో పారి పోయి." వాక్యం పూర్తిచెయ్యలేక పోయాడు.

"ఔను అతనే! నా జబ్బుని చూచి జడిచి పారిపోయిన బావ...."

"సరోజనీ..." మధ్యలో ఆపాడు సందిగ్ధంగా. "అదేంవిటి, నేను నమ్మలేను సరోజనీ! అలా కాకూడదు! మోహన్ అలాంటివాడు కాడు. నీకు తెలీదు." మాటలకోసం వెతుక్కున్నాడు. మనసులో కంగారు అలుముకుంది. ఐతే తను చాలా ఆదర్శంగా వివాహం చేసుకున్నది తన స్నేహితుడి ప్రియురాలినా? మోహన్ ఎన్నో ఆశలు నిర్మించుకున్న సరోజనిని తాను కట్టుకున్నాడు. ఘోరం జరిగి పోయింది.

"మన పెళ్ళి ముందు నాకు మోహన్ ఉత్తరం రాశాడు అందులో నీ గూర్చి కూడా వుంది సరోజినీ, నువ్వని నాకు అప్పటికి తెలీదు. ఏదో ఎలక్షన్ల గొడవల్లో వున్నట్టు-అవి పూర్తి కాగానే నిన్ను చేసుకోబోతున్నట్టు మీ పెళ్ళికి ముహూర్తాలు కూడా పెద్ద వాళ్ళు చూస్తున్నట్టు రాశాడు. ఉత్తరం చూడు." హడావుడిగా షెల్ఫులో పుస్తకాల గుట్టలు తిరగేసి, కాగితాలు వెదికి, ఒక ఉత్తరాన్ని బయటికి తీసాడు.

సరోజని ఆశ్చర్యపోయి చూస్తుంది.

ఉత్తరం మరొకమారు తనే చదువుకుని, "ఇదుగో చూడు" అంటూ సరోజనికి ఉత్తరం అందించాడు.

"మా కాబోయే శ్రీమతిగారి కారణంగా

నా పెళ్ళి వాయిదాపడింది ఆవిడ ఆరోగ్యం బాగాలేదు. ఐనా త్వరలోనే జరిగిపోవడం మాత్రం ఖాయం. అసహాయ స్థితిలో నీరసంగా వున్న ఆమెను విడిచి, అవసరంగా నేను మా బాబాయి ఎన్నికల్లో సాయం కోసం ఇక్కడికి రాక తప్పలేదు. ఎలక్షన్లు పూర్తికాగానే ఎగిరిపోయి వెళ్ళిపోతాను మా వూరు. ఈలోగా నువ్వు నీ కుంటిదో, గుడ్డిదో, సడ్డిదో—ఎవర్తో మరి, సిద్ధం చేసుకుని పెళ్ళికి రడీగా వుండు!"

సరోజని కేం అర్థం కావడంలేదు ఉత్తరం!

ఏమిటీ ఉత్తరం?

అంతా దగా—మోసం, ఏదో మోసం జరిగిపోయింది.

మావయ్య స్వయంగా బావని పనిమీద పంపారట. పని పూర్తికాగానే తిరిగొచ్చి తనని చేసుకోబోతున్నాడట? మరి వూరొదిలి పారిపోయాడని గదా మావయ్య కూడా తనతో చెప్పారు?


ఎవరిది మోసం?

"సరోజినీ! అది నీ గూర్చే కదూ?"

అవును తన గూర్చే!!

బావకి మరొక ప్రియురాలుందా? అతను వూరొదిలి వెళ్ళబోయేసరికి నీరసంగా పడి ఉన్న ప్రియురాలు తనే!

"అంటే, మీ అత్తయ్య కామాక్షిగారు మోహన్‌కి తల్లి కదూ? ఆవిడ కూడా చెప్పారే, ఎటు వెళ్ళాడో తెలీదని!"



ఆవిడే ఈ పన్నాగం పన్నింది,

అబద్ధం చెప్పింది.

అందరిచేతా చెప్పించింది.

"పోనీ అలా మోసం చేసేవాడే అనుకుంటే ఈసరికైనా అంతా జరిగిపోయింది గదా అని నాకొక ఉత్తరంముక్క రాసి వుండేవాడు సరోజనీ! మోసం యెలా వున్నా, మా స్నేహం విషయం నీకు తెలియదు. తప్పక రాస్తాడు. గానీ ఇప్పటికీ వాడిజాడ తెలిసిరావడంలేదు. ఎక్కడున్నాడో? ఏమైపోయాడో...." శ్యామలరావు కంఠంలో కంగారు తొణికింది.

"సరోజనీ!...." కంగారుగా కిందకు వంగి సరోజనిని పట్టుకున్నాడు. ఉధృతంగా ఏడ్పువచ్చి నేలకొరిగిపోతుంది సరోజని.

౨౦

మోహన్ బ్రతుకులో చిరునవ్వు కరువైపోయింది. సందడిగా, బ్రతుకొక ఆటలాగా తీసుకొనేవాడికి, ఇప్పుడు బ్రతు

కొక గుదిబండలాగా మారింది. ఇంట్లో ఒక చక్కటి చిక్కటి చీకటిగదినెంచుకుని ఒక్కడే కూర్చుని గంటలు గడపడం ప్రారంభించాడు. ప్రతినిమిషం బరువుగా తన శరీరంలో అణువణువునూ, రాచుకుంటూ ప్రయాణం చేస్తున్నట్టుంది. ఒంటరివాడై పోయాడు.

రోజల్లా పుస్తకాలు చదువుతాడు.

ఊపిరితో సిగరెట్లు పీలుస్తాడు.

"మర్చిపో బ్రదర్!" అన్నాడుసుబ్బారావు- అప్పుడప్పుడు మోహన్‌ని పలకరించే వాళ్లలో సుబ్బారావొకడు.

"నేను మర్చిపోను. నాకు మర్చిపోవడం ఇష్టంలేదు. ఒంటిమీది గాయాన్ని మర్చిపోతే! గాయంమీద గాయం తగలొచ్చును బ్రదర్! నేను సరోజినిని మర్చిపోతే- నిమిషాలమీద నాకు పెళ్లిచేయాలని చూస్తున్నారు మా వాళ్ళు! లాభం లేదు. అది జరగకూడదు."

"సర్లేవోయ్ హీరో కబుర్లు! క్షమించు కష్టంలో ఉన్నవాడిని ఓదార్చవలసిన తీరు ఇది కాదేమోగానీ, మోహన్- నీ లాగ కబుర్లు చెప్పిన దేవదాసులు, చూస్తుండగానే కృష్ణపరమాత్మలై పోయారు మరి. కొంచెం కొత్తలో తట్టుకోవడం కష్టమే! కాదననుగానీ ఇంక బ్రతుకంతా సరోజనే అనుకుని దేవురిస్తే నిన్ను నువ్వు నష్టపోతావు. సరోజనితో ప్రణయానికి తప్ప మరి దమ్మిడీకి పనికి రావెంటావా నీ జీవితం? నా తోరా! అంతకంటే మంచిపన్లు చెయ్యవలసినవి చూపిస్తాను. ఒక్కమారు బైటకి రా!"

"సుబ్బారావ్! ఒక్కొక్క జీవితానికి, ఒక్కొక్క దశలో, ఒక లక్ష్యం ఏర్పరచుకుంటాం. ఆ లక్ష్యానికే కట్టుబడడం. అదొక పద్ధతి. ప్రశ్నించడానికి వీల్లేని పద్ధతి." స్థిరంగా మోహన్ చెప్పాడు. సుబ్బారావు పకపక నవ్వాడు.

"బుద్ధిలేని పద్ధతులు పెట్టేసుకుని వాటికే వేళ్ళాడడం బుర్రలేని వెధవలు చేస్తారు. మిస్టర్ మోహన్! ప్రపంచంలో చాలా అసంఖ్యాకంగా సమస్యలున్నాయి. ప్రేమ ఒక్కటే కాదు! అసలది సమస్యే కాదు. ఏదో కొత్త నీరు కొట్టుకొస్తోంది లోకంలోకి! కలతబారిపోయింది ప్రవాహం! గొంతు తడుపుకోవడానికి గుక్కెడు మంచి నీళ్లు లేవు. అన్నీ బురద బురదగా వున్నాయి. ఒక్క మన దేశంలోనే కాదు ప్రపంచమంతా ఒక అనిశ్చితమైన వాతావరణం అలుముకుంది. నువ్వూ, నేనూ, మనలాంటి అనేకులు పూనుకొని ఈ అశాంతికి కీలకాలెక్కడో కనిపెట్టాలి. ఏం జరిగిపోతోంది లోకానికి? ఎక్కడికి పోతున్నాం మనం? ఎటో కదులుతూన్న మాట నిజమేగానీ వెనక్కా ముందుకా? కనుగోవాలి అందుకు యువతరమే పూనుకోవాలి. ఎందుకంటే అసలు ఈ అశాంతి ఎక్కువగా ఈ యువతరంనుండే బయల్దేరుతోంది గనక."

సుబ్బారావు చెప్పింది నిజమే! ప్రత్యక్షంగా క్రిందటి ఎన్నికల్లో కృష్ణమోహన్ చూశాడు. అనిమిత్తంగా యువతరం ప్రతి అలజడిలోకి చొచ్చుకురావడంలో నిజమైన కారణం కనిపెట్టడం అవసరమే!

ఎన్నికలు గుర్తు రాగానే సరోజని గుర్తుకొచ్చింది ఎన్నికలొక పెద్ద ఫార్సు. మొన్న జరిగిన ఎన్నికలు తన బ్రతుకునే ఫార్స్ చేశాయ్. ఎన్నికలు నెపంపెట్టారు. వూరువిడిచి పొమ్మని పురమాయించారు. ఎన్నికలపైన కుతూహలం తనను జీవితం నుండి వంచించింది.

"ఏం చెయ్యమంటావు నన్ను?"

ఎట్టకేలకు మోహన్ వేసిన ఆ ప్రశ్నతో అంతా జరిగిపోయినట్టే సంబరపడ్డాడు సుబ్బారావు. "నేనుత్తి గాలిమేడలు గాడ్ని బ్రదర్. నాకు కొన్ని పెద్ద పెద్ద ఆలోచనలున్నాయి. ప్రోగ్రామ్సు ఉన్నాయి. అవన్నీ అమలుజరిపే ప్రాక్టికల్ పీపుల్ దొరికితే మన వూర్లో ఒక చిన్న 'శాంతి సమితి' నెలకొంటుంది. చూడు, ఎవరిల్లు వారు చక్కబెట్టుకోవడం ప్రారంభిస్తే ప్రపంచమంతా అదే చక్కబడుతుంది. ఏమంటావు? ముందు మనం మనూరు మీద పడదాం. బయల్దేరు" అన్నాడు లేచి నిలబడుతూ.

"రేపొస్తాను."

"రేపు మన డిక్షనరీలో వుండగూడదు ఇంకుపోసి చెరిపెయ్యాలి. లెక్కప్రకారం రేపు అష్టగ్రహకూటమికూడా! లాభం లేదు. బయల్దేరు"

ప్రేరణ కలిగితే జడపదార్థంలో కూడా జీవం నిండుకుంటుంది. లేచి నిల్చుంటున్న కృష్ణమోహన్ మొగం మీద చిరునవ్వు కూడా నిండుకుంది. పదినిమిషాల్లో ఇద్దరూ మేడదిగి హాల్లోకొచ్చారు

"ఎక్కడికి మోహన్? ఇంకా కాఫీలు తేవాలనుకుంటున్నాను" బైటికెళ్తున్న మోహన్ని కామాక్షి అడిగింది.

సుబ్బారావు జవాబుచెప్పాడు. "అక్కర్లేదమ్మా, మేం బైటికిపోయి కాఫీలు తాగుతాం. మీకు తెలియదుగాని అడపా దడపా హోటల్లో కాఫీ పుచ్చుకునేవాడికి ఇంటి కాఫీకంటే ఇష్టంగా వుంటుంది

※ ఇద్దరు స్నేహితురాళ్లు కలిసి ఒకానొక ఆర్టు ఎగ్జిబిషన్‌కి వెళ్ళారు అక్కడ వున్న ఒక పైంటింగ్‌ను చూసి వాళ్ళల్లో ఒక అమ్మాయి, తన స్నేహితురాలిని చూస్తూ, "మైగాడ్! ఆ న్యూడ్ ఫోటో అచ్చం నీలాగే వుంది, కొంపదీసి నువ్వు మోడల్‌గా కూర్చోలేదు కదా?" అని ప్రశ్నించింది.

దాంతో రెండో అమ్మాయి బుగ్గలమీద సిగ్గుమొగ్గలై వికసించింది. "పోవే నువ్వు మరీనూ బహుశా ఆ ఆర్టిస్టుకి జ్ఞాపకశక్తి బాగా వున్నట్టుంది. అంతే!" అంది.

కోటలు కాఫీ. ఏదైనా అంతేలెండి.” చొరవగా నవ్వి మోహన్‌ని తోసుకుంటూ బైటికి వెళ్ళాడు.

“అదేంవిటండీ, సుబ్బారావుతో వెళ్లు తున్నాడు మోహన్!” బుగ్గమీద వేలేసుకుని చూస్తూ మొగుణ్ణి ప్రశ్నించింది కామాక్షి.

రాజశేఖరం పేపర్లో వున్నాడు. ‘ఔను సుబ్బారావుతో వెళ్లుతున్నాడు మోహను!’

“ఊర్లోవి పేచీలన్నీ వాడివేనండీ! ఏదో ఇంటికొచ్చి కబుర్లు చెపుతున్నాడు. మోహనుకి ఊసుపోతుందని ఊరుకున్నాగానీ, ఇలా ఊర్లోకి తీసుకుపోతాడని తెలిస్తే అసలు పిల్లాడు ఇంట్లో లేడని చెప్పేసుండేదాన్ని” సుబ్బారావంటె ఆవిడకంత భయం.

“నీ పిల్లాడ్ని బూచాడెవడూ ఎత్తుకుపోవడం లేదులేవే. ఎదో పోనీ వెళ్ళని. ఎంతకని ఇంట్లో గోళ్లు గిల్లుతూ కూర్చుంటాడు? చూడు. పిల్లల్ని మరీ బొత్తిగా మనం కొంగులకి వేళ్ళాడగట్టుకుంటామంటే వీలుపడే రోజులుకావు. ఎక్కడ జాగ్రత్తపడాలో అక్కడ మాత్రమే పడి మిగతాచోట్ల స్వతంత్రమిస్తేగానీ మన మర్యాద దక్కనీయరు. పోయి ఆ కాఫీయేదో వాడిస్తానన్నది కాస్త నాకు తగలెయ్యి. వెళ్ళు” రాజశేఖరం పురమాయించాడు.

ఆవిడ మనసులోనే మూతి మూడు వంకర్లు తిప్పి కాఫీ తేవడానికి లోపలికెళ్లింది.

“అమ్మా! ఆ చేత్తోనే నాకూ ఒక కప్పు కాఫీ” గుమ్మంలోనుండే కేకవేస్తూ లోపలికొచ్చాడు పార్వతీశం. వెళుతున్న కామాక్షి ఆగిపోయింది. రాజశేఖరం మరోమారు పేపర్లోనుండి బైటికొచ్చాడు.

“ఓహో! పార్వతీశంబావా! రా! రా!!” కళ్ళద్దాలు తీసి బల్లమీద పెడుతూ పలకరించాడు.

“ఇదేనా రావడం?” చిరునవ్వుతోఅడిగింది కామాక్షి.

“ఔనమ్మా! ఇదే రావడం. ఇక్కడికే రావడంకూడా!” రాజశేఖరానికి ఎదురుగా కుర్చీలో కూర్చుంటూ ఉస్సురని కండువాతో మొహం తుడుచుకున్నాడు. కామాక్షి కాఫీ తెస్తానంటూ లోపలికి వెళ్ళింది. పార్వతీశం మంచి ఎత్తరి. ఎర్రగా! ఎత్తునుదుటిమీద మూడు ముడుతలతో, ఎప్పుడూ ముడిబడినట్టున్న కనుబొమలు గొడుగుల్లా నిక్కబొడిచి, చక్రాల్లాంటి కళ్ళతో చాలా గొప్పగా కనిపిస్తారు. చూడగానే అతనొక గంభీరమూర్తిలాగ సాక్షాత్కరిస్తాడుగానీ– అంతటోలా మనిషి మరొకడుండడు.

“ఏంవిటి విశేషాలు బావగారూ?” రాజశేఖరం అడిగాడు.

“అంటే విశేషాలు లేకుండా మీయింటికి రాకూడదంటారు. మహాత్ములు

గదండీ....” చేతులెత్తి దండంపెట్టాడు పార్వతీశం.

“అమ్మమ్మ! అలా దండంపెట్టేయ కండి! మహాత్ములు మీరుగానీ ఊరక రారు మహాత్ములు!....”

“ఔను ఊరకరారు. చాలా పెద్ద పని మీదనే వచ్చానుగానీ ముందు గౌర వాలూ. మర్యాదలూ కానీయండి. ఆ తరు వాత వ్యవహారంలో పడదాం. ఏఁవం టారు?”

రాజశేఖరం ఫక్కుమని నవ్వారు అతని చనువుకి. అంత చనువు అతని కెవరూ ఇవ్వరు. ఇవ్వడానికి ఎవరికీఇష్టం వుండదు. పార్వతీశం నవ్వుతూ మాటా డతాడేగాని చాలా ప్రమాదకరమైనవ్యక్తి. ఎదుటివాళ్ళను సులువుగా పట్టి కొట్టి బుట్టలో పడేసుకుని స్వేచ్ఛగా వాడుకుం టాడు. అతను వాడుకోవడం ముగిసిం దాకా మనకి తెలియనే తెలియదు, వాడు కొంటూన్నట్టు. చేతులు దులుపుకొని అతని తోవన తను వెళ్ళిపోతున్నప్పుడు తెలుస్తుంది, మనం ఖర్చయిపోయామని. “అయ్యబాబోయ్! ఇతనికి చనువియ్య కూడదు మరెప్పుడూ” అని ఒట్టు పెట్టు కుంటాం. గానీ అతనొస్తాడు. నిన్ను చూస్తాడు. నవ్వుతాడు, కన్నుకొడతాడు. అంతే! నువ్వు పడిపోయావ్, నీ చేతులు వెనక్కి విరిచి కట్టేస్తాడు. అతనితోనే, అతని పక్కజేబులో పెట్టుకొని, ఒకపెద్ద చిర్నవ్వు ప్లేటు పట్టుకొస్తాడు. అది తీసి జాగ్రత్తగా నీ నోటికి అతికించేస్తాడు. నీ జేబులో రెండు చేతులూ పెట్టి, ధారాళంగా చనువు తీసేసుకుంటాడు. నువ్వియ్య క్కరలేదు.

“ఇంటిదగ్గరంతా కులాసా యేనా?” రాజశేఖరంఁవడిగాడు.

“ఎవరు? మీ చెల్లెలు సంగతేగా అడుగుతున్నారు? దానికీ, మీకూరమ్మన్నా వస్తుందటండీ రోగం? మీవేమైనా సామా న్యమైన శరీరాలటండీ బావగారూ? అసు రాధముల్నీ, రాక్షసగణాల్నీ సృష్టించిన చేతులు తుడుచుకోవడం మరచిపోయి, మీ దేహాలుకూడా అదే ధ్యాసతో తయారు చేశాడండీ బ్రహ్మదేవుడు. ఏవమ్మా!”

కాఫీలు పట్టుకుని లోపలి కొస్తున్న కామాక్షిని సాక్ష్యం అడిగాడు. కామాక్షీ నవ్వుతూ కాఫీలు అందించింది.

“ఒదిన్ని తీసుకురాలేక పోయా వన్నయ్యా?” అడిగింది.

“అదుగో. నువ్వు కూడా దాని ప్రస్తా వనేనా? అమ్మడూ! మీ వొదిన్ని ఇక్క డికి తీసుకు రావడఁవంటే మాటలా? అవేవో రాకెట్లు చూడూ? ఆ రాకెట్ల మీద లిఫ్టు చెయ్యాలి ఆ మహాకాయాన్ని! బలిసి పోతోందమ్మా! అడ్డగ, తెగబలసిపోతోంది అది సరే. మరి నువ్వేఁవమ్మా చిక్కి పోతున్నావు?” పార్వతీశం ప్రశ్నించాడు.

రాజశేఖరం మరోమారు నవ్వుకుంటా

వుండలేక పోయాడు. కళ్ళనిండా కనిపించే కామాక్షి దేహం చూస్తూ, చిక్కిపోయావని అడిగితే ఏఁవనుకోవాలి? గానీ మరి పాపం కామాక్షి మాత్రం నిజంగానే జవాబు చెప్పింది.

"ఇదిగో ఈ మధ్యనంతా సరోజిని పెళ్ళి, ఆ సందడిలో కొంత కాగా—మరి నాకు కీళ్ళ నొప్పులు ఎప్పుడు ఉన్నవే కదన్నయ్యా?"

జవాబు విని మరింత నవ్వాడు రాజశేఖరం.

కాసేపు కుశల ప్రశ్నలతో గడిచిన తర్వాత నిమ్మళంగా అసలు ప్రశ్నలు ప్రారంభించాడు పార్వతీశం.

"మరైతే మోహన్ పెళ్ళి మాటేఁటివి!" అని'

ఆ ప్రశ్నకు ఇద్దరూ జవాబు చెప్పలేక పోయారు. హఠాత్తుగా వాళ్ళకి ఎదురైన ప్రశ్న! ఆ ఆలోచనే ఈ మధ్య వాళ్ళ మనసుల్లో లేదు. గానీ అవును మరి, మోహన్‌కి పెళ్ళి కావాలి గదా?

"అదేమీ అనుకోవడం లేదు."అన్నాడు సాలోచనగా రాజశేఖరం.

"అది తెలుస్తూనే వుంది బావగారూ! గానీ ఎంత కాలం ఇలా అనుకోకుండా వుంటారు? అనుకున్న సంబంధం అదేదో ఖర్మ కొద్దీ తప్పిపోయింది. కుర్రాడు బాధ పడుతున్నాడు కదా?ఒకమారు నొప్పించాం. గానీ మళ్లీ మళ్లీ నొప్పించే పరిస్థితి రాకూడదు." హితవు బోధించడంలోనే అతని హితవు కూడా వుంది మరి!

"వాడిప్పుడు పెళ్ళి పేరెత్తితే వూరుకోడన్నయ్యా! చాలా బాధ పడుతున్నాడు. కొన్నాళ్లు మరవనీ...చూదాొచ్చు." అంది కామాక్షి.

"ఎలా మరుస్తాడమ్మా? తెలివి తక్కువగా మాటాడకు మరి! చిన్న దానివి నీకు తెలీదు, నన్నడుగు మరవాలంటే, మరిపించేది ఒకటి కావాలంటావా? మీ దగ్గిర నా కున్న చనువుకొద్దీ నేనొక మాటంటాను. బహుశా ఏ ఆడపిల్ల తండ్రీ ఇంత ఉదారంగానూ, ఇంత ధైర్యంగానూ ఈ మాట అనడనుకుంటాను. గానీ నాకేం? నేనంటాను. అదే నా ప్రత్యేకత కూడా! మనషుల దగ్గర నాకు సంకోచం వుండదు. అందులోనూ కేవలం నా కోసమే కాదు గదా, మనందరి కోసమూనూ! ఏం! అంచేత మా సుజాత వుంది కదా? మొన్న సరోజిని పెళ్లిలో చూశావు గదా? ఎదిగేసింది తోటకాడ లాగ! మొన్న పుష్యానికి దానికి పదమూడెల్లి, పధ్నాలు గొచ్చింది. అంటే పెళ్ళి కెదిగేసిందన్న మాటేగదా? అదుంది గదా? అది స్కూలు ఫైనలు పాసయింది గదా? కాలేజీలో ఎలా చేర్పించనా అని గందరగోళ పడుతున్నానుగదా? సుఖంగా ఈ వూర్లో చేర్పించి మీ ఇంట్లో వుంచుతానయ్యా! ఏం. నా చెల్లెలింట్లో నా



కూతుర్ని ఉంచడానికి నాకు తీపరమా? ఉంచుతాం, ఆ తర్వాత మోహానుకి నచ్చినంత కాలంవే కాలేజీ! ఆ తర్వాత మేరేజీ!"

పార్వతీశం ప్రశ్నలు వెయ్యడం వుందిను. 'ఏమంటారు?' అని అడిగి అభిప్రాయం తెలుసుకోవడం అతనికి నామోషి. ఉద్యోగ విషయాల్లో దుర్యోధనుడి వేషం, కృష్ణ లీలలలో కంస పాత్ర, బొబ్బిలి యుద్ధంలో తాండ్ర పాపారాయుడు-ఇంకా చెంగిజ్ ఖాన్, ఔరంగజేబూ హైటరు దాక—వగైరా వేషాలు వేస్తుంటాడాయన! నాటకాల్లో! ఆ వేషాల్లో ఈతని కీతనే సాటి అంచేత అనర్గళంగా వాక్యాలు చెప్పి, ఒప్పించడంలో ఈతని కీతనే సాటి.

రాజశేఖరానికి సమస్య ఎదురైంది. సరే, సుజాతని తెచ్చి ఇంట్లో ఉంచుకుని చదువు చెప్పించినంత వరకూ బాగానే వుంటుంది. గానీ మోహాన్ పెళ్లి చేసుకోనంటే? ఎప్పటికీ అదే నిర్ణయంతో వుంటే? అప్పుడు సుజాత బ్రతుకు మీద ఏలాటి పర్యవసానం? ఒక ఉద్దేశంతో తమ ఇంట్లో దాచుకుంటూన్న పిల్లగదా – అది తెలిసి, సుజాతే మోహాన్ మీద కోరికలు పెంచుకుంటే?

"నేనూ కొంచెం ఆలోచించి చెప్తాను బావగారూ!"

సమస్య పరిష్కారమే అయిపోయినట్టు వెనక్కి వాగిలపడి, మూతి ముందుకిచంచి, సుఖంగా మీసంలోని తెల్లని వెంట్రుకలు వెతికి పీక్కుంటున్న పార్వతీశం. ఆ మాట

వినగానే బంతిలాగా లేచి కూర్చున్నాడు చిరాగ్గా.

"అదుగో మళ్ళా ఆలోచనలో పెట్ట కండీ బావగారూ?" నేనేం అనాలోచి తంగా ఈ నిర్ణయం తీసుకున్నానా? ఇలా తప్పించి మరొక మార్గమేముందిచెప్పండి? చెప్పండీ! ఆలోచన మనసులో కాకుండా మాటల్లో కానీయండి, రండి! మోహన్‌కి ఎప్పటికైనా పెళ్లిచేస్తాం కదా? ఒదిలేయం కదా? మరెవరో పరాయి పిల్లకిచ్చి కట్టబెట్ట లేంకదా అప్పుడు? మన పిల్లల్నే మనఇంట్లో మన కంట్లో మెసులు తూన్నప్పుడు కదా సంబరం? మరేం చెప్పకండి. చూడండి, పెళ్ళికి ముందు ఒకర్నొకరు అవగాహన చేసుకోడానికి ఈ పరిచయము, సత్సంబంధం, సుస్నేహం - ఇవి చాలా అవసరం బావగారూ! ఇది లవ్వే అంటారో. వల్లకాదే అంటారోగానీ—అది మంచిదే - మరి నేను గూడా మీ చెల్లెల్ని లవ్వాడి గదా పెళ్లాడాను. లేకపోతే చెల్లేదేనా మీ చెల్లెలు? పెళ్ళి ఒక పయ సభలాంటి మహాకట్టడం బావగారూ! దానికి పునాదులు గాఢంగా పడతాయి లవ్వులో!" 'మపేసేజీ' అప్పజెప్పాడు

రాజశేఖరానికి నిజంవేననిపించింది.

పిల్లలకి అవసరమైన వేవో తెలుసుకొని, అవి మనకి అనుకూలమైన రీతిలో అందిస్తేనే ఉభయ తారకం.

"కాలేజీలు తెరిచారా?"

చాలు! రాజశేఖరం వేసిన ఆ ప్రశ్న చాలు పార్వతీశానికి. వారం రోజుల్లో సుజాతని తీసుకొచ్చి కాలేజీలో చేర్పించే స్తానని; ఆపైన పిల్లబరువు బాధ్యతల గూర్చి తనకేం భయంలేదనీ: అది తన పిల్లకాదు, రాజశేఖరం పిల్లేననీ—ఆ దంపతులని అన్ని విధాలా బుజ్జగించి, ఓదార్చి, ధైర్యం చెప్పి: ఆ పూట సుష్టు భోజనం కూడా చేసి, బావగారితో భరించలేనన్ని సరసోక్తులాడి, "నాకు రేపు రాత్రికే 'రాయబారం' నాటకం ప్రోగ్రాముంది. మరినేను వెళ్ళక తప్పదు." అంటూ సెలవుపుచ్చుకు వెళ్ళాడు పార్వతీశం.

(సశేషం)

○ కారులో యువతీ యువకుల జంట ప్రయాణిస్తోంది. నిర్మానుష్యమైన ఒక ప్రదేశంలో యువకుడు, పెట్రోలు అయిపోయిందన్న మిషతో, కారును సడన్‌గా ఆపేశాడు.

"అరే!" అంటూ ఆ అమ్మాయి సంచిలోనుండి ఒక పెద్ద బాటిల్‌ను బయటకు తీసింది.

ఆ యువకుడు పెదవులు తడిపుకుంటూ అమ్మాయికి దగ్గరగా జరిగి "నువ్వు ముందే ఆలోచించి పెట్టావన్నమాట. గుడ్! అందులో ఏమిటి? విస్కీయా, బ్రాందీయా?" అన్నాడు.

"కాదు, పెట్రోలు!" అంది ఆ అమ్మాయి.

వస్తువిశేషములు

సుగుణ

'వెల్లుల్లి'

ఉల్లిచేసిన మేలు తల్లికూడా చెయ్యదంటారు. నిజమే. వెల్లుల్లి వంటకాల్లోనే కాక వైద్యవిధానాల్లో కూడా నేడు బాగా వుపయోగపడుతోంది.

వెల్లుల్లి దుంప మెత్తగా నూరి వ్రణములకు రాసిన క్రిములు హరించి వ్రణములు మానును. వెల్లుల్లి పాయలు నూరి కట్టిన గోరుచుట్టు కనుపుజెట్ట, మడమశూల గడ్డలు మొదలగునవి హరించును

విషమును హరించుటకు వెల్లుల్లి పెట్టినది పేరు,

వెల్లుల్లికి విరిగిన అవయవములను అతుకుగొనచేయు గుణము కలదు.

దుష్టరక్తమును, దుర్నీరును పోగొట్టును. చెమట పట్టించును. విరేచనకారి, అతిమూత్రమును తగ్గించును.

పక్షవాతము, కీళ్ళనొప్పులు, కుష్ఠురోగము మొదలైనవి తగ్గించును. శ్లేష్మమును పోగొట్టును.

విషమ జ్వరములకు నూనెతో వేయించిన వెల్లుల్లిని భోజనమునకు ముందు తీసుకొనిన మంచిది.

ఉబ్బసము జాస్తిగా వున్నప్పుడు వెల్లుల్లి రసము 3, 4 చుక్కలు నీళ్ళలో వేసి త్రాగిన వెంటనే ఉధృతము తగ్గును.

తరచు వెల్లుల్లి తినుచుండిన తలవెంట్రుకలను గట్టిపరచి నెరయుట తగ్గించును.


వెల్లుల్లినుండి తీసిన చమురు గుంటకలగరాకురసము నీలాకురసము సమభాగములుగా తీసుకొని కాచి తలకు రాసిన తల నెరియకుండా వుండును వెల్లుల్లి రుబ్బి వంటాముదమువలె చమురు తీయవచ్చును.

ఆవనూనెలో వెల్లుల్లిపాయలు వేసి కాచి ఆ నూనె పూసిన గజ్జి చిడుము పోవును. వ్రణములలోని పురుగులుచచ్చును.

వెల్లుల్లిని ఊరగాయలలో వాడటము వల్ల రుచి, సువాసనయేగాక ఆరోగ్యమునకు కూడా ఎంతో మంచిది.

ఈ రసాన్ని కీళ్ళనొప్పులవారికి, విరోచనాలు కట్టకుండా బాధపడేవారికి, కుష్ఠురోగులకు కూడా వాడవచ్చును. వెల్లుల్లి రసాన్ని వేసలైన్‌తో కలిపి చర్మవ్యాధు లున్న శరీరభాగాలపై పూయుటవలన మంచి ఫలితమిచ్చును. చిన్నపిల్లలకు వచ్చే చిన్నబిడ్డనొప్పికీ, బాలింత స్త్రీలకు వాతం కమ్మినా యీ రసాన్ని కాళ్ళకు అరచేతులకు రుద్దవలెను. నిలవకూరగాయలు వాడునప్పుడు వెల్లుల్లి రసాన్ని వాడిన మంచి రుచి వచ్చును. భోజనానంతరం ఒక్కపాయను తినడంవల్ల ఎన్నోరకాల వ్యాధులు రాకుండా 'ప్రివెంటివ్' మెడిసిన్‌గా వుపయోగిస్తుంది.

—కాకాని కమల



ఏర్ కండిషన్డ్ ఇంట్లో కూర్చుని విసుగెత్తిన ఓ మంత్రిగారి సతీమణి ఓ సాయంసమయాన మలయ మారుతాల నాస్వాదిస్తూ బాల్కనీలో ముద్దుల కూతురితో ముచ్చటలాడుతూ కూర్చునుండగా-

సరిగ్గా అదే సమయాన ఆ వీధినే ఓ కరువుబాధితుల ఊరేగింపు ఆకలి కేకలు వేసుకుంటూ నీరసంగా సాగిపోయిందట.

ఆ ఊరేగింపులోనూ, ఎండలోన ఎండిన డొక్కల, ఎముకల గూళ్ళ గోచిపాత రాయుళ్ళనూ చూచి జడుసుకున్న సదరు మంత్రికుమారి తల్లిని అడిగిందట; "ఎందుకు మమ్మీ, వాళ్ళలా మంత్రి పదవులు ఊడిన వాళ్ళకన్నా అన్యాయంగా అరుస్తున్నారూ?" అని

"దేశంలో కరువుగా వుంది బుజ్జీ! వీళ్ళకు తిండానికసలుండేదే చస్తున్నారట. అందుకని గంజికేంద్రాలన్నా పెట్టాలని గోల చేస్తున్నారు!" అందావిడ.

అంతటితో ఊరుకోక తెల్లబోయిందా బాల. "అదేంటి మమ్మీ! అన్నందొరకనంతమాత్రాన చావడం ఎందుకు? ఆపిల్సు గానీ, మిఠాయీలుగానీ తింటూ హాయిగా బ్రతకవచ్చుగదా!" అందట ఆ ముద్దుల గుమ్మ.

సదరు చిన్నపిల్లకన్నా అమాయకంగా మాట్లాడగల మహానటులు మనల్నేలుతున్న టోపీదాసులు. మనల్ని నిత్యం వేధించి, బాధించే సకల సమస్యలకూ సదరు మిఠాయి తైపు పరిష్కారాల్ని లడ్డుండల్లా మన గొంతుల్లో కుక్కగల ఘనులు మన పాలకులు.

"తిండానికి బియ్యంలేవు మహాప్రభో" అని మొరపెట్టుకుంటే "అందుకేగా గోధుమల్ని బాతిరపం చేశాం." అని దబాయించగలరు! "సోసీ అవే తింటాం. అవెక్కడున్నాయో చెప్పండి సార్!" అంటే "పేపర్లు చదవటం లేదుట్రా! విన్నవే అమెరికాలో ఓడకెక్కాయి. నువు చచ్చేలోగా మీ ఊరికి వచ్చి తీరతాయి!" అని హామీ ఇస్తారు.

"నాబోయ్! అవే! బాబ్బాబు, వచ్చే ఎన్నికల్లో కూడా మీకే ఓట్లేస్తాంగానీ, మా పాపాల్ని క్షమించేయండి సార్! క్రిందటి సారి మా ఊరికి వచ్చిన సదరు అమెరికా


పిండి తిని మా వాడొకడు మా ముత్తాతను చూసొస్తానని స్వర్గానికెళ్ళి మళ్ళీతిరిగి రానే లేదు సార్!” అంటే “బిగ్గరగా అనకురా సామాన్యుడా! నీకేం భయంలేదులే! నిన్ను స్వర్గానికెళ్ళ నివ్వంలే! ఆ గోదుమల్ని ఉమ్మెత్త గింజల్నుంచి వేరుచేయించాకే అమ్ముతాంలే!” అని అభయహస్తం చూప గల దయాశీలురు మన టోపీదాసులు.

ఇలాంటి అవతార పురుషులెల్లరికీ చీఫ్ అయిన ఢిల్లీలోని కాంగ్రెస్ అధ్యక్ష బడా టోపీదాస్‌గారు వీరికన్నా పదాకులెక్కువ తిన్న మహాజ్ఞాని. ఆయనగారు అడపా దడపా కొన్ని చారిత్రాత్మక పరిశోధనలు చేస్తూంటారు, తత్ఫలితాలను మహోప న్యాస రూపంలో మన మట్టి బుర్రలకు ట్రాన్స్‌ఫర్ చేసి మనల్ని చైతన్య వంతులుగా చేస్తూంటారు.

“మన పవిత్ర భారతంలోగల అశాంతికి, అజ్ఞానానికి, దరిద్రానికి కారణము లెవ్వి?” అని ఆయనగారా మధ్య ఓ సభలో మైక్ పగిలేలా ప్రశ్నించేరు.

“తమరింకా బ్రతికుండటమే!” అని ఆ సభలోని ఓ సామాన్యుడు అనబోయేడు గానీ వారం రోజులుగా పస్తులుండటాన వాడి నోరు పెగలలేదుట!

అప్పుడా బడా టోపీదాస్‌జీ “కారణం అమెరికా! అమెరికా!” అని గర్జించేరుట. అందుకా సభలోని కమ్యూనిస్టులూ, కాంగ్రెస్ సోషలిస్టు ఫోరంవారూ చప్పట్లు



కొట్టేరుట. “బా రా! ఇన్నాళ్ళకయినా మనం ఎప్పట్నించో చెబుతూన్న బోడి నిజాన్ని గుర్తించేడుగదా మన బాస్?” అని సంతోషించేరుట.

సదరు అధ్యక్ష శర్మాజీ మన ప్రగతిని చూసి అమెరికా అసూయతో కుట్రలు పన్నుతోందని తన పరిశోధనలో కనిపెట్టేరుట. అంతర్జాతీయ రంగంలో పెరిగిపోతున్న మనదేశ ప్రతిష్టనుచూసి అమెరికాకు పిచ్చెక్కిపోతోందని కనుగొన్నారుట. అందుకని దేశంలోని ప్రతిపక్ష పార్టీల్ని మేపుతూ ఇక్కడి అరాచకాన్ని ప్రోత్సహించి మనల్ని అప్రతిష్ఠ పాల్జేయాలని కుట్రలు పన్నుతోందిట.

కనుక మనల్ని జాగ్రత్తగా ఉండమని ఓ ఉచితసలహా పారేశారు. అంటే, అమెరికా తుమ్మినా, దగ్గినా జాగ్రత్తగా పెలి

స్కోప్‌తో కనిపెట్టి ఉండమనీ, అమెరికా బుట్టలోపడి అల్లర్లు చేయొద్దనీ దాని సారాంశం.

నిజమే! మన ప్రగతిని చూసుకుని మనమే ఏడుస్తున్న పుణ్యకాలంలో అమెరికా వాడేడవటం ఓ వింత! నిస్సందేహంగా మనం అన్నిరంగాల్లోనూ అమెరికా తలతన్నగల పురోగతిని సాధించేశాం. ఏదో అమెరికావాడు అన్యాయంగా సముద్రంలో పారబోసుకుంటున్నాడు గదా అని దయదలచి వాడి గోధుమల్ని కొంటున్నాంగానీ మనకేం గతిలేకనా! మన ఆహార మంత్రిగారు క్రీ.శ. 2050 కల్లా ఒక్క గింజకూడా దిగుమతి చేసుకోనక్కర్లేదని ఆ మధ్య శెలవివ్వలేదా!

"కరెంటు లేదు! చస్తున్నాం! ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయ్! కార్మికులు బజార్నపడుతున్నారు మహప్రభో!" అంటే మన కేంద్రమంత్రిగారేమన్నారు? "ఫర్వాలేదు! ఓ బృహత్ప్రణాళిక నా జేబులో రెడీగా వుంది క్రీ.శ. 2000 కల్లా నేషనల్ పవర్‌గ్రిడ్ వచ్చేస్తోం దొచ్చేస్తోం దొచ్చేస్తోంది!" అంటూ సోషలిస్ట్ యుగళ గీతం పాడలేదా!

"దీపాల్లోకి కిరసనాయిలు కూడా లేక చీకటి బ్రతుకులయిపోయాయి ప్రభో!" అని పల్లెటూరి గరీబీలు గోలపెడితే మన గరీబీ హటావో గౌర్నమెంట్ ఊరుకుందా! "మీరు వాడే కిరసనాయిలు బుడ్లు మాంధాతలకాలపువి. తక్కువ నూనెతో ఎక్కువ మండే కొత్త దీపాలు డిజైన్ చేయించబోతున్నాం!" అని తక్షణం మన టోపీదాసుల బామ్మరుదులతో ఓ కమిటీని వేయలేదా!

"వర్షాల్లేవు! పొలాలకు నీళ్లు లేవు!" అంటూ కొందరు రైతు సంఘీయులు అల్లరి పెడుతుంటారుగానీ మనం మోసపోగూడదు. దేశాని కామూలనున్న గంగను ఈ మూలనున్న కావేరితో కలిపే ప్రపంచాద్భుతకాలువనో దాన్ని మనముని మనవళ్ళకాలానికల్లా రెడీ చేసేయబోతున్నారు ఘనమైన మన ఏలినవారు.

మనది దూరదృష్టి, దీర్ఘకాలిక విప్లవ మూసా. దేనికీ తొందరపడగూడదు. పాతికేళ్లుగా ఈ కొన ఊపిరిని నిలబెట్టి గలిగినవాళ్ళం ఆ మాత్రం ఆగలేమా! 'నిదానమే ప్రధానము' అనిగదా మన వేదాలు చెపుతున్నదీ, మన సోషలిస్టు దెయ్యాలు వల్లిస్తున్నదీ కూడా.

మనది అసలు సిసలు సోషలిస్టు ప్రజాస్వామ్యం. 'వాటర్ గేట్' కుట్రల అద్భుత కథలుచెప్పి అమెరికావాళ్ళేం కాలరెగరేసుకొనక్కర్లేదు. మనమామాత్రం చేతగాని వాళ్ళమేం కాము. విదేశీ ఏజంట్లయిన మన ప్రతిపక్ష నాయకుల సంగతలా వుంచి– స్వచ్ఛమైన స్వదేశీ ఏజంట్లయిన మన సుప్రీంకోర్టు జడ్జీలే తమ టెలిఫోన్లను సిఐడిలు చాటుగా వింటున్నారని వారి ప్రజ్ఞకు మెచ్చుకుంటూ సర్టిఫికేట్లివ్వలేదా!

నిక్సన్‌కు ప్రజాస్వామ్యం తెలీదు గనుక ఇంకా రాజీనామా ఇవ్వలేదుగానీ మన మైసూర్ మంత్రిగారు ఆడపిల్ల వ్యవహారంలో పాడియావులాంటి పదవికి రాజీనామా పారేసి హాయిగా పిండిమిల్లుల్ని మేనేజ్ చేసుకుంటూ కాలక్షేపం ఆరంభించలేదా!

ఉత్తరప్రదేశ్‌లో పోలీస్ కాన్‌స్టాబిల్స్ ఓ విప్లవ సినిమా ప్రత్యక్షంగా వేసిచూపగా సీ ఆర్పీ సెన్సార్ చేయటం, దాని ప్రొద్బ్యాపరనదగ్గ ముఖ్యమంత్రి రాజీనామా చెయ్యటం జరిగిందీ పవిత్ర ప్రజాస్వామ్య భారతంలోనే గాదా!

మనమేదో అప్పులు తెచ్చుకుని పప్పుకూడుగా కాలక్షేపం చేస్తున్నామని గిట్టని వాళ్ళంటారుగానీ నమ్మగూడదు. మొన్నేగదా, కెనడానుంచో కాంగోనుంచో 60 కోట్లు తెచ్చాం! ఎందుకు? దానికి మరో పదికోట్లు కలిపి బంగ్లాదేశ్‌కు అప్పించ్చేందుకేగదా! పరోపకారార్ధమిదం అప్పులేగదా! మన తప్పెక్కడుంది.

ఇదంతా చూస్తూంటే వళ్ళు కిరసనాయిల్లేకుండానే మండి తోందంటారా! మంచిది! అది ఆరోగ్యకరంమే. సరి మీ పొరుగింటాయనక్కూడా మండుతోందేమో కనుక్కోండి.

వెధవగొడవలు! మన కెందుకంటారా! అది మరీ మంచిది. శుభ్రంగా అన్నం సంగతి మరిచిపోయి ఆపిల్సుతో, లడ్డుందల్తో బ్రతికేయండి •


సమస్యల తోరణాలు

సగటు మానవుడి జీవితంలో
సమస్యల తోరణాలు కోకొల్లలు
వాటి కేనాటికి లేవా ఎల్లలు?
స్వార్థపు క్రోన్నాగుల
విషపు కాట్లకు గురై
సమాధి జీవితాన్ని
కోరి కోరి వరిస్తున్నారు!
పరిష్కారాలు చిక్కక!
ప్రగతికై
సుగతికై
వేసిన చలువ పందిళ్ళ నీడలు
సామాన్యుడి జీవిత తీరాలకు
సమీపించడం లేదు!
నిజానికివి
ప్రజానీకానికి వేసిన
ప్రగతి పందిళ్ళా?
తిరోగతికి
తిరునాళ్ళు కాకపోతే మరి!

—తెన్నెల ఎలీషా

కోతికథ

కె.యస్.వై.పతంజలి



"మీ పేరు ఏ నటిక తెలుగు కథానాయికలాగా ఎంతో బావుంది" ఆ అబ్బాయి జానకి ఎదురుగా నిలబడి అన్నాడు.

"ఈ సంగతి చెప్పటానికే నేమిటి నన్ను నిలబెట్టమన్నది?" జానకి ఆశ్చర్యంగా అన్నది.

"నా పేరు చిరంజీవి డిగ్రీ కాకరపువ్వొత్తులు వెలగబెడుతున్నాను." చిరంజీవి తనను పరిచయం చేసుకున్నాడు.

'ఏలాగే మీ పేరు కూడా బావోలేదు ....'' జానకి వ్యాఖ్యానించింది.

చిరంజీవి గాభరా పడ్డాడు. 'నో...నో...మీరు అన్నట్టు నా పేరు అట్టే బావుండక పోయినా....నేను బావుంటాను. ఇప్పుడు సాయంత్రం అవటం వలనా, వీధి దీపాలింకా వెలగక పోవడం వలనా నా మొహం మీకు సరిగ్గా కనిపించడంలేదు కామోసు. నిజం కావాలంటే మా యింట్లోని నిలువుటద్దాన్ని అడగండి.. ' ...ంచె. ఆగేడు.

"నన్నూ ఇప్పుడు ఏం చెయ్యమంటా రయితే?" జానకి అర్థంకాక అడిగింది.

"మీరు ఇప్పటి కిప్పుడు అర్జంటుగా నన్ను ప్రేమించనవసరం లేదు. అసలు సంగతి.... నిన్న మీరు "ప్రిన్సిపల్-లింగమూర్తి'' సినిమాకు వెళ్ళేరా? ఏం? వెళ్తూ వెళ్తూ దార్లో కిళ్ళీకొట్టు దగ్గర నుంచున్న నాకేసి వంగి మరీ చూసేరు. అప్పుడు

మీ కళ్ళు ఎంచక్కా నవ్వుతూ వున్నయ్. ఆ మీద నేను సరిగెట్టుకుని మా యింకి వెళ్ళి ఒక్కణ్ణీ రావటానికి జంకేసి మా రూమ్మేటు వెధవని తీసుకొని సినీమా కొచ్చి మీ వెనుక వరసలో కూర్చున్నాం. ఇంటర్వెల్‌లో మీరు కోకాకోలా తాగేరు. తప్పదు కనుక మేంవూ తాగేం.... ఆ మీద సినిమా అయిపోయిన తరువాత మీరు రిక్షాలో వెళ్ళిపోయేరు. దానికేం మీ దగ్గర డబ్బులున్నయ్ కనుక మీరు వెళ్లిపోయేరు. మరి మా దగ్గర వున్న డబ్బులన్నీ అప్పటికే అయిపోయాయి. కనక మేం నడిచి తిరిగిపోవలసి వచ్చింది. చిరంజీవి చెబుతూనే వున్నాడు,

"ఇంకా చాలా పెద్దకథే వున్నట్టుంది. సీరియల్‌మాదిరి మిగతాది రేపో, ఎల్లుండో తీరికగా చెబుదురుగాన్లెండి" జానకి విసుగ్గా ముందుకు కదిలింది.

"ఆఁ ఆఁ ఆఁ అయిపోయిందయిపోయింది. రెణ్ణిముషాలింకా నిలబడండి. మీనుంచేకదా మాకు అన్ని డబ్బులుఖర్చయిపోయాయి. అయినా నేను నిన్న సినిమాకి ఖర్చుపెట్టిన డబ్బులు నావి కాదు. మా రూమ్మేటువి. అంచేత డబ్బులు ఇప్పుడు ఇస్తేగాని వీల్లేదని వాడు అదిగో అల్లామూడో టెలిఫోన్ స్థంబం ప్రక్క దుక్కలాగ నించున్నాడు. వాడికి యివ్వడానికి నా దగ్గర డబ్బులుకూడాలేవు. అందువలన ఎలానూ ముందు ముందు మనిద్దరికీ యిచ్చిపుచ్చుకోవడాలు జరుగుతాయి కనుక మీ దగ్గరేమున్నా డబ్బులుంటే సర్దుబాటుచెయ్యాలి. అప్పు. మళ్లీ నాకు అందగానే ఇచ్చేస్తాను. ఏమంటారు" చిరంజీవి వ్యవహార రీత్యా నవ్వాడు.

జానకికి నవ్వొచ్చింది, వంటిమాటున నవ్వుని నొక్కిపట్టి మొహం సీరియస్



చేసుకుందుకు ప్రయత్నించింది, కాని మసకచీకటిలో కనబడదని గ్రహించి మానుకుంది, తరువాత-

క్రొత్తగా నవల రాసి "ఏ సినిమా వెళవన్నా" తీసుకోడా అని సినిమా నిర్మాతలకోసం వెతుకుతున్న రచయిత్రిలా ఇటూ, అటూ చూసింది—

వారపత్రికల్లో మగాడి సీరియల్‌లాగా అక్కడా అక్కడా ఒకరిద్దరు తప్పించి మరెవరూ వీధిలో తిరగడంలేదు. కొంచెం సేపు ఆలోచించింది-చించి, "మా ఇంటికి రారాదూ...మా నాన్నార్ని అడిగి ఇస్తాను" అన్నది.

చిరంజీవి ఆలోచించాడు. "పోన్లెండి ...మీ దగ్గర ప్రస్తుతానికి లేనట్టున్నయ్. ఈసారికి మరెక్కడన్నా ప్రయత్నిస్తా న్లెండి....ఒస్తాను" అని చెప్పి వెనక్కి తిరిగి గబగబా వెళ్ళిపోయాడు

జానకి ఇంటికి వెళ్ళి భోజనం చేసి మంచంమీద బాసింపట్టు వేసుకుని కూచుని పుస్తకం తీసింది

తీసింతరువాత ఆ పాపకి చిరంజీవి జ్ఞాపకం వచ్చి నవ్వుకుంది. తరువాత అటువంటి అబ్బాయిల విషయంలో జాగ్రత్తగా వుండాలనీ, అసలే నవ్వకూడదనీ నిశ్చయించుకునీ నిద్రపోయింది

మరునాటి సాయింకాలం చిన్న పనిమీద టౌన్లోకి వెళ్ళవలసి ఒచ్చి రిక్షాలో కూర్చుని కొంతదూరం వెళ్ళింది.

మళ్ళీ కిళ్ళీకొట్టు దగ్గర చిరంజీవి [ఉత్తరాల శీర్షికలో సీరియల్ రచయితలాగా]

అటుకేసి చూడకూడదనీ, చూసినా నవ్వకూడదనీ, నిర్ణయించుకుని తలవంచుకునీ ఒక్కో-చేతికి ఎన్నెసి వ్రేళ్ళున్నాయో, ఒక్కో వ్రేలికీ ఎన్నెసిగోర్లున్నాయో లెక్కపెట్టింది, లెక్కపెట్టి తరువాత వెనక్కి చూసింది.

చిరంజీవి స్పీడుగా [మాజీ ముఖ్యమంత్రి నరసింహారావుగారు ఢిల్లీకి పయనమయిన చందంగా] వెనక్కి వెళుతున్నాడు.

జానకి చిరునవ్వు నవ్వి రిక్షా మళ్ళీ వెనక్కి త్రిప్పమన్నది. రిక్షావాడు మాటాడకుండా త్రిప్పేడు.

రిక్షా, నడుస్తున్న చిరంజీవి ప్రక్కకి ఒచ్చిన తరువాత రిక్షా ఆపమని, జానకి పిల్చింది.

"ఏమండోయ్!"

చిరంజీవి గాభరా పడిపోయి ఆగి, వెనక్కి తిరిగాడు.

"నేనిప్పుడు సినీమాకి వెళ్ళడం లేదు. మీరు రూముకెళ్ళి అనవసరంగా ఈ మారు ఇంకెవరి డబ్బులో అప్పుతీసుకుని ఖర్చుపెట్టే నవసరంలేదు. ఏం! అది చెప్పటానికే పిలిచాను" జానకి చిన్నగా నవ్వింది.

చిరంజీవి సీరియస్ అయిపోయాడు,

"వాటీజ్ దిస్. ఏమిటి మీ ఉద్దేశ్యం ...

మీరు సినిమాకా్కకపోతే సర్కస్‌కి వెళ్ళండి. సర్కస్ చూడటానికి కాకపోతే చేయడానికి వెళ్ళండి, మధ్యన్నాకేమిటి? వాటీజ్ దిస్..." అన్నాడు కోపంగా.

జానకి మరోసారి కొంచెమే నవ్వి రిక్షా వెనక్కి తిప్పమన్నది. రిక్షావాడు నవ్వుకుని మళ్ళీ రిక్షా వెనక్కి తిప్పాడు.

"ఏమండోయ్!" ఈమారు చిరంజీవి పిలిచాడు. జానకి వెనక్కి తిరిగింది.

"థేంక్స్.... శ్రమ తగ్గించారు.... వేగిరం వెళ్ళిపోచ్చేయండి" అన్నాడు నవ్వుతూ.

మరో నాలుగు రోజులు పోయిన తర్వాత–

జానకి ఒక్కర్తే గుమ్మం దగ్గర నిలుచుంది.

ప్రక్కింటి ఆరేళ్ళ కుర్రాడొకడు మెట్ల ప్రక్క నిల్చొనున్నాడు.

వీధి మరుపుతిరుగుతూ చిరంజీవి కనిపించాడు.

"ఒరే చిట్టీ! నువ్వు రాళ్ళు విసిరి కాకుల్ని వాట్ని కొట్టగలవేరా?" జానకి కుర్రాడి నడిగింది.

"కొట్టగలన్నుగాని... కాకులు మనసూటుకి బాగా అందవు. పేష్టార్లు వాళ్ళు అయితే బాగా అందుతారు..." అన్నాడు పెద్ద మనిషి తరహాలో. లేక ఆంధ్రోద్యమం గురించి "అమ్మగారికి" రిపోర్టిచ్చిన మీర్జాపైపులో.

"వెరీగుడ్... చూడూ... నీకు అనిక పావలా యిస్తాను. మంచి రాయొకటి తీసి ఎదురుగా ఒస్తున్నాడే ఆ అబ్బాయిని కొట్టాలి.... పావలా పెడితే ఎన్ని చాక్లెట్లు అవి వొస్తాయో నీకు తెలుసుకదా? కొట్టు" అన్నది జానకి.

చిట్టిబాబు అనుమానంగా చూశాడు.

"ఒట్టు....పావలా యిస్తాను....కావాలంటే మరో అయిదు పైసలు. గభాల్న కానిచ్చెయ్యాలి.... నేను తలుపు దగ్గిర్కి వేసుకుని లోపల నుంచి చూస్తూవుంటాను. రాయి విసిరి కొట్టేసి పారిపోయి మళ్ళీ

○ న్యూయార్క్‌లో ఉద్యోగం వచ్చింది రామేశానికి. ఇండియన్స్‌కు పంక్చుయాలిటీ తెలవదని అక్కడ అమెరికన్ బాస్ అనుకొంటాడో అని పది గంటల కాఫీసయితే తొమ్మిందింబావకల్లా వెళ్ళాడు. ఆఫీసరుగారి వళ్ళో కూర్చుని కబుర్లు చెబుతోంది ఆయన సెక్రో. మర్నాడు తొమ్మిదిన్నరకల్లా వాళ్ళిద్దరూ బిగికౌగిలిలో ఉన్నారు. నెమ్మదిగా తప్పుకోబోయిన రామేశానికి ఆఫీసరుగారి కేక వినపడింది. "రేపు తొమ్మిదీ ముప్పావుకి ఇక్కడ కనిపించావో ఉద్యోగం పీకిపారేస్తా జాగ్రత్త!"

నా దగ్గరకు రావాలి ..ముప్పై పైసలు. వేగిరం ..” జానకి ఎంకరేజ్ చేసింది.

“ఓ!” అన్నాడు చిట్టిబాబు. తరువాత రోడ్డు పైపు రాయొకటి తీసి.. “తగిలితే పూచీలేదు. రాతికి రక్తంలేదు” అనిపాటి ఊరి పెట్టి రాయి విసిరేశు.

ఆ సమయానికి—

మెయిన్ రోడ్డుమీదనుంచి సైకిల్ మీద వచ్చి వీధిలోకిమళ్ళి, చిరంజీవి వెనకాలే సైకిల్ తొక్కుకుంటూ వస్తూన్న ఓ బట్ట తల పెద్దమనిషికి ఆ రాయి నుదుటను తగలగా ఆయన క్రిందపడ్డాడు.

“పట్టుకో ... పట్టుకో ...” కిందపడ్డా యన పారిపోబోతున్న చిట్టిబాబును పట్టుకో మని కేకలేశాడు.

చిరంజీవి చిట్టిబాబును పట్టుకుని తరు వాత బట్టతలాయన తాలూకు సైకిల్ లేవనె త్తాడు.

ఆ పెద్దమనిషి నుదురు చిట్లి నెత్తురా స్తున్నది. డైనమో తాలూకు లైట్ చితికి పోయి హేండిల్ వంకరయింది సైకిల్‌కి.

“ఏంరా కుర్రవెధవా బాల సి.ఆర్.పి. రాయెందుకు విసిరేవ్?” అడిగాడాయన మండిపడుతూ.

“తగిలితే నా పూచీలేదు. రాతికి రక్తం లేదు. నేను ముందే చెప్పాను.”

“నోరుముయ్. పద నిన్ను చితక్కొ ట్టేస్తాను. నన్నెందుకు కొట్టావ్”

“మీకోసం ఏంవిసర్లేదు. ఆ అబ్బాయి కోసం విసిర్తే మీకు తగిలింది” విర్ల క్ష్యంగా అన్నాడు చిట్టిబాబు.

చిరంజీవికి ఆశ్చర్యం వేసింది. ‘నన్నా శార్! నన్నెందుకూ కొట్టడం?” చిట్టిబాబు చెవి నులిమేడు చిరంజీవి.

“నిన్ను రాయితో కొడితే ముప్పయి పైసలిస్తానందికదా జానకి!” బిక్కముఖ మేసాడు చిట్టిబాబు.

సైకిలతనికి మతిపోయింది. “జాన కెవరు ”


చిరంజీవికి అర్థమయింది. అర్థమయ్యా కోపం వచ్చింది. “పక్కింటివాళ్ళలెండి” అన్నాడు.

“అయితే ” సైకిలతనికి అర్థం కాలేదు.

“రండి సార్. ఈ దుండగం ఏదిటో తేల్చేద్దాం రోడ్డుమీద మరి ప్రజలెవరూ నడవకూడదుగామోసు .... ఇవాళ ఉత్తి రాళ్ళయ్యాయి. రేపొద్దున తుపాకీ గుళ్ళవు తాయి. షోడాసీసాలవుతాయి. మనం అదేం పోయిందని వదిలేస్తే లాభంలేదు. మైనే మీజ్ చిరంజీవీ యువర్ నేమీజ్ వాట్?” అన్నాడు చిరంజీవి కోపంగా ముందుకు వెళ్తూ.

“నాపేరు రమణమూర్తి! పదండయితే ఆ కుర్రాడ్ని వదిలేకండి” రమణమూర్తి చిరంజీవి ననుగ్రహించి సైకిల్ తీసుకుని ముందుకు కదిలాడు.

“నన్నొదిలేయండి” చిట్టిబాబు గుంజా కున్నాడు.



"వెర్రిగా నుండమ్మా . డబ్బులొద్దూ నీకా అమ్మాయిస్తానన్న డబ్బులిప్పిం చేస్తా.. తరువాత నువ్వెళ్ళిపోవచ్చు రండి మూర్తిగారూ ఇదే ఆ యిల్లు. స్టేండ్ దెయ్యండి సైకిల్‌కి." చిరంజీవి గుమ్మం దగ్గర నించున్నాడు.

"తలుపు చాటునుంచి చూస్తూ వుంటా నని చెప్పింది" చిట్టిబాబు బెరుకుగా చెప్పాడు.

"చెప్పిందీ ...ఇదేం బుద్ధయ్యా ఆ మనిషికి?" మూర్తిగారు మండిపడ్డారు. తరువాత తలుపుతోసారు.

లోపలగెడ వేసి వుంది.

"తలుపు తట్టండి సార్" చిరంజీవి సలహా ఇచ్చాడు.

మూర్తిగారు తలుపు తట్టేరు. కొంచెం సేపటికో తలుపు తెరుచుకుంది. లోపల నుంచో తల బైటకొచ్చి "ఎవరు కావా లని" అడిగింది.

"జానకంటే మీరే నేమిటి?" మూర్తి గారు కోపంగా అడిగారు.

అతను తలుపు పూర్తిగా తెరిచాడు. "జానకి అంటే నేను కాదు, మా అమ్మాయి. లోపలికి రండి" అతను లోపలికి దారి తీసాడు.

వెనక మూర్తిగారూ, చిరంజీవీ, చిట్టి బాబూ నడిచారు. జానకి తండ్రి కుర్చీలు చూపించి కూర్చోమని తనూ ఓ కుర్చీలో కూర్చున్నాడు.

"మీ అమ్మాయి నొకసారి పిలిపిం చండి" మూర్తిగారు అడిగారు.

"ఏం? మీరెవరసలు ... ఎందుకు...

ఏం చిట్టీ... నువ్వేనేమిటి తీసుకొచ్చావ్?"

"అదంతా చెబుతానుగాని మీ అమ్మాయిని పిలండి."

"అమ్మాయ్ జానకీ" పిలిచాడాయన.

"ఇక్కడే వున్నాను నాన్నగారూ" తలుపుచాటు నుంచి పలికింది జానకి.

"ముందీ కుర్రాడికి ముప్ఫైపైసలిచ్చి పంపెయ్యండి"

జానకి మాటాడలేదు.

"ఎందుకూ... మిమ్మల్నిక్కడికి తీసుకొచ్చినందుకు కూలీ ఏమిటి.... ఒరే చిట్టీ ఆనక ఇస్తాన్లే" అన్నాడు జానకి తండ్రి.

"అరువల్లేవు" చిట్టిబాబు గట్టిగా అన్నాడు,

"ఇందు" చిరంజీవి అర్ధరూపాయిచ్చి పంపేసేడు.

"ఇప్పుడు ...అయ్యా! నేను ఏమిటి మీ కపకారం చేసాను. తెలుగు సినిమా డైరక్టర్నా, ఆలిండియా రేడియోనా?పోనీ ఏదైనా కాలేజీకి ప్రిన్సిపాల్నా? అసలు నానేంమేమిటి? మీ అమ్మాయి... ఇప్పుడు వెళ్ళిపోయిన కుర్రాడికి ముప్ఫైపైసా లిస్తానన్చెప్పి మామీద మచ్చకొండంతేసి రాళ్లు మామీద విసిరించింది. ఇదుగో నుదురు పగిలిపోయింది. నా సైకిల్ పనే పనికిరాదు. చెప్పండి ఏమిటి మా తప్పు" మూర్తి కర్చీఫ్తో వత్తుకుంటూ అన్నాడు.

"అయ్యయ్యో! అదేం మాట... అసలేమిటి జరిగిందో నాకు తెలియటంలేదు" జానకి తండ్రి విచారించేడు.

"అదికాదు నానా... నేను ఈ అబ్బాయి మీద విసర్రా అన్చెపితే, ఆ వెధవ ఈయన మీదకి విసిరినట్టుంది" అన్నది జానకి నెమ్మదిగా.

"అతని మీద మాత్రం విసరవల్సిన పనేమిటి? ఆడపిల్లలు ఇటువంటి రౌడీ పనులు చేయించొచ్చునా?" మూర్తిగారు మండిపడ్డారు.

"నానా - మీరొకసారి లోపలికి రావాలి..." జానకి తండ్రిని పిలిచింది. అతను చిరంజీవి కేసి అనుమానంగా చూసి లోపలికి వెళ్ళేడు.

మూర్తిగారు కుర్చీలో వెనక్కి వాలి కళ్లు మూసుకున్నాడు. కొద్ది సేపటిలో లోపలనుంచి జానకి తండ్రి వచ్చేడు.

"మీ అబ్బాయేడండీ?" అనడిగాడు కోపంగా.

"మా అబ్బాయెవరు మధ్య... అతనెవడో నా ముందు నడుస్తున్నాడు. మీ అమ్మాయికీ, ఆ అబ్బాయికీ పరిచయం వున్నట్టుంది... నాకు తెలీదు. అన్నట్టితను ఇక్కడే వుండే వాడేడి చెప్మా..," మూర్తిగారు ఇటూ అటూ చూసేరు. చిరంజీవి కూర్చున్న కుర్చీ ఖాళీగా వుంది.

"ఉరికే సేడు....దొంగ పిల్లవాడు.... పోల్చీసుంటాడు. మళ్ళీ కనపడనివ్వండి

చెపుతాను. నేనైతే చంపేద్దును. ఆడపిల్లని అల్లరి పెడతాడా...రౌడీ...హన్నా... కనపడితే చచ్చేడన్న మాటే....అల్లరి కుర్రాడు...కోతిగాడు ...''జానకి తండ్రి మండిపడుతున్నాడు.

''అసలేం చేసేడ...'' మూర్తిగారు తటపటాయించి లేచి నిలుచున్నాడు.


''మళ్ళీ కనపడనిద్దరూ చెపుతాను... చచ్చూలెక్కదిసేసేనన్నమాటే...'' జానకి తండ్రికి కోపం ఎక్కువవుతూంది.

''మీరు మరీ కోపంగా వున్నట్టుంది... మధ్య నే నెందుకు తప్పులేసిన అల్లరికోతి పిల్ల వాళ్ళని దండించొచ్చు...తప్పులేదు..: కానీ చూడమ్మాయ్...జానకీ ఈ మారు మరెవరినయినా కొట్టించేప్పుడు రూపాయి అర్ధాలెక్కువయినా బాగా గురిచూసి కొట్టవలసిన వాళ్ళనే కొట్టించు.... నే వెళ్తాను.'' మూర్తి బయటకి నడిచారు. •

ముకుందానికి విసుగొచ్చింది. ఎంతకీ బస్ రాదు. వచ్చిన బస్ ఖాళీ లేదు. హేమామాలిని మించిన అందగత్తె పొడుగాటి కార్ నడుపుకొంటూ వచ్చి ముకుందం ముందు ఆగింది 'లిఫ్ట్ కావాలా?' అంది. ఎగిరి గంతేసి వెనుక డోర్ తలుపులు తియ్యబోతున్న ముకుందం ముగ్ధుడయ్యాడు' ముందు కొచ్చి కూర్చోండీ' అన్న కారుకన్య మాటలు విని. అలాగే చేశాడు కూడా. కారు కారులా వెళ్ళడం లేదు పడవలు అటూ యిటూ ఊగుతూ వెళ్తుంది. తన్మయత్వంతో ముకుందం కూడా వూగుతున్నాడు. హఠాత్తుగా ఎదురుగా వచ్చే లారీకి గుద్దుకోబోయిన కారు ఎలాగో తప్పించుకొంది. ఊగులాట పోయి వణుకు పట్టుకొంది ముకుందానికి. 'చూడండీ కొంచెం నెమ్మదిగా పోగూడదూ' అన్నాడు, కారుకన్య నవ్వి 'పీకలదాకా తాగి కారు నెమ్మదిగా తోలడమేమిటి నాన్సెన్స్' అంది. ముకుందం సగం ప్రాణాలు పోయాయి. 'పోనీ కొంచెం కారు ఆపితే ముందు పక్క అద్దం తుడుస్తాను. కొంచెం దారి క్లియర్ గా కనిపిస్తుంది'' అన్నాడు. ''లాభంలేదు. కళ్ళజోడు లేంది చూపు సరిగా ఆనదు'' అందామె. ముకుందం ఆమెవంక చూశాడు. కళ్ళజోడు లేదు. అంతేకాదు ''అవునోయ్ గుర్నాథం పార్టీకి రాలేదేమిటి'' అని తనవంక తిరిగి అన్నమాటలకు ప్రాణంలో ప్రాణం లేదు. ఆ తర్వాత అయిదు నిమిషాలకు కారు పెద్ద మలుపు తిరుగబోవటంతో అతనిలో పూర్తిగానే ప్రాణం లేదు!

‘జ్యోతి క్విజ్’

1. ఐదు ఏనుగులకి సరిపడే గదులు ఆరు క్రింద ఇవ్వబడ్డాయి. వాటిని ఏ గదీ మిగలకుండా ఆరు గదులలోనూ సర్దే అవకాశముంది ప్రయత్నించండి.



(పంపినవారు: కె. మురళీధర్)

2. ఈ క్రింది లెక్కను జవాబు తెలుసుకోవటం ఒక సెకన్లో జరిగే పని. మరి మీరెన్ని సెకన్లలో చేయగలరో చూసుకోండి.

$$\left.\begin{array}{l} 0 + 1 + 2 + 3 + 4 + 5 \\ 0 \times 1 \times 2 \times 3 \times 4 \times 5 \end{array}\right\}$$ వీటిలో ఏది ఎక్కువ?

(పంపినవారు : రామనాథ్)

3. ఈ క్రింది ఖాళీలు పూర్తి చేయండి. ఒక నిమిషం మాత్రమే టైం తీసుకోవాలి!

(i) 1, 3, —; 7, —, 12; —, 15, 18; 19, —, —;

(ii) 1, 2, —; 5, —, 30; 31, 992;

4. ఈ క్రింది ఆధారాలతో మీరో సంఖ్యను కనుక్కోవాలి.

ఆ సంఖ్య 1 నుంచి 500 మధ్యగల సంఖ్యలలో ఒకటి. ఆ సంఖ్య ఒక అంకెను అదే అంకెతో గుణించగా వచ్చిన అన్సరౌతుంది (ఉదా: $36 = 6 \times 6$). మీరు కనుక్కోవలసిన అంకెను తిరగేసి (ఉదా: 19ని తిరగేస్తే 61 అవుతుంది) చూసినా కూడా అది ఒక అంకెను అదే అంకెతో గుణించగా వచ్చిన జవాబే అవుతుంది.

(కనుక్కోలేకపోతే 93 పేజీ చూడండి.)



మూడో మనిషి

కె. రామలక్ష్మి

(గత సంచిక తరువాయి)

"విగారు ఆడదాని మనస్తత్వం బాగానే అర్థంచేసుకున్నారు" నవ్వింది వసంత.

రావుగారు చాలా గంభీరంగా అయి "ఇంకొక విషయం నీకు చెప్పాలి. సహృదయంతో అర్థం చేసుకుంటావని తలుస్తాను: నాకో స్త్రీతో సంబంధం వుంది" ఆగారు.

"అవును. అందరూ అనుకుంటుంటే విన్నాను" అంది చాలా ప్రశాంతంగా వసంత.

"చూశావా? ఆఫ్టరాల్, ఈ ప్రపంచంలో అంపయా అందరికీ తారసపడే అవకాశాలెక్కువే" అన్నారు రావుగారు.

"ఇంకా లేదు" అంది వసంత.

ఆశ్చర్యంగా చూశారు రావుగారు వసంత సమాధానం విని. "అంటే: చూద్దామనుకుంటున్నావా?"

"అవును. మీ అంతట మీరు చెప్పకపోతే చూడాలనే అనుకున్నాను" అంది

సీరియల్

మామూలుగానే. అమ్మయ్య! అన్నట్టు నిట్టూర్చారు రావుగారు.

"నేను కడసారిగా ఓసారి స్వర్ణముఖి దగ్గిరకి వెళ్లాలి, నీవామె గురించి చాలా సహృదయం ప్రదర్శించావు, వింటే సంతోషిస్తుంది" అన్నారు.

"ఆడవారి జీవితాలు ఎంత విచిత్రమైన మలుపులు తిరుగుతాయో కదా!" అంది వసంత.

"మీరలా చేసుకుంటే ఎవరేం చేయ కలరు? స్వర్ణముఖి జీవితం అలా కానక్కరలేదు, తెలివిపుండి ఆ తెలివిని సరయిన మార్గాన నడిపించగల నేర్పుంటే" అన్నారు.

"ఏం లాభం? చాలాతక్కువ మందికీ రెండూ ఒకేసారి వుంటాయి" నిట్టూర్చింది వసంత.

"నీలో రెండూ కలిసి వున్నాయి నిజంగా అది నా అదృష్టమే. నీ తెలివి తేటలనీ, నీ ధైర్యాన్నీ కూడా చూడగలిగాన్నేను. ఒక్కటే .ఎప్పుడూ నువ్వు నా తరపున ఉండేలా చూడమని భగవంతుణ్ని ప్రార్థిస్తాను! వసంతా నువ్వే నిజంగా శత్రుపక్షంలో ఉంటే— నిన్ను గెలవడం కష్టం అనిపిస్తుంది" నవ్వుతూ అన్నారు రావుగారు.

"పోనీలెండి, నేనూ, నన్నలా ఎదుటి పక్షం తీసుకునేలా చూడొద్దని భగవంతుణ్ణి ప్రార్థిస్తాను" అంది వసంత

ఇద్దరూ నవ్వేశారు అప్పటిదాకా అలముకులోపోయిన తీవ్రతకాస్తా పటాపంచలై పోయింది. వసంత చేయి అందుకుంటూ "నడు ముందు నిన్ను యింటికి తీసుకు వెళ్ళాలి. ఈపాటికి వీరాయి చెప్పే వుంటాడనుకో. అయినా, అమ్మను ఆత్ర పెట్టడం బాగుండదు. "నా మనస్సు యిప్పటిదాకా నిద్రపోయి, యిప్పుడే మేల్కొన్నట్టుంది" అన్నారు ముందుకి అడుగువేస్తూ.

వసంత రావుగారి చేయిలాగి ఆపింది క్షణంసేపు ఆగి వెనక్కి తిరిగారు రావుగారు.

వసంత ఏం మాట్లాడకపోవడం చూసి "నువ్వేం చెప్పనక్కరలేదు వసంతా, నీ కళ్ళే నీ తరపున మాట్లాడుతాయి" అంటూ వసంతని తన దగ్గిరకి లాక్కున్నారు

వసంతా రావుగారూ తోటదాటి ఇంటి ముఖం పట్టేసరికే పూర్తిగా తెల్లవారి పోయింది. వీధిలోకి కొంచెందూరం కూడా రాకుండానే ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వీరాయి ఎదురొచ్చాడు. దండాలు బాబూ, రేత్రి మహాప్రమాదం తప్పింది బాబూ" అన్నాడు ఓ పక్కగా నిలబడుతూ.

"ఏరా ఎక్కణ్నుంచి?" పకరింపుగా అడిగారు రావుగారు.

"రాత్రి కిక్కడింకేంపనని తిన్నగా బంగళాకి వెళ్ళాను బాబుగారూ, అమ్మగారికి ఏం భయంలేదని చెప్పి, అమ్మాయిగార్ని మీరు దగ్గిరుండి తేసుకొస్తారని

చెప్పానండి'' తన తెలివి తేటలకి తనే ఆనందపడిపోతూ చెప్పాడు వీరాయి.

"సర్లే కాని పదిగంటలకల్లా నేను మునసబుగారిని కలవడానికొస్తానని చెప్పు. చాలా అర్జెంటు. నేను మళ్ళీ మధ్యాహ్నం పట్నం వెళ్ళిపోతాను'' అంటూ నడక వేగం హెచ్చించారు. వసంతా ఆయన అడుగులో అడుగు కలిపింది. వీరాయి నించున్నచోటే నిలబడిపోయాడు. అమ్మాయిగారినీ అయ్యగారినీ చూస్తే మళ్ళీ వూరికి మంచిరోజు లొస్తాయేమో అన్న ఆశ తలెత్తింది వాడిలో.

ఇంట్లోకి అడుగుపెడుతూనే ఒక్క-పరుగున మేడమీదికి వెళ్ళిపోయింది వసంత. ఆమె మనస్సు పున్నమినాటి సంద్రంలాగా పొంగిపోతోంది. తక్షణం అమ్మగారెదురైతే ఏంచేయాలి? సరస్వతమ్మ ఎదురైతే ఏం చెప్పాలి? పిరికితనం ఆవహించి పైకి పరుగెత్తింది కాని రావుగారు తిన్నగా పూజగది ప్రాంతాలకి నడిచారు అప్పుడే స్నానాదులు ముగించుకుని పూజగదిలోకి నడవబోతున్న శాంతమ్మగారు కొడుకుని చూసి, "బాబూ ఎంత ప్రమాదం తప్పింది రా, మన వసంతే రాకపోతే నిన్ను వాళ్ళేం చేసేసేవారో!'' భయంతో ఒణికిపోతూ కొడుకుదగ్గిరకి వచ్చారు పసిపాపని ఓదార్చడానికి గుండెలకి అదుముకున్నట్టు తల్లిని దగ్గిరకి తీసుకున్నారు రావుగారు.

"మరేం పరవాలేదమ్మా. భయపడే



వాళ్ళని వాళ్ళెప్పుడూ అలా భయపెట్టాలని చూస్తారు. పదిగంటలకి మునసబుగారింటికి వెళ్ళి అన్నీ చూసుకుని వస్తాను గద'' అన్నారు

"బాబూ, యిన్నాళ్ళు ఎలాగా లేదు. ఎందుకొచ్చిన గొడవ. ఆ పొలం బూషణానికే యివ్వకూడదా? లేకుంటే? ''

ఆమె మాటని మధ్యలోనే ఆపేస్తూ "లేకపోతే యిలా చంపించే ప్రయత్నాలు చేస్తాడనేకదూ నీ భయం, పిచ్చి అమ్మవి నువ్వు ఒకసారి లొంగిపోతే యిక అంతే. ఆ భూషణం నాకు బాగా తెలుసమ్మా, తలదాచుకుందాకు స్థలం యిస్తే మనకి స్థానంలేకుండా చేసేరకం-యిక వాడిని గురించి మరిచిపో.. అమ్మా ఇప్పుడసలు నీతో ఓ సంగతి చెప్పాలని వచ్చానమ్మా'' అన్నారు రావుగారు.

తనకొడుకు మాటకి తడుముకోడం చూసి నవ్వుకున్నారు శాంతమ్మగారు.

"రా బాబు, చెప్పు. ఇలా లోపల

కూర్చుందాం" అంటూ పూజగదిలోకి దారి తీశారు.

తల్లి పక్కనే మఠంవేసుకు కూర్చు న్నారు రావుగారు ఆయనకి ఎలా ప్రారం భించాలో అర్థం కాలేదు.

"అదికాదమ్మా, నేను మళ్ళీ యింటి పట్టున వుండి పొలాలన్నీ ఓ అదుపులోకి తెచ్చి..." ఆగారు గుమ్మందగ్గిర అలికిడి విని.

సరస్వతమ్మ! గుమ్మానికో చెవిపడేసి విలబడింది.

"వసంతని ' మళ్ళీ ఆగారు రావు గారు.

కాని సరస్వతమ్మ యిక సహనం వహించలేకపోయింది. గబగబ లోపలి కొచ్చేసింది.

"నే చెప్తాలేవయ్యా. అదే బాబు ఇలా యింటిపట్టున వుంటానంటే నువ్వా వసం తని పంపేయాలమ్మా. అదే వాడు చెప్పేది!" అంది—ఖచ్చితంగా

ఆ మాట విని రావుగారూ, శాంతమ్మ గారుకూడా నిశ్చేష్టితులయ్యారు.

"ఏమిటి? ఏమిటి నువ్వనేది?" కోపంతో ఊగిపోతూ లేచాడు రావుగారు.

"నువ్వేలాగూ చెప్పలేవు. నన్నేనా చెప్పనియ్యి. అది నువ్వనుకునేటంతది కాదమ్మా! ఉట్టి సంగనాచి" యింకా ఏదో అనబోతున్న సరస్వతమ్మని రెక్క పుచ్చు కుని పూజగది బయటికి యీడ్చి తలుపుకి చేరబడి పోయారు రావుగారు, శాంతమ్మ నిర్ఘాంతపడి అలాగేకూర్చుండి పోయారు.

రావుగారే తేరుకుని "అమ్మా!" అంటూ మళ్ళీ తల్లిదగ్గరకి వచ్చారు.

ఇంతట్లోనే పూజగది తలుపు తెరచు కుని లోపలికి అడుగెట్టింది వసంత.

వెనక్కి తిరిగి చూసి "నువ్వా?" అంటూ "రా." అని ఆహ్వానించారు.

శాంతమ్మగారొకసారి యిద్దరిముఖాలు పరీక్షగా చూశారు. ఆమెకంతా అర్థంఅయి పోయింది

కొడుకు చేయి అందుకుంటూ "నువ్వు నాకింకేం చెప్పక్కర్లేదు బాబూ, నాకంతా అర్థం అయింది" అన్నాడు.

"అమ్మా నా మాట నమ్ము. నే చెప్ప దల్చుకున్నది విను" ప్రాధేయపడుతు న్నట్టు అడిగారు నిస్సహాయంగా వసంత కేసి చూశారు. వసంత చిరునవ్వునవ్వింది. రాత్రి జరిగిన హడావిడితో వసంత వాడిన పువ్వులాగా అతిమృదువుగా కనిపించింది. రావుగారి కళ్ళకి. "మీరింకేం చెప్పక్కర లేదండీ, అమ్మగారికంతా అర్థం అయిం దంటున్నారుగా" అంటూ రావుగారి పక్కనే కూర్చుంది వసంత.

ఇద్దర్నీ మార్చి మార్చి చూస్తూ "వసంతా, నిజంగా నాకంత అదృష్టమా" అన్నారు శాంతమ్మగారు. ఆనందంతో దుఃఖంతో ఆమెకంఠం పూడుకుపోయింది.

"ఆ అదృష్టం మీదొక్కరిదేకాదమ్మా మాదీను. మమ్మల్ని ఆశీర్వదించండి" అంటూ వంగి శాంతమ్మ పాదాలను తాకింది వసంత. రావుగారూ తల్లి పాదాలను మునివేళ్ళ తాకారు. "మీ రిద్దరూ సుఖంగా బ్రతకండి. చెప్పుడు మాటలు విని దుఃఖించకండి. నా కీనాడు యెంత ఆనందంగావుందో చెప్పలేనురా బాబూ, నాకీ ముసలికాలంలో మనశ్శాంతి ప్రసాదించమనే కాటోలు స్వామీజీ రూపంలో భగవంతుడు వ స ం త ని పంపించాడు. వెళ్ళండి. నేను మనసారా పూజచేయాలీ వేళ. నా పూజలు ఫలింపజేశాడు దేవుడు" ఆనందంతో అంటుంటే శాంతమ్మగారి కళ్ళవెంట నీరు ప్రవహించింది. ఆమెలో ఇన్నాళ్లు గూడుకట్టుకొనివున్న బెంగ హటాత్తుగా తొలిగిపోయి, ఆనందం, దుఃఖం కలసిపోయాయి.

వసంతా రావుగారూ పూజగది దాటి బయటికి వచ్చారు

హాల్లో ఓ మూలగా ఒదిగివున్న సరస్వతమ్మని చూసి చిరునవ్వు నవ్వుతూ "ఆఖరి క్షణంలోకూడా ప్రయత్నించావు- లాభంలేకపోయింది కదూ?" అన్నారు హేళనగా.

"నాకేం తెలుసు నాయనా! అదంత మంచిపిల్ల కాదని తెలిసి చెప్పలేకపోతున్నానని చెప్పాలనుకున్నాను. అంతేగాని ఈ నంగనాచిని వల్లోవేసుకోవడం నీకేమంత కష్టం అనుకోలేదు!" అన్నారు విషం కక్కుతూ.

"ఛీ నీ ఒళ్ళంతా విషమేలా వుంది. నువ్విక్కడవుంటే వాతావరణమే విషపూరితం చేసేలా వున్నావు. మూటా-ముల్లె కట్టు—" అన్నారు- గబగబా గనగదికేసి వెళ్ళిపోతూ

వసంత బిక్కమొహం వేసుకుని ఓ క్షణంపాటు నిలబడిపోయింది అప్పుడే మళ్ళ తేరుకుని "మీరేం అనుకోకండి సరస్వతమ్మగారూ, కోపంగా వున్నారు రావుగారు" అంది కొంచెం సర్దుదామన్న ఉద్దేశ్యంతో.

"అప్పుడే ఈ యింటి కోడలివైపోయినట్లే ఊహించుకోకు వసంతా. ముందుండి

○ కొత్తగా ప్రారంభించిబడిన ఒక చిన్న కంపెనీ, తను దగ్గర ఉద్యోగాల కోసం పెళ్ళి అయిన మగరాయుళ్ళను మాత్రమే దరఖాస్తులు ఒటమంది.

"ఎందుకు?" అని ప్రశ్నించారు ఎవరో.

"ఓస్, ఎందుకేమిటి? చెప్పిన పనిని తు. చ. తప్పకుండా చేయడానికీ, ఎదురు తిరగకుండా వుండటానికీ, వాళ్ళయితేనే పనికొస్తారు. ఆ విషయంలో వారికి తర్ఫీదు నిచ్చేశ్రమ కూడా మా కుండదు కదా?" అని సమాధానం.

ముసళ్ళపండుగ" అన్నారు హెచ్చరికగా, వసంత తేలికగా నవ్వేసింది. ఆమెమనసు యిప్పుడు దేనికీ భయపడే స్థితిలో లేదు.

"మీరు ఏ చెలగాటాలాడినా నాతో ఆడండి సరస్వతమ్మగారూ, అమ్మగారి తోనూ, పిల్లలతోనూ కాదు" అంటూ మేడమీదికి దారితీసింది వసంత. ఏం సమాధానం చెప్పాలో తెలియక ఫూరుకున్నారు సరస్వతమ్మగారు. రాజాబాబు సమయానికి లేకుండా పోయాడే అనుకున్నారు. ఎటూ తోచని స్థితితో ఆమెకోపం లోలోపల మండించేస్తూ ది

వసంత తన గదిలో కూర్చుందేగాని, మనసు అక్కడ లేదు. ఇకపై తన పరిస్థితి ఏమిటి? తన బాధ్యత ఏమిటి? ఎలాగేనా ఒకసారి వెళ్ళి స్వామీజీని చూసి రావాలనిపించింది.

ఆ ఆలోచన రావడమే తడవుగాచిన్న పెట్టె సర్దుకుంది. హాయిగా స్నానం చేసి కూర్చుని తలదువ్వుకోవడం ప్రారంభించింది. మనస్సు ఆనందంతో ఉరకలు వేస్తుంటే గొంతులో కూనిరాగం బయలుదేరింది వసంతకి. వెనకనించి నెమ్మదిగా వచ్చి "టీచర్!" అంటూ భయపెట్టింది శాంతి. "అప్పుడే నీళ్ళకూడా పోసేసుకున్నావే. గుడ్. రా! వెళ్లి సుందరిని చూసివద్దాం' అంటూ శాంతి చేయిఅందుకుంది వసంత.

గది గుమ్మం యిద్దరూ ఇంకా దాటలేదు "టీచర్" అంటూ సుందరి నెమ్మదిగా గదిలోకి వచ్చింది.

"సుందీ, మై చైల్డ్. ఎందుకులేచావు! నేను వస్తానుగా!" అంటూ ఎత్తి తన మంచంమీద కూర్చోబెట్టుకుంది వసంత.

"నాకిప్పుడు బాగుంది టీచర్, నేనింక చదువుకోవచ్చా?" అడిగింది సుందరి.

"ఇంకొక్క వారం రెస్ట్ అప్పటి నుంచి మళ్లీ. సరేనా?" అంది ముద్దుగా వసంత.

సుందరి జుట్టు మెల్లిగా చిక్కులుతీసి రెండు జడలు అల్లింది.

"రండి మనం కిందకి వెళ్ళి నానమ్మని చూద్దాం" అంది వసంత.

"నేనూనా?" అడిగింది సుందరి.

"నువ్వూను. ఇప్పుడేగా చెప్పావు? నాకు ఒంట్లో బాగుందని" నవ్వేసుకుంది వసంత.

ముగ్గురూ నెమ్మదిగా మెట్లు దిగటం ప్రారంభించారు

మెట్లు కింద నిలబడ్డారు రావుగారు. పైనుంచి దిగుతున్న ముగ్గురినీ చూసి ఆయన మనస్సు తేలిక పడింది.

'హల్లో సుందీ, కిందికొస్తున్నావా!' అంటూ గబగబ మెట్లెక్కి సుందరిని ఎత్తుకున్నారు.

'నాకు బాగైపోయింది డాడీ' అంది తండ్రి మెడ గట్టిగా కౌగలించుకుంటూ.

'నీకు బాగై పోయిందని మేం చెప్పా లోయ్, ఏం టీచర్:" వసంతకేసి చూస్తూ అన్నారు

"నేను మీ కోసమే వస్తున్నాను. మధ్యాహ్నం నేను ఓసారి ఊరికెళ్ళి వద్దామనుకుంటున్నాను. స్వామీజీని చూడాలి.' అంది నెమ్మదిగా.

"అంతేనా? మనస్సు మార్చుకున్నావా?" నెమ్మదిగా అడిగారు రావుగారు.

'నేను మీ ఆఖరి వేటః మరిచిపోయారా?" నవ్వుతూ అడిగింది వసంత

ఎటు చూడాలో తెలియక తల రాసుకొంటూ 'నేనూ పట్నం వెడుతున్నానుగా, ఇద్దరం బయలుదేరుదాం.' అన్నారు.

"డాడీ మీరు వెళ్లి పోతారా?" అడిగింది ఆత్రంగా వసంతకేసి చూస్తూ— తండ్రిని.

"లేదు. మళ్ళీ త్వరలో వచ్చేస్తాను. చాలా పనుందమ్మా. కావలస్తే మీ టీచర్ని అడుగు. అంటూ డైనింగ్ టేబిలు దగ్గరకి నడిచారు. శాంతమ్మగారందరికీ అన్నీ సద్దించారు.

నూకాలు కేసి చూసింది వసంత. 'నూకాలూ నేనూ వూరికి వెడుతున్నాను. నేవచ్చేదాకా సుందమ్మని ఎక్కువగా తిరక్కుండా చూడు.' అంది.

'అలాగే నమ్మాయిగారూ, మీరిక బేగ వచ్చేయాల." అంది.

"రాకపోతే ఇక్కడ కొంపలంటుకుపోతాయే ఏటి-మరి శోద్యం?" దూరంగా

'జ్యోతి క్విజ్ కికీ'

ఐ	దు	ఏ	ను	గు	లు

2. రెండో సంఖ్య మొత్తం 0, మొదటి సంఖ్య మొత్తం 1.

3. (i) 6, 9, 13, 21, 24.

(ii) 4, 6, 32.

4. జవాబు 196.

మనవు కావలసినట్టే 14 ని అదే అంకెతో హెచ్చవేస్తే $14 \times 14 = 196$.
196 ని తిరగేస్తే $961 = 31 \times 31$;

నిలబడే అంటించారు సరస్వతమ్మగారు.

"అంటుకు పోవమ్మా ఖంటించేస్తారు" అంది నూకాలు.

"వూరుకో నూకాలూ, అమ్మాయి నాల్గురోజుల్లో రాదుటే" అన్నారు శాంతమ్మగారు. వసంత తల నిమురుతూ కృతజ్ఞత నిండిన కళ్ళతో ఆమెని చూసింది వసంత.

కాఫీ టిఫినులు ముగించి మునసబు గారి యింటికి బయలుదేరారు రావుగారు.

"నాయనా. అనవసరంగా ఆ భూషణం మీద కత్తికట్టకు. వాడు తాచుపాములాంటి వాడు" హెచ్చరించారు శాంతమ్మగారు.

"ఏం చెయ్యనమ్మా. నిన్న జరిగిన దానికి మనం కంప్లయింటు యివ్వాలి. లేకపోతే—గొడవ. ఇక మునసబుగారెన్నాళ్ళ నుంచో నాతో మాట్లాడాలంటున్నారు. చూసుకుని వస్తాను. మధ్యాహ్నం పట్నం బయలుదేరాలి కదా—" అంటూనే వరండాదాటి పోర్టికోలో కారు దగ్గిరకి నడిచారు

కారు స్టార్టయిన చప్పుడు వినిగాని బల్లదగ్గిరకి రాలేదు సరస్వతమ్మ.

"రండి మీరూ టిఫిను తీసుకోండి" అంది వసంత.

అప్పటికే పిల్లలు తినేసి ఆడుకుందుకు పెరట్లోకి పరుగెత్తారు.

శాంతమ్మగారు లోపలికి వెళ్ళడంచూసి "వసంతా, చూస్తూ చూస్తూ నీ గొంతుకు వురితాడు వేసుకుంటున్నావు. నాతోపైకిరా నీకు కొన్ని సంగతులు చెప్పాలి.అన్నారు రహస్యంగా.

"కొత్తగా ఏం చేప్తారు సరస్వతమ్మగారూ, రావుగారి స్వర్ణముఖిని గురించా?" తేలికగా అడిగేసింది వసంత.

"నీకు చెప్పాడా! గుండెలు తీసిన మొనగాడు అయితే పిల్లడి సంగతికూడా చెప్పాడా?" అడిగారు.

"పిల్లవాడా? ఎవరి పిల్లాడు? ఏమిటి మీరనేది?" ఆత్రంగా అడిగింది వసంత.

"స్వర్ణముఖి కొడుకు. వాడీవూళ్ళోనే పెరుగుతున్నాడు. కావలిస్తే చూపిస్తాను." అన్నారు వసంత కోక్షణం తల దిమ్మెక్కిపోయింది. ఏదో మనస్సులో చేస్తూన్న పజిలులో తికమక పెడుతున్న ముక్క దొరికినట్టు అయింది.

"నీకింకా అనుమానమా వసంతా నీ జీవితం ఆ తాగుబోతుకి, వ్యభిచారికి అంకితం చేసుకుని ఏం సుఖపడతావు చెప్పు?"

వసంత ఏం బదులు చెప్పలేదు

"దానికో కొడుకుని కన్నాడు. అది వాడిని యిక్కడ పారేసింది...నీక్కావలిస్తే రా చూపిస్తాను. ఎప్పటికేనా వాడు పెరిగి, యీ యింటిపరువు రోడ్డెక్కించి తీరతాడు. దాంతోపాటు నీ పేరు కూడా ఎందుకు పాడుచేసుకుంటావు! రా, చూస్తే నీ మనస్సు తప్పకుండా మార్చుకుంటావు తొందర చేశారు సరస్వతమ్మగారు.

"మీ కొకష్టం అక్కరలేదండీ నేను వాడిని చూశాను" అంది.

ఉరమకుండా పక్కనే పిడుగుపడ్డట్టు అదరిపడ్డారు సరస్వతమ్మగారు.

"ఏమిటి నువ్వనేది? నిజంగా చూశావా? ఎక్కడ? ఎప్పుడు?"

"వెంకన్న తాత యింట్లో" తాపీగా అంది వసంత.

"అన్నీ తెలిసి దిగేవాళ్ళని ఏం చెయ్యకలంలే. నీ బాగుకోరి చెప్పాలనుకున్నాను .. మొగుడంటూ దొరికితే చాలు—ఎలాంటివాడైనా ఫరవాలేదనుకుంటే— ఎవరేం చెయ్యకలరు."

"చూడండి సరస్వతమ్మగారూ, మీకు సంబంధించని విషయాల్లో యింత ఆసక్తి చూపడం మంచిదికాదు. మీరింక యీ సంగతులు మరిచిపొండి" అనేసి వసంత అక్కడినుంచి వెళ్ళిపోయింది.

సాయంత్రం చల్లబడేవేళకి ప్రయాణానికి సిద్ధం అయ్యారు రావుగారు. చాలా ఆలసిపోయి యింటికి కూడా ఆలస్యంగా వచ్చారు.

కారెక్కుతూ "వెళ్లొస్తామమ్మా" అంటూ చెప్పారు.

"అలాగే సుఖంగా వెళ్ళిరండి. మళ్లీ త్వరగా వచ్చేయండి వసంత లేకపోతే గడవదు" అంటూ సాగనంపారు.

కారు కాంపౌండు దాటింది. విశ్రాంతిగా చేరబడి కూర్చుంది వసంత కార్లో.

మెయిన్ రోడ్డు ఎక్కగానే వేగం హెచ్చించారు రావుగారు.

చల్లటి గాలి, తేలికపడ్డ మనస్సు—చాలా హాయిగా అనిపించింది వసంతకి. పక్కకి చూసి నవ్వుకున్నారు రావుగారు. కారు రోడ్డుని ఆత్రంగా మింగేస్తూ పట్నం కేసి సాగుతూంది.

ఆలోచనల బరువులేకుండా హాయిగా కారులో ఒదిగి నిద్రపోయింది వసంత. కాని, అంత ప్రశాంతంగా ఎలా నిద్రపోగలుతోందీ వసంత అన్న ఆశ్చర్యంలోనుంచి తేరుకోకుండానే కారు పట్నపు రద్దీలోకి అడుగుపెట్టింది. వస్తూపోతూన్న లారీల మధ్యనుంచి బస్సుల మధ్యనుంచి మనుషుల మధ్యనుంచి కారు వేగంగా స్వామీజీ నివాసంవైపు నడిపించారు రావుగారు. వూరిచివర అతివిశాలమైన స్థలంలో ప్రశాంతం ఉట్టిపడుతూంది – స్వామీజీ అనాధాశ్రమంలో.

(సశేషం)

వచ్చే నెల

మీ కొరకు కానుక

వాసిరెడ్డి సీతాదేవిగారి

'అమ్మ మనస్సు'



పెళ్ళయి మూడేళ్ళయింది.

రాజాగాడికి యేడాదినుండి నాలుగో నెల.

ఇంతవరకు హనీమూన్ కాదు కదా అనకాపల్లికూడ వెళ్ళలేదు. విశాఖపట్నం నుంచి కదిలి చాలా రోజులయింది.

ఎక్కడికైనా దూరప్రయాణం వెళ్ళి ఓ పదిరోజులు గడిపి రావాలని ఎంతో కోరిక. దేవికి మరీను, ఎన్నో చూడాలనీ-ఇంకెన్నో కొత్త విషయాలు తెల్సుకోవాలనీ.

తను మద్రాసు ఆఫీసు పనిమీద వెళ్ళి వచ్చాక అక్కడి సంగతులన్నీ చెప్పి చక్కని తిండితోసం తనెంత మొఖం వాచి పోయాడో చెబితే 'నన్ను కూడా తీసుకుపోతే మీకా యిబ్బంది వుండేది కాదుకదా - నాకూ కోరిక తీరేది' అంది. నిజమే తనకీ తీసుకు వెళ్ళాలనే వుండేది కానీ యేమిటో పరిస్థితులలా అడ్డు తగిలాయి.

ఈ సారి యేదో తెగించాడు.

ఎలాగూ ఈ యేడు బోనసు ఎక్కువ వస్తుంది. ఎప్పుడూ వున్న ఖర్చే ఎన్ని కొన్నా యింకా ఏదో లోటు వుండనే వుంటుంది.

యేమైనా సరే ఈసారి ఆ డబ్బుతో తిరుపతి, అట్నుంచటు మద్రాసు వెళ్లాలి - చిన్నప్పుడు యెప్పుడో చూసిందట దేవి - తన నిర్ణయాన్ని బలపరచింది. ఏ మాత్రం బలపరచక పోయినా ఆ డబ్బంతా మళ్ళీ సంసార గుండంలో పడిపోయేదే—

ఎంత ఖర్చయినా సరే ప్రయాణం సుఖంగా జరగాలనేది మొదట అనుకున్న విషయం. అందుకే అన్నిటికి రిజర్వేషన్లు బుక్ చేయడం జరిగింది.

మద్రాసు పోవు ఎక్స్‌ప్రెస్ మరికొద్ది నిముషములలో బయలు దేరనున్నది అరిగిపోయిన గ్రామఫోను రికార్డులలో ఎనౌన్స్‌మెంటు చెవిలో పడింది.

స్టేషనంతా పెళ్ళి వారిల్లులా జన సమూహంతో కిటకిటలాడి పోతూంది.

కూతవేసి రైలు కదిలింది.

తుళ్ళిపడ్డ రాజుగాడిని ఒడిలో చేర్చుకుని కిటికీ ప్రక్క కూర్చుని బైటకు చూడ్డం మొదలు పెట్టింది దేవి గాలికి ముంగురులు ఎగిరి పడుతున్నాయి ఎన్నాళ్ళ తర్వాతో ప్రయాణం. ఆమె ముఖంలో సంతృప్తి రేఖలు తాండవిస్తున్నాయి. ఎదురు గాలికి రాజా కళ్ళు మూతలు పడుతున్నాయి.

పొలిమేరలు దాటి పరుగులు పెడుతోంది రైలు. సాయంకాలపు నీరెండతో ప్రకృతంతా కొత్త అందాన్ని సంతరించుకుంది.

"అన్నట్టు... పిల్లి ని బయటకు తరిమి తలుపువేశారు గదూ?" దేవి ప్రశ్నకు శాంతంగా ప్రకృతిని చూస్తూ మైమరచిన తను గతుక్కుమన్నాడు.

తను పిల్లి ని బయటకు తరిమినట్టు గుర్తులేదు-ఖోంచేసి వచ్చి నేలమీద నడుం వాలుస్తూ చూశాడు యింట్లో పందిరి మంచంకింది పట్టిమంచం మీది పిల్లిని.

సుఖ నిద్రలో వుంది పిల్లి.

"వెళ్ళేటప్పుడు దీన్ని బయటకుతరిమి మరీ వెళ్లాలి. జ్ఞాపకముంచుకు చెప్పు." అన్నాడు అప్పుడె దేవితో!

దేవి మర్చిపోయినట్లుంది!

"ఇప్పుడా చెప్పటం, ఆ తెలివి ముందే యేమైంది. నాకు మతిమరుపని గదా నీకు చెప్పింది" దేవి మీద కోపం ముంచుకొచ్చింది.

"బాగుంది మధ్య నేనా దొరికాను. సామానుతో ముందు నన్ను వెళ్ళమని తర్వాత మీరేగా తలుపు వేసుకొచ్చారూ."

భార్య సమాధానం నచ్చలేదు.

యేమైతేనేం తను పిల్లిని బైటకు తరమలేదు కొండంత నవతాళ్ మాత్రం గుమ్మానికి తగిలించి ప్రక్కింటి వాళ్ళతో యింటిని భద్రంగా చూడమని మరీవచ్చాడు.

వెధవ పిల్లి యింట్లో వుండిపోతే ఛస్తుంది

ఒకటా రెండా పదిరోజుల కేంపు— దానికి గాలి తప్ప జీవించడానికి మరేదీ దొరకదు

బెడ్ రూంకి సంబంధించిన తలుపు ఒన్నీ దితినే వేశాడు అప్పుడన్నా గుర్తురాలేదు

"దానికి పెరుగన్నం పెట్టి పాలుపోసి చేరదీసింది నువ్వు—ఇప్పుడు చూడూ చేతులారా చంపినట్లవుతుంది" భార్య నుద్దేశించి అన్నాడు

"బావుంది నేనేం చేరదీశాను అదే కిందపడ్డ మెతుకులు యేరుకు తినేది. దొక్కలెండి ఆకలితో మాడిపోయినా దానికి పట్టెడు మెతుకులు దొరికింది లేదు అయినా ఈ మాత్రం దానికే చస్తుందా - కాకపోతే డొక్కలు మాడి చిక్కి సగమౌతుంది"

భార్య మాటలకు కొంత ధైర్య మొచ్చిం . కానీ యేది యేమైనా తెలిసో తెలియకో దాని ప్రాణానికి తనుకష్టాన్ని కలిగించిన వాడౌతాడు

అసలా పిల్లి తన యింటికొచ్చి రెండు నెలలవలేదు ఎదురింటి పెద్ద పిల్లి ఈని ఒక పిల్లని తమ యింట్లో వదలి వెళ్ళింది దాన్ని వదలించుకోడం కోసం చాలపాట్లు పడాల్సి వచ్చింది కానీ సాధ్యం కాలేదు. ఎంత దూరం తీసుకెళ్ళి వదిలినా తిన్నగా మళ్ళీ వచ్చేది

"పిల్లి కూనే గదండి పోనీ వుండనివ్వండి" అంది దేవి

"ఛట్ అదేం కుదర్దు-పొద్దున్న లేచిందగ్గర్నుంచి దీన్ని చూసుకోడంతోటే సరిపోతోంది" అన్నాడు తను—కానీ ఎంత విసిరి కొట్టినా దానికీ కదల బుద్ధి కాలేదులా వుంది మొండికేసి వుండిపోయింది

రోజులు గడుస్తున్న కొద్దీ రాజా గాడి కనిపెట్టిన పాలు తాగేయటం, తింటున్న కంచంలో మూతి పెట్టడం, అలమరలోని పెరుగు గాజు సామానులు తిరగతోయడం అది చేసేపనికి అంతూ పొంతూ లేకపోయింది

"మచ్చిక చేస్తే బాగానే వుంటుంది" అంది దేవి చివరికి

మౌనం వహించక తప్పలేదు

ఆ తర్వాత ఇది తిండికి వేరేకంచం

రాజాగాడి కాళ్ళమధ్య చేరి ఆటలు

దాని అల్లరికి హద్దేలేదు

యేదికే రాజాగాడు కూడా పిల్లి కంట పడితే చాలు దాంతో పరుగెడుతూ ఆటలు మొదలు పెట్టేవాడు



దర్శకత్వంలో నిర్మించిన "తాత-మనవడు" చిత్రం అఖండ విజయం సాధించి వంద రోజుల పండుగ జరుపుకోబోతోంది ఆరు కేంద్రాలలో శతదినోత్సవం జరుపుకొంటున్న ఈ చిత్రం వందరోజుల పండుగను హైదరాబాదు, విజయవాడ, తిరుపతి కేంద్రాలలో ఘనంగా జరపాలని ప్రయత్నిస్తున్నట్లు శ్రీ రాఘవ చెప్పారు



'రవీంద్ర ఆర్టు పిక్చర్స్ వారి పత్రికా విలేఖరుల గోష్ఠి సందర్భంగా మాట్లాడుతున్న చిత్ర నిర్మాత శ్రీ తమ్మారెడ్డి, కృష్ణమూర్తిగారు.

చిక్కు ప్రశ్న!

ప్రేమించి పెళ్ళిచేసుకోవడమా? పెళ్ళిచేసుకొని ప్రేమించుకోవడమా? ఇది విశదియలేని చిక్కు-ప్రశ్న. ఏది సరైనదో ...ర్థంగా చెప్పలేని స్థితిలో నేటిసమాజ... ఏది సరైనా వివాహబంధం పవిత్రభావానికి ఎవరైనా తలొగ్గక తప్పదు ఈ సత్యాన్ని పెద్దలు గ్రహించలేకపోతే పిల్లలు చొరవ తీసుకొనే విచిత్ర వివాహాలు చేసుకొంటారనే హెచ్చరికచేస్తూ ముందుకు రాబోతూంది భరణీ పిక్చర్స్‌వారి "విచిత్ర వివాహం" నటి, దర్శకురాలేగాక, సంగీత సాహిత్యాలలో విశేష ప్రజ్ఞాప్రాభవాలుగల పద్మశ్రీ భానుమతీ రామకృష్ణగారి దర్శకత్వంలో న్యూవేవ్ చిత్రంగా మలచబడుతున్న ఈ చిత్రంలో పద్మశ్రీ భానుమతి, గుమ్మడి, రాజనాల, పద్మనాభం, అల్లు రామలింగయ్య, చంద్రమోహన్, పొట్టిప్రసాద్, ముక్కామల, ప్రమీల, రమాప్రభ, త్యాగరాజు నటిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, సంగీతపర్యవేక్షణ చేపట్టిన పద్మశ్రీ భానుమతి కొన్ని సంభాషణలు కూడా రాశారు. సముద్రాల రామానుజం సంభాషణలు, సత్యం సంగీతం చేపట్టిన ఈ చిత్రం నవయుగ ద్వారా విడుదలవుతుంది.


JYOTI JULY
1973
Read No: 8
శ్రీవాణీ కంబైన్స్
స్నేహబంధ
కథ-నిర్మాత
స్క్రీన్‌ప్లే. దర్శకత్వం
COVER PRINTED AT RATHNA OFFSET PRINTERS, MADRAS-2

జ్యోతి

సెప్టెంబర్ 1973

ఒక రూపాయి

